సోమవారం
30•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 185
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



# చిన్నారుల ముఖాల్లో చిరునవ్వుకు సాటిలేదు

- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిన్నారుల అందమైన ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడం కంటే గొప్ప విషయమేముంటుందని మంత్రి కే తారకరామారావు అన్నారు. అందుకు కృషిచేస్తున్న తెలంగాణ పోలీసులను ట్విట్టర్ ద్వారా అభినందించారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లను ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ఈ విధంగా ట్వీట్‌చేశారు.



మర్రి చెన్నారెడ్డి శత జయంత్యుత్సవాలను ప్రారంభిస్తూ ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ ఉన్నారు.

# రాజనీతిజ్ఞుడు మర్రి చెన్నారెడ్డి

- ప్రజాస్వామ్య దేశంలో విధ్వంసకర పద్ధతి నిరసనలు సరైనవి కావు
- చెన్నారెడ్డి శత జయంత్యుత్సవాల ప్రారంభోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విధ్వంసకర, వినాశకర పద్ధతుల్లో నిరసనలు తెలుపడం ప్రజాస్వామ్య దేవాలయమైన భారత్‌కు చెడ్డ పేరు తెస్తాయని, శాంతియుత నిరసనల ద్వారానే చెప్పాలనుకొన్న అంశాన్ని చెప్పే వీలుంటుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అహింసాయుత జీవనమే భారత అస్తిత్వమనే విషయాన్ని మరువొద్దన్నారు. మర్రి చెన్నారెడ్డి పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ.. వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర కీలకమని గుర్తుచేశారు. హైదరాబాద్ మాదాపూర్ శిల్పకళావేదికపై దివంగత మర్రి చెన్నారెడ్డి శత జయంత్యుత్సవాలను ఉపరాష్ట్రపతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సంస్కరణలు, బీసీలకు రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో ఓటింగ్ వయసును 21 ఏండ్ల నుంచి 18 ఏండ్లకు తగ్గించడం, సెట్విన్ రూపకల్పన వంటి విషయాల్లో చెన్నారెడ్డి తీసుకొన్న చొరవ మరిచిపోలేనిదని చెప్పారు. ఈ సందర్భంగా మర్రి చెన్నారెడ్డి ట్రస్టు జాతీయ అవార్డును నీటిపారుదలరంగ నిపుణుడు టీ హనుమంతరావు తరపున ఆయన కుమారుడు విజయ్‌కుమార్ అందుకొన్నారు. కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తమిళనాడు మాజీ గవర్నర్ కే రోశయ్య, టీపీసీసీ పరిశీలకుడు ఆర్సీ కుంతియా, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వెంకటేశ్వర్‌రావు, ట్రస్ట్ కన్వీనర్ మర్రి శశిధర్ రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.






ట్రెస్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్. చిత్రంలో లోక్‌సత్తా నేత జయప్రకాశ్‌నారాయణ కూడా ఉన్నారు.

# విద్యారంగంలో పోటీతత్వం ఉండాలి

- ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలి
- ఆంగ్లభాష మోజులో మాతృభాషను మరవొద్దు
- రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యారంగంలో ప్రభుత్వ, ప్రైవేట్‌సంస్థల మధ్య పోటీతత్వం ఉండాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఈ పోటీతత్వం లక్ష్యం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమేనని చెప్పారు. ఆదివారం హైటెక్స్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో వినోద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల పిల్లలకు మెరుగైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యారంగానికి అన్నికాలాల్లో డిమాండ్ ఉంటుందని, రాబోయే రోజుల్లో 50 నుంచి 60 కోట్ల మంది చిన్నారులు స్కూల్‌కు వెళ్లే దశకు చేరుకుంటారని, దీంతో విద్యాసంస్థల ఆవశ్యకత పెరుగుతుందని వివరించారు. ఆంగ్ల భాషాపరిజ్ఞానం అవసరమేకానీ.. ఆ మోజులోపడి మాతృభాషను విస్మరించడం సరికాదని వినోద్‌కుమార్ అన్నారు. బోధనే ప్రధానవృత్తిగా ఉపాధ్యాయులు ముందుకు సాగాలని, ఉపాధికోసం ఉద్యోగం చేస్తున్నామన్న భావన ఉండకూడదని చెప్పారు. ప్రస్తుత విద్యావిధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉన్నదని, దీనిపై విస్తృతంగా చర్చ జరుగాలని అభిప్రాయపడ్డారు. ఏటా ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలు నిర్వహించాలని ట్రస్మా ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు వై శేఖర్‌రావు, నాయకులు ప్రసాదరావు, మధుసూదన్, భాషిత సుందర్, మానస గణేశ్, ప్రగతి ఆదినాథ్, వేదవ్యాస్, విద్యారంగ నిపుణులు అంజుమ్ బాబుఖాన్, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీటి గుంతలోపడి ఇద్దరు బాలురు దుర్మరణం

- ఉప్పల్‌లో విషాదం



ఇద్దరు బాలురు మృతికి కారణమైన గుంత

**ఉప్పల్:** క్రికెట్ బంతికోసం నీటిగుంతలోకి దిగిన ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉప్పల్ భగాయత్‌లోని హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లోని శాంతినగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఉప్పల్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లోకి క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇటీవల భవన నిర్మాణం కోసం తీసిన నీటిగుంతలో క్రికెట్ బంతి పడింది. పల్లెపు రేవంత్(14), పోలెపల్లి మనోహర్(14) బంతికోసం నీటి గుంతలోకి దిగి.. ఈత రాకపోవడంతో గుంతలో మునిగి మృతిచెందారు. వారితోపాటు వచ్చిన స్నేహితులు కేకలు వేసినా నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఎవరూ పట్టించుకోలేదు. అనంతరం స్నేహితులు కాలనీలోకి వెళ్లి సమాచారం అందించగా.. వారు మృతదేహాలను వెలికితీశారు. సమాచారం మందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించి.. మృతదేహాలను గాంధీ దవాఖానకు తరలించారు. మృతుల్లో రేవంత్ ఏడోతరగతి, మనోహర్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. విద్యార్థుల మృతితో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మున్సిపోల్స్‌లో టీఆర్‌ఎస్‌దే విజయం

- గజ్వేల్ అభివృద్ధికి సమిష్టిగా కృషిచేద్దాం
- పనిచేసేవారందరికీ పార్టీలో గుర్తింపు: ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- గులాబీ గూటికి చేరిన గజ్వేల్ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్/గజ్వేల్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీదే విజయమని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. అభివృద్ధిలో గజ్వేల్ ఊహించని విధంగా దూసుకెళ్తున్నదని, నాయకులంతా సమిష్టిగా అభివృద్ధిని మరింత పరుగులు తీయించాలని సూచించారు. గజ్వేల్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ కార్యదర్శి గుంటుకు మల్లేశం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పిడిచెడ్ నర్సింహాచారి, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఎస్టీసెల్ మాజీ అధ్యక్షుడు గాలెంక నర్సింహులుతోపాటు నాయకులు, కార్యకర్తలు ఆదివారం పెద్దసంఖ్యలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సారథ్యంలో హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో గజ్వేల్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. త్వరలో పంటపొలాలకు కాళేశ్వరం నీళ్లు వస్తాయని, అన్ని వర్గాలకు చేతినిండా పని లభిస్తుందని చెప్పారు. పార్టీలోని ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని, కష్టపడి పనిచేసే కార్యకర్తకు అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్‌లో టీఆర్‌ఎస్ పార్టీ ఏకపక్షం కావాలని, శ్రేణులు సమన్వయంతో పార్టీ అభ్యర్థులను ఏకగ్రీవ ఎంపిక కోసం కృషిచేయలని పిలుపునిచ్చారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, జాలిగామ ఎంపీటీసీ సభ్యుడు హనుమంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు, చంద్రయ్య, బ్రహ్మాచారి, మహేశ్‌చారి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, శ్యామ్, శ్రీనివాస్‌చారి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టీఆర్‌ఎస్వీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ సభ్యుడు పంగ మల్లేశం, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, గుంటుకు రాజు, విరాసత్, రమేశ్‌గౌడ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ సీనియర్ నాయకులకు కండువాలు కప్పి టీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కూడా ఉన్నారు.

### కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

గజ్వేల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేశం, నర్సింహచారి, నర్సింలు గుడ్‌బై చెప్పడంతో ఆ పార్టీ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ముఖ్యనాయకులు, కార్యకర్తలు పార్టీని వీడటంతో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కరువైనట్టు స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ ఉనికి కోల్పోయింది. 30 ఏండ్లుగా పార్టీలో ఉంటూ సేవలు అందించిన సీనియర్ నాయకులు సైతం పార్టీని వీడటంతో స్థానికంగా ఆ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు టీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ పెంచాయి. గత అన్ని ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టి భారీ మెజార్టీ అందించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ 20 వార్డులు టీఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో సొంతం కానున్నట్టు స్థానికులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌తోపాటు మిగతా పార్టీలకు అభ్యర్థుల కొరత, డిపాజిట్ల గల్లంతు తప్పదని చెప్తున్నారు.

# డిమాండ్ మేరకు యూరియా

- ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం
- ఎరువుల రేక్‌పాయింట్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డి తనిఖీలు



హైదరాబాద్ మూసాపేటలోని ఎరువుల రేక్‌పాయింట్‌లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి అవసరాలకు అనుగుణంగా ఎరువులను ఏవిధంగా అందుబాటులో ఉంచుతున్నారని తెలుసుకొనేందుకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం మూసాపేటలోని ఎరువుల రేక్‌పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి మెదక్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ఎరువులు సరఫరా చేసే ఈ రేక్‌పాయింట్‌లో స్టాక్ వివరాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. యాసంగిఅవసరాలకు 7.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాతో కలిపి 15.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువును కేటాయించాలన్నారు. ఈ నెలాఖరుకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌కు ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. నేటివరకు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.15 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 0.35 లక్షల మెట్రిక్ టన్నుల ఎన్పీకే బఫర్ స్టాక్‌ను 7,612 మంది డీలర్లు, సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. గోదావరి, కృష్ణానదులు పోటెత్తడంతో పంటల సాగు కూడా పెరిగిందని చెప్పారు. జిల్లాలవారీగా ఎరువుల డిమాండ్ వివరాలు తెలుసుకొని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జింక్ సల్ఫేట్ డిమాండ్‌ను బట్టి ఆయా కేంద్రాల్లో వెంటనే అందుబాటులో ఉంచాలని, స్టాక్ పాయింట్లలో ఎరువులు పాడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నిరంజన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.

# హలో.. నేను హరీశ్‌రావును

- పిల్లలపై దృష్టి పెట్టండి.. పదిలో పనుల్లోకి తీసుకెళ్లకండి
- పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ లింగాలఘనపురం:** 'హలో.. నేను హరీశ్‌రావును. జర పిల్లలపై శ్రద్ధ జూపండి. అసలే పదో తరగతి పరీక్షలు. పిల్లల్ని పనుల్లోకి తీసుకెళ్లకండి' అంటూ మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రసంగం సోషల్ మీడియాతోపాటు మొబైల్‌ఫోన్లలో విపరీతంగా ప్రజలను ఆకర్షిస్తున్నది. వివరాల్లోకి వెళితే.. మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లాలోని కంది హైస్కూల్‌ను శనివారం ఆకస్మిక తనఖీచేయగా.. విద్యార్థుల నుంచి సరైన సమాధానాలు రాకపోడంతో ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించిచేసిన ప్రసంగం ఆడియోను విడుదల చేశారు. 'నమస్తే.. నేను మీ హరీశ్‌రావును మాట్లాడుతున్నాను. ప్రతి విద్యార్థికి పదో తరగతి పరీక్షలు ప్రధానమైనవి. పాఠశాలల్లో కేవలం కొన్ని గంటలే విద్యార్థులుంటారు. మిగతా సమయమంతా ఇంటివద్దే ఉంటారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులుగా మీరూ దృష్టిసారించండి. టీవీ, మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉంచండి. పెండ్లిళ్లు, విందులు, వినోదాలకు తీసుకెళ్లకండి. వ్యవసాయ పనులకు తీసుకెళ్లకండి. పిల్లల భవిష్యత్ కంటే మనకేదీ ముఖ్యం కాదు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి బాధ్యతగా మీవంతు సాయం చేయండి. పదిలో 10/10 ఫలితాలు వచ్చేలా విద్యార్థుల తల్లిదండ్రులుగా మీరూ శ్రమించండి' అంటూ పలు సూచనలు చేశారు. ఈ ఆడియో ఒకరి నుంచి మరొకరి ఫార్వర్డ్ అవుతూ విశేషంగా ఆకర్షిస్తున్నది.



పీర్జాదిగూడలో నిర్వహించిన టీఆర్‌ఎస్ మహిళా చైతన్య సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ కూడా ఉన్నారు.

# పల్లె ప్రగతిలో ఆరు లక్ష్యాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

- రెండోవిడుత చేపట్టాల్సిన పనులపై స్పష్టత
- పారిశుద్ధ్య విధులు.. పచ్చదనం పెంచే బాధ్యతలు
- ఆర్థికపరమైన విధులు.. నిధుల సమీకరణకు మార్గాలు
- జనవరి 2న గ్రామసభలతో ప్రగతి మొదలు
- గ్రామకమిటీలు గుర్తించిన పనులకు ప్రాధాన్యం
- మరోసారి వెల్లువెత్తనున్న శ్రమదానాలు




రాష్ట్రంలో రెండోవిడుత పల్లె ప్రగతిలో ప్రధాన లక్ష్యాలను సూత్రీకరించారు. గతంలో నిర్వహించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ఈసారి మరిన్ని లక్ష్యాలను ముందుంచుకున్నారు. ప్రధానంగా ఆరు లక్ష్యాలతో కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 6 వరకు నిర్వహించిన పల్లెప్రగతిలో ఏండ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కరించడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న పల్లె ప్రగతి ప్రణాళిక రెండోవిడుత కొత్త సంవత్సరంలో మొదలుకానున్నది. జనవరి 2 నుంచి ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమానికి విధానాలను ఖరారుచేస్తూ జిల్లాలకు ఆదేశాలిచ్చారు. రెండోవిడుతలో కూడా ప్రతి గ్రామానికి మండలస్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమిస్తున్నారు. ప్రతి మండలానికి ఎంపీవో పర్యవేక్షణ చేయనుండగా.. కలెక్టర్ల ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుంది. మొదటివిడుతలో చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఆరు లక్ష్యాలతో రెండోవిడుతకు శ్రీకారం చుట్టనున్నారు. ఈసారి ఆర్థిక వనరులపై ప్రధానంగా దృష్టిపెట్టారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు.. స్థానికంగానూ వివిధరకాలుగా నిధులు సేకరించుకోవాలని అవగాహన కల్పించనున్నారు. ప్రతిపైసాను ఎలా సమకూర్చుకోవాలనే అంశాలను వివరించనున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు రూ.7,312 కోట్లు రానున్నాయి. సగటున ఒక్కో పంచాయతీకి రూ.8 లక్షలు అందనున్నాయి. ఉపాధి నిధులు కూడా ఈసారి ఎక్కువగానే వినియోగించుకోవచ్చు. అంతేకాకుండా స్వీయ ఆదాయం ద్వారా 500 జనాభా ఉన్న పంచాయతీలకు నెలకు లక్ష, పెద్ద పంచాయతీలకు రూ.4 లక్షల నుంచి 5 లక్షలు రానున్నాయి. రెండో విడుతలో భాగంగా జనవరి 2న తొలిరోజు గ్రామసభ నిర్వహించాలని, కార్యక్రమ ఉద్దేశాలను వివరించి, మొదటివిడుత పల్లె ప్రగతి నివేదికను చదివి వినిపించాలని ప్రభుత్వం సూచించింది. ఆదాయ, వ్యయాలను వివరించి.. ప్రజాభాగస్వామ్యాన్ని ఆహ్వానించాలని, గ్రామ ప్రణాళికలో సూచనలు తీసుకుని, శ్రమదానంతో పనులు చేసేవిధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

### 2020 వార్షిక ప్రణాళిక

ఈసారి గ్రామసభలో 2020–21 వార్షిక ప్రణాళికలను రూపొందించుకుని గ్రామసభల్లో ఆమోదం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రణాళికకు అనుగుణంగానే బడ్జెట్ రూపొందించుకోవాలని సూచించింది. అప్పులు, వేతనాలు, కరంట్ బిల్లుల చెల్లింపులన్నీ బడ్జెట్‌లో చేర్చాలి. నిధుల సమీకరణకు ప్రభుత్వం పలు మార్గాలను సూచించింది. బడ్జెట్‌తోపాటు స్వీయ ఆదాయం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీతో పాటు పలుఅంశాలను ప్రధానంగా సూచించింది. పంచాయతీ విధించే పన్నులు, ప్రత్యేక పన్ను, ఫ్యాక్టరీలు ఉంటే ప్రైవేట్ పన్నులు, వాటర్ ట్యాక్స్, జాతరలు, తీర్థయాత్రల పన్ను, వ్యాపార లైసెన్స్‌లు వసూలుచేయాలని సూచించింది. నిధుల సమీకరణ మార్గాల్లో భాగంగా రాష్ట్ర బడ్జెట్, ఫైనాన్స్ కమిషన్ నిధులు, నరేగా నిధులు, గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, శ్రమదానం, పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం ద్వారా నిధుల సేకరించడం, సీఎస్‌ఆర్ నిధులకు మార్గాలను సూచించారు. అదేవిధంగా దాతల విరాళాలు, వారిపేర్లు పంచాయతీ నోటీసు బోర్డుపై రాయాలని పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ అధికారుల నేతృత్వంలో 50 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయనున్నట్టు, ఈ బృందాలన్నీ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాయని ప్రభుత్వం సూచించింది. లక్ష్యాలు సాధించిన గ్రామాలకు ప్రోత్సాహకాలు, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయని తెలిపింది.

### నిధులు ఇలా

| | | |
|---|---|---|
| మొత్తం గ్రామ పంచాయతీలు | : | 12,751 |
| పంచాయతీల్లో జనాభా | : | 2,02,79,923 |
| మొత్తం విడుదలయ్యే నిధులు | : | రూ. 3244 కోట్లు (ఏడాదికి) |
| 14వ ఆర్థిక సంఘం నుంచి | : | రూ. 1628 కోట్లు |
| రాష్ట్రప్రభుత్వం ఇచ్చేనిధులు | : | రూ. 1616 కోట్లు (ఎస్‌ఎఫ్‌సీ, ఇతర గ్రాంట్లు) |
| ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు | : | రూ. 339 కోట్లు |
| ప్రతి ఏడాది | : | రూ.4,068 కోట్లు(సుమారు) |
| ప్రతి పంచాయతీకి (500) జనాభా లెక్కన విడుదలయ్యే నిధులు | : | 8 లక్షలు (సగటున) |

### ఇవీ లక్ష్యాలు

- గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవడం
- పచ్చదనం పెంచే కార్యక్రమాలు చేపట్టడం
- గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల విస్తృత భాగస్వామ్యాన్ని రూపొందించడం
- గ్రామాభివృద్ధికి వార్షిక ప్రణాళికలు తయారుచేయడం
- నియంత్రిత పద్ధతిలో నిధుల వినియోగం
- ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం మరింత పెంచడం

### దేశానికి తలమానికంగా తెలంగాణ పల్లెలు

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి



గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నది. కొత్త చట్టంతో గ్రామాలకు కొత్త బలం వచ్చింది. ఆర్థికంగా వనరులు సమకూర్చుకునేందుకు సమగ్ర ప్రణాళికలను సైతం వివరిస్తున్నాం. దాతలను ప్రజాప్రతినిధులమంతా కలిసి విజ్ఞప్తిచేస్తాం. కార్పొరేట్ కంపెనీల నుంచి కూడా నిధులు ఇచ్చేలా చూస్తాం. దేశంలోనే తెలంగాణ పల్లెలు తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దాలనే సీఎం కేసీఆర్ ఆలోచనావిధానానికి అనుగుణంగా పనిచేస్తున్నాం.

## సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం



సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు

- మహిళాభ్యున్నతికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట
- మహిళా చైతన్య సదస్సులో మంత్రులు తలసాని, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

**మేడిపల్లి:** దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళాభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పీర్జాదిగూడలో ఆదివారం నిర్వహించిన మహిళా చైతన్య సదస్సులో మంత్రి తలసానితోపాటు కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ ముఖ్యఅతిథులుగా ప్రసంగించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తోపాటు వింతంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తూ సీఎం కేసీఆర్ పెద్దన్నలా నిలిచారని మంత్రి తలసాని చెప్పారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ప్రభుత్వం అనేక రుణాలను మంజూరుచేస్తున్నదని, ప్రతి పేదింటి బిడ్డకు రూ.1,00,116 చొప్పున అందిస్తుండటంతో వారి ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తున్నదని తెలిపారు.

### ఆడపడుచుల రక్షణకు చర్యలు

ఆడపడుచుల రక్షణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటూనే వారిని అన్నిరంగాల్లో ముందంజలో నిలిపేందుకు శ్రద్ధచూపుతున్నారని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని పట్టణాలను అభివృద్ధిపథంలో పరుగులుతీయిస్తున్నారని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'మిషన్ కాకతీయ' దేశానికే ఆదర్శం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ కాకతీయ' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇలాంటి పథకం మరెక్కడా లేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కులం, మతం పేరుతో ప్రజలను విభజించి ఓట్లు దండుకొనేందుకు ప్రయత్నిస్తున్న విపక్షాలకు మున్సిపల్, కార్పొరేషన్ల ఎన్నికల్లో ఓటమి తథ్యమన్నారు.

### ముహూర్తం



సూర్యోదయం: 6.48 గంటలకు



సూర్యాస్తమయం: 5.42 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం చతుర్థి మ. 01:54 వరకు, తదుపరి పంచమి, ధనిష్ఠా రా. 10:47 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: ఉదయం 11:24 నుంచి 1:09 వరకు, రాహుకాలం: ఉదయం 8:09 నుంచి 9:32 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11:54 నుంచి 12:37 మరియు మ. 2:48 నుంచి 3:32 వరకు, వర్జ్యం: లేదు.

సోమవారం
30•12•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




# ఎస్సారార్‌కు నేడు అపర భగీరథుడు



- రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు సీఎం కేసీఆర్
- ముందుగా వేములవాడ రాజన్న దర్శనం
- ఆ తదుపరి ఎస్సారార్ వద్ద జలహారతి
- రోడ్డుమార్గంలో వస్తున్న ముఖ్యమంత్రి
- భారీగా స్వాగతం పలికేందుకు సన్నాహాలు
- అలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి గంగుల

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కాళేశ్వరం పథకంతో ఎత్తిపోసిన గోదావరి జలాలతో నిండుకుండలా మారిన శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయాన్ని అపర భగీరథుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం స్వయంగా వీక్షించనున్నారు. సమైక్యరాష్ట్రంలో వివక్షకు గురైన ఈ ప్రాజెక్టును స్వరాష్ట్రంలో పరుగులు పెట్టించి సకాలంలో పూర్తిచేయడమే కాదు.. యావత్తు తెలంగాణకు వాటర్‌హబ్‌గా మార్చిన అనంతరం తొలిసారిగా రోడ్డుమార్గంలో వస్తుండటంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నది. సోమవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి.. సిద్దిపేట –సిరిసిల్ల మీదుగా వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంటారు. రాజన్న దర్శనం అనంతరం ఉదయం 11.50 గంటలకు శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (ఎస్సారార్) చేరుకుంటారు. ఈ ప్రాజెక్టు పరిధిలో సుమారు 40 నిముషాలపాటు సీఎం ఉంటారు. ప్రాజెక్టుకు పూజలు చేసి, జలహారతి పట్టిన తదుపరి అక్కడి నుంచి బయలుదేరి కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌కు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చేరుకుంటారు. భోజనాల అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతారు. తిరిగి రోడ్డుమార్గంలోనే హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. సీఎం పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే, ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు కూడా పాల్గొంటారు.

**కళకళలాడుతున్న జలాశయం:** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని మానేరుపై మిడ్‌మానేరు (ప్రస్తుత శ్రీరాజరాజేశ్వర జలాశయం) చేపట్టారు. కానీ సమైక్య ప్రభుత్వాల వివక్షతో పనులు నత్తనడకన

మిగతా 4వ పేజీలో



## ఇంకా నటించాల్సి ఉన్నది

ఫాల్కే అవార్డు ప్రకటించినప్పుడు ఇక విశ్రాంతి తీసుకోవాలా అనే సందేహం కలిగింది: అమితాబ్

**ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్**

5



## విశ్వేశతీర్థ స్వామీజీ శివైక్యం

- అనారోగ్యంతో పరమపదించిన పెజావర మఠాధిపతి
- బెంగళూరు పూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలో ఉత్తరక్రియలు
- రామజన్మభూమి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వామీజీ
- ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చి పరమత సహనం చాటిన ఉదారవాది
- స్వామీజీ మృతిపట్ల ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల దిగ్భ్రాంతి

# సాటిలేని వాటర్ హబ్!

## తొలిదశలో 15 టీఎంసీలు.. మలిదశలో 25 టీఎంసీలు • శ్రీరాజరాజేశ్వర జలాశయం ప్రస్థానం



శభాష్‌పల్లి వంతెనపై నుంచి సముద్రంలా కనిపిస్తున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం బ్యాక్‌వాటర్

**తెలంగాణ ప్రభుత్వంలో రికార్డు సమయంలో నిర్మాణం, సాంకేతిక ప్రొటోకాల్ పూర్తి**

- అనుకున్న సమయంలోనే కాళేశ్వరజలాల వినియోగం
- సీఎం కేసీఆర్ సంకల్పానికి చేదోడుగా నిలిచిన ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు).. తెలంగాణ గోదావరిజలాలను వినియోగించుకోవడంలో కేంద్రబిందువు (వాటర్‌హబ్)గా నిలుస్తున్నది. కీలకమైన ఈ జలాశయం నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం రికార్డుల పరంపర కొనసాగించింది. ప్రాజెక్టును పూర్తిచేయడమేకాదు జలాశయాన్ని నింపడంలో అత్యంత ప్రధానమైన సాంకేతిక ప్రొటోకాల్ ప్రక్రియనూ తక్కువ సమయంలోనే పూర్తిచేసింది. డ్యాం భద్రత నివేదిక ప్రకారం రెండుదశల్లో జలాశయాన్ని నింపాల్సి ఉండగా.. 15 టీఎంసీల నిల్వ తర్వాత రిజర్వాయర్‌ను పూర్తిగా పరీక్షించి, మళ్లీ ఖాళీచేసి, తిరిగి 25 టీఎంసీల నిల్వ వరకు నీటిని నింపే క్రమం ఓ కీలకఘట్టంగా నిలిచింది. ముఖ్యంగా సీఎం కేసీఆర్ జలసంకల్పానికి నీటిపారుదలశాఖ ఇంజినీర్లు చేదోడుగా నిలువడంతో శ్రీరాజరాజేశ్వర జలాశయం జలకేతనం ఎగురవేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అందుబాటులోకి రాగానే ఆ జలాల్ని బీడు భూములకు తరలించడంలో ప్రస్తుతం కీలకభూమిక పోషిస్తున్నది. అనేక మైలురాళ్లను అధిగమిస్తూ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న జలాశయాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం సందర్శించి గోదారమ్మకు పూజలు నిర్వహించనున్నారు.

**తెలంగాణ ప్రభుత్వంలో పనుల పరుగులు**

శ్రీరాజరాజేశ్వర జలాశయం(ఎస్సారార్)గా పేరుమార్చిన మిడ్‌మానేరు డ్యాం నిర్మాణం 2006లో మొదలైంది. దాదాపు ఎనిమిదిన్నరేండ్లపాటు ఈ పనులు నత్తనడకన సాగాయి. చివరకు భూసేకరణ కూడా అస్తవ్యస్తంగా తయారైన క్రమంలో తెలంగాణ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టిసారించింది. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా

మిగతా 4వ పేజీలో

# షాన్‌దార్ హైదరాబాద్

## ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దుతాం

- వచ్చే ఏడాది టీహబ్-2, టీ వర్క్స్, ఫార్మాసిటీ ప్రారంభం
- ద్రవ్యోల్బణం, నిరుద్యోగితపై కేంద్రం సమాధానం చెప్పాలి
- నాకు మంత్రి పదవికన్నా పార్టీ పదవే విలువైనది
- 2019లో అన్ని జెడ్పీలను గెలువడం ఒక మంచి జ్ఞాపకం
- నన్ను అత్యధికంగా ప్రభావితం చేసే నాయకుడు కేసీఆరే
- మున్సిపల్ చట్టాన్ని కఠినంగా అమలుచేస్తాం
- ట్విట్టర్ ఆస్క్‌కేటీఆర్‌లో మంత్రి కేటీఆర్ సమాధానాలు

ట్విట్టర్ ట్రెండింగ్‌లో టాప్‌లో నిలిచిన కేటీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌ను అద్భుత నగరంగా, పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతామని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. హైదరాబాద్ నగరంలో సమగ్ర రోడ్ల నిర్వహణ ప్రారంభమైందని, త్వరలోనే మార్పు కనిపిస్తుందని తెలిపారు. దేశంలో తగ్గుతున్న ఆర్థికాభివృద్ధి, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై కేంద్రప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనన్నారు. తనకు మంత్రి పదవికన్నా పార్టీ పదవే విలువైనదని స్పష్టంచేశారు. 2009లో రోడ్లపైన తెలంగాణ కోసం ఉద్యమాలు చేసిన పరిస్థితి నుంచి 2019లో మంత్రిస్థాయిలో పాలన వరకు పరిణామక్రమాన్ని 'టెన్ ఇయర్స్ చాలెంజ్' అంటూ అభివర్ణించారు. 2019లో రాష్ట్రంలోని అన్ని జెడ్పీలను టీఆర్‌ఎస్ గెలుచుకోవడం ఒక మంచి జ్ఞాపకమని తెలిపారు. పౌరులకు అనేక ప్రయోజనాలు కల్పించే నూతన మున్సిపల్ చట్టాన్ని కఠినంగా అమలుచేస్తామని స్పష్టంచేశారు. ఆదివారం ట్విట్టర్ వేదికగా దాదాపు గంటన్నరపాటు సాగిన 'ఆస్క్‌కేటీఆర్'లో పలువురు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. ప్రభుత్వ ప్రాథమ్యాలు, పార్టీ కార్యక్రమాలు, వ్యక్తిగత అంశాలు, అభిరుచులు, సమకాలీన

మిగతా 4వ పేజీలో

## సూర్యుడి అధ్యయనానికి ఆదిత్య



- ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ వెల్లడి
- పాఠశాలలు, కళాశాలల్లో ఖగోళశాస్త్ర క్లబ్బులు ఏర్పాటుచేయాలని సూచన

III






## జనవరి 1 నుంచి నుమాయిష్

- పకడ్బందీగా ఏర్పాట్లు
- అగ్నిప్రమాదాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు
- నుమాయిష్‌తో నగరవాసికి ప్రత్యేక అనుబంధం
- ప్రారంభోత్సవానికి మంత్రులు మహమూద్ అలీ, తలసాని, మేయర్ బొంతు రామ్మోహన్
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

4



## ఆదిలాబాద్ అడవుల్లో పెద్దపులి అలజడి

**ఆరడుగుల** పొడవు.. నాలుగు అడుగుల ఎత్తుతో దృఢంగా ఉన్న పులి ఒకటి జత కోసం ఆదిలాబాద్ అడవుల్లో చక్కర్లు కొడుతున్నది. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని కోర్ ఏరియాతోపాటు మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్, చెన్నూరు అడవుల వరకు దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఇది కలియతిరుగుతున్నది.

4

# వణికిస్తున్న చలి

## అర్లి (టీ) @ 5 డిగ్రీలు

- ఆదిలాబాద్ జిల్లాలో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో కనిష్ఠం 5.5 డిగ్రీలుగా నమోదు
- గ్రేటర్ హైదరాబాద్‌లో 14.5గా రికార్డు
- శీతల గాలులతో వణుకుతున్న రాష్ట్రం
- అలర్ట్ ప్రకటించిన వాతావరణశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** రెండురోజులుగా రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోతున్నాయి. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా చలితీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మధ్యాహ్నం వేళ కొంత మేర ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ సాయంత్రం నుంచి మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. ఉదయం పూట మార్కెట్లకు

మిగతా 4వ పేజీలో



ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చలిమంట కాగుతున్న స్థానికులు

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 92.00 | రిటైల్ లైవ్ | 114.00 |
| డ్రెస్‌డ్ | 165.00 | స్కిన్‌లెస్ | 188.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 458.00 | రంగారెడ్డి | 461.00 |
| మెదక్ | 458.00 | కరీంనగర్ | 461.00 |
| వరంగల్ | 458.00 | డజన్ ధర | 69.00 |


మంచిర్యాల జన్నారం అటవీ డివిజన్‌లో స్థానికుల కంటపడిన అతిపెద్ద పులి


అటవీ అధికారులు గుర్తించిన అతిపెద్ద పులి అడుగు

# అతిపెద్ద పులి అలజడి

- ఆదిలాబాద్ అడవుల్లో బలిష్టమైన పులి జాడలు
- జతకోసం పులి సంచారం!

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అతిపెద్ద పులి అలజడి సృష్టిస్తున్నది. ఆరడుగుల పొడవు, నాలుగు అడుగుల ఎత్తుతో దృఢంగా ఉన్న పులి యుక్తవయసులో జతకోసం జోరుగా చక్కర్లు కొడుతున్నది. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని కోర్ ఏరియా, మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్, చెన్నూరు అడవులవరకు దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో కలియతిరుగుతున్నది. భారీ ఆకారంలో చలాకీగాఉన్న ఈ పెద్దపులికి అటవీ అధికారులు ఏ-1 అనే పేరు పెట్టారు. మహారాష్ట్ర తడోబా అడవుల నుంచి వచ్చినట్టుగా భావిస్తున్న ఈ పులి.. మహారాష్ట్ర తడోబా, అంధేరీ పెద్దపులుల అభయారణ్యం మొదలుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వరకు ఉన్న పులులలో అందమైన, అత్యంత బలిష్టమైనదిగా అధికారులు చెప్తున్నారు. మూడు నుంచి నాలుగేండ్ల మధ్య వయస్సు ఉండే ఈ పులి యుక్తవయస్సుకు రావడంతో జతకోసం అన్వేషిస్తున్నదన్నారు. ఈ పెద్దపులి పలుచోట్ల స్థానికుల కంటపడింది. దీని సంచారంతో కవ్వాల్ అభయారణ్యం, చెన్నూరు డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. అడుగుజాడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ దానికి ఎలాంటి అపాయం జరుగకుండా జాగ్రత్తపడుతున్నారు. ఇందుకు కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ పులి వేటలో ఆరితేరిందని గుర్తించారు. మంచిర్యాల జన్నారం అటవీ డివిజన్‌లో జన్నారం దండేపల్లి అడవుల గూండా మందమర్రి వైపు పయనిస్తున్నప్పుడు కొందరు స్థానికులు కెమెరాను క్లిక్‌మనిపించారు.

# దిగంబర కవి బైరవయ్య కన్నుమూత





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిగంబర కవులలో ఒకరైన బైరవయ్య (77) కన్నుమూశారు. ఈ నెల 19న ఆయన మృతిచెందగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. బైరవయ్య అసలుపేరు మన్మోహన్ సహాయ్. 1942 డిసెంబర్ 8న ఏపీలోని నరసాపురంలో జన్మించిన బైరవయ్య.. నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, మహాస్వప్నతో కలిసి దిగంబర కవులుగా పేరొందారు. బైరవయ్య 50కి పైగా కథలు రాశారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి సమీపంలోని దత్తిరాజేరు వద్ద వింద్యవాసి గ్రామంలో బైరవానందస్వామిగా పీఠాన్ని స్థాపించారు. సాహితీవేత్తలతో సంబంధాలు లేకపోవడంతో బైరవయ్య మృతి ఆలస్యంగా వెలుగుచూసింది.



# ఎస్సారార్‌కు నేడు అపర భగీరథుడు

మూడోపేజీ తరువాయి...

సాగాయి. తెలంగాణ సాధించుకున్న తర్వాత ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఉద్యమనేత కేసీఆర్ ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించారు. 2016లో ఈ ప్రాజెక్టు కట్టకు గండిపడిన సమయంలో సీఎం ఏరియల్ వ్యూ చేసి వెళ్లారు. ఆ తదుపరి మళ్లీ రావడం ఇదే మొదటిసారి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.115 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 2019 జూన్ 1 నుంచి ఇప్పటివరకు 46.469 టీఎంసీలు కాళేశ్వరం నుంచి ఎత్తిపోసినవే కావడం గమనార్హం. ముందుచూపుతో సీఎం తీసుకున్న నిర్ణయంతో మధ్యమానేరుకు భవిష్యత్‌లోనూ ఢోకాలేదన్న ధీమా పెరిగింది. అంతేకాదు.. యావత్తు తెలంగాణకు ఒక వాటర్‌హబ్‌గా మారనున్నది.


రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

### రాజన్నను దర్శించుకోనున్న సీఎం

2015 జూన్ 18న సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా వేములవాడ రాజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద శైవక్షేత్రమైన వేములవాడను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఆ మేరకు అనేక పనులు జరుగుతున్నాయి. వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థను ఇప్పటికే ఏర్పాటుచేశారు. ప్రాధికార సంస్థలో వేములవాడ పట్టణంతోపాటు పలు గ్రామాలను కూడా విలీనం చేయడమేకాకుండా ఆ ప్రాంతాలను అభివృద్ధిలోకి తీసుకొచ్చారు. రూ.96 కోట్లతో రాజన్న గుడి చెరువును అభివృద్ధి చేస్తున్నారు. ఆలయం విస్తీర్ణం 17 గుంటల్లో మాత్రమే ఉండగా.. ఏడాదికి సగటున కోటిన్నరకు పైగా వస్తున్న భక్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని పలు అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయాన్ని విస్తరించేందుకు గుడిచెరువులోని 35 ఎకరాల స్థలాన్ని సేకరించారు. శిఖం భూముల యజమానులతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు స్వయంగా చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.30 కోట్లు చెల్లించి, సేకరణ ప్రక్రియను చేపట్టింది. ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో భూసేకరణ, వేములవాడ పట్టణాభివృద్ధి, రాజన్న ఆలయాభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి గంగుల

ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లను పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సారార్ ప్రాజెక్టు వద్ద చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దు నుంచి వేములవాడ వరకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గం ప్రజలు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భారీ స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేశారు.

# వణికిస్తున్న చలి

మూడోపేజీ తరువాయి...

వచ్చే వ్యాపారులు, విద్యార్థులు అసౌకర్యాలకు గురవుతున్నారు. చలి నుంచి తప్పించుకునేందుకు చలి మంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఈశాన్య దిశనుంచి వీస్తున్న శీతలగాలులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ సూచించింది. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ)లో ఈ ఏడాది రికార్డుస్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 5 డిగ్రీలకు పడిపోయింది. శనివారం జిల్లాలో 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆదివారం మరింత పడిపోయాయి. దీంతో జిల్లాలోని వాతావరణం కశ్మీర్‌ను తలపిస్తున్నది. జిల్లాలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 6.5గా నమోదవడంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. తాంసిలో 6.2, తలమడుగు మండలం బరంపూర్ 7, జైనథ్ 7.1, బేల 7.1, ఆదిలాబాద్ 7.3, మావల 7.3, తలమడుగు 7.7, బోథ్ 8, పొచ్చర 8.3, గాదిగూడ 8.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో కూడా ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ఇక్కడ 5.5 డిగ్రీలుగా నమోదైంది. మంచిర్యాల జిల్లాలో 9.5, వికారాబాద్ 10.6, పెద్దపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ 12, వరంగల్ అర్బన్ 12.5, ములుగు 13, నిజామాబాద్, జగిత్యాల, వరంగల్ రూరల్, కరీంనగర్ 14, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి 14.5, వనపర్తి 14.8, సిద్దిపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి 15, జనగామ, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట 16, మెదక్ 16.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. సంగారెడ్డి జిల్లా పాషమైలారంలో 11.1, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేటలో 11.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణంలో చలి మంట కాగుతున్న ప్రజలు

# షాన్‌దార్ హైదరాబాద్

మూడోపేజీ తరువాయి...

రాజకీయ పరిస్థితులు ఈ చర్చలో చోటుచేసుకున్నాయి. ఈ కార్యక్రమం ట్విట్టర్ ట్రెండింగ్‌లో టాప్‌లో నిలిచింది. కేటీఆర్‌కు ట్విట్టర్‌లో దాదాపు 20 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

### మరింత ఆకర్షణీయంగా హైదరాబాద్

పర్యాటకపరంగా హైదరాబాద్ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రైవేటుసంస్థలకు అప్పగించామని, చార్మినార్ గోల్కొండ పర్యాటకక్షేత్రాలకు ప్రపంచ వారసత్వ కట్టడాలుగా గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. యూరప్, అమెరికా వంటి ప్రాంతాల నుంచి వచ్చేవారికి మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. హైదరాబాద్‌లో చేపట్టిన ఎస్సార్డీపీ ప్రాజెక్టులకు నిధులకొరత లేదని, భవిష్యత్‌కు అవసరమైన మౌలికవసతుల కల్పనే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో 50 ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్స్ నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. ఈ-బీఆర్టీఎస్ పద్ధతిలో కూకట్‌పల్లి- హైటెక్‌సిటీ -గచ్చిబౌలి ప్రాంతాలను కలిపే ప్రణాళిక ప్రారంభమైందని చెప్పారు. పాతబస్తీకి కూడా మెట్రోరైలు వస్తుందని తెలిపారు. ఇతర నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో తాగునీటి కొరత చాలా తక్కువగా ఉన్నదని, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తైన తర్వాత నీటి సరఫరా కొరత ఉండదని తెలిపారు. హైదరాబాద్ తూర్పు వైపు ఐటీ పరిశ్రమలను తీసుకువెళ్లేందుకు తాము చేస్తున్న ప్రయత్నానికి మంచి స్పందన వస్తున్నదని చెప్పారు. నగరంలో ఎంఐఎంతోపాటు ఆర్‌ఎస్‌ఎస్‌లాంటి సంస్థలకు సభలు నిర్వహించుకునేందుకు పోలీసులు అనుమతించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. 111 జీవో గురించి స్పందిస్తూ.. ఇందులో ఏదైనా మార్పుచేర్పులు అవసరమైతే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గోపనపల్లిలో విస్తృతంగా పెరుగుతున్న పలు గేటెడ్ కమ్యూనిటీలకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి రోడ్డులేదని, దీన్ని నూతన రోడ్డు నిర్మాణంలో కవర్ చేస్తామని చెప్పారు. ఎల్బీనగర్‌లో ఇప్పటికే ఒక ఫ్లైఓవర్ పూర్తయిందని, మరో మూడు ఫ్లైఓవర్లు వస్తాయన్నారు. వరంగల్ కుడా మాస్టర్‌ప్లాన్ జనవరి మొదటివారంలో ఉంటుందని వెల్లడించారు. నూతన మున్సిపల్ చట్టంతో పౌరులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. మున్సిపల్ అధికారుల విచక్షణతో సంబంధంలేకుండా ప్రజల అవసరాలు తీరుతాయని, ఈ మార్పులను వ్యవస్థీకృతం చేసేందుకు తన మున్సిపల్ శాఖ అధికారులతో నూతన చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని చెప్పారు. అనంతగిరి, వికారాబాద్ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, వాటి ఫలాలు త్వరలో చూస్తారని మంత్రి తెలిపారు.



### శాంతియుత రాష్ట్రం

తెలంగాణ రాష్ట్రం అనేక ఇతర రాష్ట్రాలతో పోలిస్తే శాంతియుతమైనదని, ఈ శాంతిని ఇలాగే కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్యం, విద్యతోపాటు పట్టణ, గ్రామీణ మౌలికవసతుల రంగాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశమున్నదని తెలిపారు.

### తెలంగాణ ప్రజలు తెలివైనవారు

ప్రజలను విభజించే ఎలాంటి ఎజెండానైనా ఎదుర్కొనేంత తెలివైనవారు తెలంగాణ ప్రజలని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ రాజకీయంగా బలోపేతంకావడానికి హిందు-ముస్లిం కమ్యూనల్ కార్డును వాడుతున్నదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం లేకున్నా రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు 60 లక్షలమంది కార్యకర్తలున్నారని, వారిద్వారా ప్రభుత్వ పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తీసుకుంటామని తెలిపారు.

### 2020లో టీహబ్-2

టీహబ్ రెండోదశ, టీ వర్క్స్ 2020 మొదటి అర్ధసంవత్సరంలో పూర్తవుతాయని, ఫార్మాసిటీ ప్రారంభమవుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. అంతర్జాతీయస్థాయి తయారీరంగ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకువస్తామని, ఇప్పటికే టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని వివరించారు. నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్‌గ్రోత్ అనే 'త్రీ ఐ' మంత్రాలను తమ ప్రభుత్వం పాటిస్తున్నదని చెప్పారు. పట్టణాభివృద్ధితోపాటు మౌలిక వసతులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

### ప్రజలను పక్కదారి పట్టిస్తున్న కేంద్రం చర్యలు

పౌరసత్వ సవరణ చట్టం అమలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని క్యాబినెట్ సరైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో వ్యతిరేకించినందుకు మద్దతుగా నిలుస్తున్న నెటిజన్లకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. కుంటుపడుతున్న ఆర్థికాభివృద్ధి, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు కేంద్ర ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. అంతిమంగా ఉద్యోగాల కల్పన, ఆర్థిక అభివృద్ధి వంటి అంశాల్లో కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు.

### జగన్ ఆరునెలల పాలన మంచి ప్రారంభం

రాష్ట్రం ఏర్పడినప్పుడు నాయకత్వ లేమితో తెలంగాణ తల్లడిల్లుతుందని కామెంట్ చేసిన పలువురు ఆంధ్ర ప్రజలు ఇప్పుడు ఆ రాష్ట్రంలో టీఆర్‌ఎస్ పోటీచేయాలని కోరడం, ఆ దిశగా తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నడిపించడం సంతోషంగా ఉన్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరునెలల పాలన మంచి ప్రారంభమని వ్యాఖ్యానించారు. ఏపీ మూడు రాజధానుల అంశం అక్కడి ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు.

### మంత్రిపదవికన్నా పార్టీ పదవే విలువైనది

తనను రాజకీయంగా అత్యధికంగా ప్రభావితం చేసే నాయకుడు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని మంత్రి కేటీఆర్ చెప్పారు. టీఆర్‌ఎస్ కార్యకర్తల కృషివల్లనే తనకు మంత్రిపదవి దక్కిందన్నారు. మంత్రిపదవి కన్నా పార్టీపదవే తనకు విలువైనదని స్పష్టం చేశారు. 2019లో అన్ని జిల్లా పరిషత్తులను టీఆర్‌ఎస్ గెలుచుకోవడం ఒక మంచి జ్ఞాపకంగా మిగిలిపోతుందని చెప్పారు. ప్రజల స్పందన సోషల్ మీడియా ద్వారా నేరుగా తెలుస్తుందని, తనపై మర్యాదపూర్వకమైన మీమ్‌లు (హాస్యపూరిత చిత్రాలు) వచ్చినా తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సినిమాల్లో నటించి సామాజిక సందేశం ఇవ్వాలని ఒక నెటిజన్ కోరడంపై కేటీఆర్ స్పందిస్తూ.. తనకు ఫుల్ టైం జాబ్ ఉన్నదని వ్యాఖ్యానించారు. చేనేత వస్త్రాలకు తాను పెద్ద అభిమానినని తెలిపారు. ప్రస్తుతతరం నూతన సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నదని, ప్రపంచంతో కనెక్ట్ అయిందని, ఎంటర్‌ప్రెన్యూరల్ లక్ష్యాలు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాజకీయాలు, ఆర్థికవ్యవస్థను బ్యాలెన్స్ చేయడం అతిపెద్ద సవాల్‌గా అభివర్ణించారు. ఇప్పటికే దాదాపు అందరు మంత్రులు సోషల్ మీడియాలో చురుకుగా ఉన్నారని తెలిపారు.



నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీ సెంట్రల్‌హాల్‌లో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

# జనవరి 1 నుంచి నుమాయిష్

పకడ్బందీగా ఏర్పాట్లు.. అగ్నిప్రమాదాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు

కొంతమంది కావాలనే సొసైటీపై తప్పుడు కేసులు

నుమాయిష్‌తో నగరవాసికి ప్రత్యేక అనుబంధం: మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గత ఏడాది నుమాయిష్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని వైద్యారోగ్య శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ తెలిపారు. ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ రక్షణ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేశారు. ఎగ్జిబిషన్‌లో స్మోకింగ్, స్టాళ్లలో గ్యాస్, కిరోసిన్ స్టౌవ్‌ల ఉపయోగంపై పూర్తిగా నిషేధం విధించామన్నారు. జనవరి 1 నుంచి ప్రారంభంకానున్న 80వ అఖిల భారత ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్- 2020 వివరాలను నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీ సెంట్రల్‌హాల్‌లో ఆదివారం మంత్రి మీడియాకు వెల్లడించారు. ప్రజల భద్రత, వసతులను దృష్టిలో ఉంచుకొని స్టాళ్ల సంఖ్యను తగ్గించామని చెప్పారు. ఎగ్జిబిషన్‌లో విశాలమైన స్టాళ్లు, రోడ్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 79 ఏండ్ల చరిత్రలో ఎప్పుడూ ఇబ్బంది కలుగలేదని, కానీ గత ఏడాది కొంత బాధ కలిగించే అగ్నిప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. నష్టపోయినవారందరినీ ఆదుకున్నామని చెప్పారు. ఈసారి రూ.3 కోట్లు వెచ్చించి పటిష్ఠ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగితే దానిని నివారించగల మెకానిజాన్ని ప్రతి స్టాల్‌లో ఏర్పాటుచేశామని తెలిపారు. భూగర్భ ఎలక్ట్రికల్ కేబులింగ్ ఏర్పాటుచేశామన్నారు. ప్రతి స్టాల్‌కు బీమా చేయించామని చెప్పారు. 40 మంది సిబ్బందికి అగ్నిమాపక శిక్షణ ఇచ్చి 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి రాష్ట్రం నుంచి తమ స్టాళ్లను ఏర్పాటుచేస్తారని, నుమాయిష్‌తో సంబంధం ఉన్నవాళ్లంతా తమ కుటుంబసభ్యులేనని అన్నారు. నగరవాసికి నుమాయిష్‌తో ప్రత్యేక అనుబంధం ఉన్నదని చెప్పారు. అందరూ కలిసి విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. సొసైటీ ద్వారా వచ్చిన ఆదాయంతో 18 కళాశాలల్లో.. 30 వేల మంది విద్యార్థులకు విద్యనందించగలిగామన్నారు.

### సొసైటీపై కేసులు విచారకరం

ఎగ్జిబిషన్ సొసైటీ ఎప్పుడూ వ్యాపార కోణంలోనే పనిచేయబోదని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. సొసైటీ ప్రైవేట్ సంస్థ కాదని అన్నారు. కొంతమంది కావాలనే సొసైటీపై తప్పుడు కేసులు వేస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ నేపథ్యం, గొప్పతనంపై కోర్టులకు కూడా సంపూర్ణమైన అవగాహన ఉన్నదన్నారు. సొసైటీ గొప్పతనాన్ని, గౌరవాన్ని, ఔన్నత్యాన్ని, సంప్రదాయాన్ని నిలబెట్టడంలో జడ్జీలు కూడా తమ పాత్ర నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్ హాజరవుతారని తెలిపారు. రాత్రి 11 గంటలవరకు మెట్రో రైళ్లను నడిపేందుకు మెట్రో యాజమాన్యం అంగీకరించిందని సొసైటీ సభ్యులు తెలిపారు. సురక్షితమైన, ఆహ్లాదకరమైన అనుభూతిని మిగిల్చేలా ఎగ్జిబిషన్ ఉంటుందని, 45 రోజులపాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సురేందర్, సెక్రటరీ బీ ప్రభా శంకర్, హనుమంత్ రావు, వినయ్‌కుమార్, ఎంసీ సభ్యులు సురేందర్, సతీశ్‌నాయక్ పాల్గొన్నారు.

# సాటిలేని వాటర్ హబ్!

మూడోపేజీ తరువాయి...

గోదావరిజలాల వినియోగాన్ని గణనీయంగా పెంచడంలో ఈ జలాశయ నిర్మాణం కీలకమని ముందుగా గుర్తించి.. రికార్డు సమయంలో పనులు పూర్తిచేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఎనిమిదిన్నరేండ్లపాటు మట్టి పని 33% జరగ్గా.. కాంక్రీట్ పని 9% మాత్రమే పూర్తయింది. గేట్ల బిగింపు ప్రసక్తే లేకపోయింది. అందుకే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2359 కోట్లలో అంతకాలం 36% నిధుల్ని మాత్రమే వెచ్చించగలిగారు. అందులోనూ భూసేకరణకు ఎక్కువ నిధులు వెచ్చించారే తప్ప పనులకు 20% లోపు మాత్రమే ఖర్చుచేశారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మాణ పనుల్లో చాలా వేగం పెరిగింది. కేవలం ఐదేండ్ల మూడునెలల వ్యవధిలోనే మిగిలిన పనులన్నీ పూర్తిచేయడంతోపాటు పనులు పూర్తయిన ఏడాదిలోనే పూర్తిస్థాయి సామర్థ్యం మేర నీటిని నిల్వ చేయడమనేది ఓ రికార్డు. అత్యంత క్లిష్టమైన భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ పనులు తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.

### నీటిని నింపడంలో అనేక మలుపులు

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2015లో శ్రీరాజరాజేశ్వర జలాశయ నిర్మాణ పనులు శరవేగంగా ముందుకు సాగాయి. దీంతో 2016లో సుమారు మూడు టీఎంసీల వరకు నీటిని నింపారు. గతంలో పనులు సక్రమంగా జరగకపోవడంతోపాటు ఊహించనిరీతిలో ఒకేసారి 2.50 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో జలాశయం ఎడమవైపు నిర్మించిన బండ్‌కు గండిపడింది. తెలంగాణ ప్రభుత్వం వెంటనే పునరుద్ధరణ పనులను పూర్తిచేస్తూనే ప్రధాన పనుల్ని కూడా వేగంగా కొనసాగించింది. దీంతో 2017లో 5.29 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగారు. 2018లో తొమ్మిది టీఎంసీలకు నిల్వ పెరిగింది. ఇక.. 2019లో అంటే ఈ ఏడాది పూర్తిస్థాయిలో నింపారు.

### ఒకే సీజన్‌లో ప్రొటోకాల్ పూర్తి

కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ఏడాది అందుబాటులోకి వస్తున్నందున ప్రభుత్వం శ్రీరాజరాజేశ్వర జలాశయాన్ని ముందుగానే సిద్ధంచేసింది. అందుకే ఈ ఏడాది సెప్టెంబర్‌లో తొలిసారిగా 15 టీఎంసీల వరకు నీటిని నింపింది. డ్యాం భద్రత నివేదిక ప్రకారం.. జలాశయంలో 15 టీఎంసీల వరకు నీటి నిల్వ చేసి, ఆపై సమగ్రంగా పరిశీలన చేసిన తర్వాత పూర్తిస్థాయిలో నింపాలని ఉన్నది. దీంతో 15 టీఎంసీల వరకు నీటిని నింపిన అధికారులు.. ఆగస్టు 29న బండ్‌పై ఒక చోట (2.550 కి.మీ పాయింట్ నుంచి 2.650 కి.మీ పాయింట్ వరకు) సీపేజీ అధికంగా ఉండటాన్ని గమనించారు. ఆపై చకాచకా జలాశయాన్ని ఖాళీచేశారు. దీంతోపాటు ఒకచోట బండ్ అవతల మట్టి రకం (లూజ్ పార్ట్స్) సరిగా లేకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులురాకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. నిపుణుల సూచనలు తీసుకొని ఎగువ, దిగువ రీచ్‌ల వద్ద దాదాపు 2.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రాక్‌టాయ్ నిర్మించారు. గ్రౌటింగ్ ప్రక్రియ కూడా చేపట్టారు. రివర్ స్లూయిస్ల దగ్గర ఏకంగా రెండు లక్షల ఇసుకబస్తాలు వేసి రింగ్‌బండ్ నిర్మాణాన్ని చేపట్టారు. తక్కువ సమయంలో ఈ పనులను పూర్తిచేయడంతోపాటు సాంకేతిక ప్రొటోకాల్‌లో భాగంగా సీపేజీ అనుమతి మేర (పర్మిటబుల్ సీపేజీ) ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటన్నింటినీ తక్కువ సమయంలో పూర్తిచేసి తిరిగి నవంబర్ 8వ తేదీ నుంచి జలాశయంలోకి నీటిని తరలించారు. అప్పటినుంచి ఇటీవలివరకు జలాశయంలో 25.10 టీఎంసీల నీటిని నిల్వచేశారు. పూర్తిస్థాయికి నిల్వ చేరుకోవడంతో ఇన్‌ఫ్లోను నిలిపివేశారు.


నీటితో కళకళ లాడుతున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం


ఎస్సారార్ స్లూయిజ్ వద్ద ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేసిన దృశ్యం(ఫైల్)


బండ్ కింద భూమి వదులుగా ఉన్న చోట మట్టి పోసి పటిష్ఠ జాగ్రత్తలు చేపట్టిన దృశ్యం(ఫైల్)


పనుల అనంతరం ఎస్సారార్ బండ్ (ఫైల్)

### శ్రీరాజరాజేశ్వర జలాశయ నిర్మాణ ప్రస్థానమిది..

| | నిర్మాణ పనులు (లక్షల క్యూ.మీ.) | | | నిధుల వినియోగం (రూ.కోట్లల్లో) | | | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| సమయం | మట్టి పని | కాంక్రీట్ పని | గేట్లు టన్నుల్లో | పనులు | భూసేకరణ | ఆర్‌అండ్‌ఆర్ | వ్యయం |
| 10.2.2006 నుంచి 2.6.2014 వరకు (8 సంవత్సరాల 4 నెలలు) | 47 | 0.51 | - | 107 | 571 | 160 | 838 |
| 2.6.2014 నుంచి 3.8.2019 వరకు (5 సంవత్సరాల 3 నెలలు) | 93 | 5.07 | 3,500 | 635 | 684 | 202 | 1,521 |
| మొత్తం | 140 | 5.58 | 3,500 | 742 | 1,255 | 362 | 2,359 |

### శ్రీరాజరాజేశ్వర జలాశయ ప్రయోజనాలివి..

- కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కేంద్ర బిందువు (వాటర్ హబ్)గా సేవలు అందిస్తుంది.
- కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-9 నుంచి 14 వరకు చేపట్టే పనుల ద్వారా బీడు భూములకు తరలించే గోదావరిజలాల్ని ఈ జలాశయం నుంచి తీసుకుంటారు.
- జలాశయం పరిధిలో పాత కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని 2,32,814 ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- మిషన్ భగీరథ ద్వారా 466 ఆవాసాలకు మంచినీరు అందిస్తారు.
- ఎస్సారెస్పీ ద్వారా నిన్నటివరకు నీటిని అందుకున్న లోయర్ మానేరు డ్యాంకు ఇక నుంచి ఇదే జలాశయం ద్వారా గోదావరిజలాలు అందనున్నాయి. అంటే ఎల్‌ఎండీ దిగువన ఉన్న ఎస్సారెస్పీ-1, 2 దశల్లోని ఆయకట్టుకు కూడా ఈ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందనుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటివరకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా 46.500 టీఎంసీల నీటిని అందుకున్న ఈ రిజర్వాయర్.. వాటిలో 29.150 టీఎంసీల నీటిని ఎల్‌ఎండీకి అందించింది.
- ప్రసిద్ధ వేములవాడ ఆలయ పరిధిలోని గుడిచెరువును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ చెరువుకు నీటిని కూడా ఈ జలాశయం నుంచి ఒక లిఫ్టును ఏర్పాటుచేసి అందించనున్నారు.

## సీడీఎస్ పదవీ విరమణ వయసు 65 ఏండ్లు!

నిబంధనలు సవరించిన రక్షణ శాఖ

**న్యూఢిల్లీ:** రక్షణ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) పదవీ విరమణ వయసును 65 ఏండ్లుగా కేంద్రం నిర్ణయించింది. అందుకనుగుణంగా సైన్యం, నౌకాదళం, వాయు సేన సర్వీసు నిబంధనలను సవరించింది. సీడీఎస్ పదవీకాలం ఎంతన్నది మాత్రం వెల్లడించలేదు. ప్రభుత్వానికి మిలిటరీ అడ్వైజర్‌గా సీడీఎస్ వ్యవహరిస్తారు. సీడీఎస్ పదవికి కేంద్ర క్యాబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. సైన్యాధిపతి బిపిన్ రావత్ దేశ తొలి సీడీఎస్‌గా నియమితులయ్యే అవకాశమున్నదని వార్తలు వెలువడుతున్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం త్రివిధ దళాల అధిపతులు మూడేండ్లపాటు లేదా 62 ఏండ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) పదవిలో ఉంటారు. త్రివిధ దళాధిపతుల్లో ఒకరిని సీడీఎస్‌గా నియమించనున్న నేపథ్యంలో తాజా సవరణలు చేశారు. సీడీఎస్ పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఎలాంటి ప్రభుత్వ పదవిని చేపట్టడానికి వీలుండదు. అలాగే ఐదేండ్ల వరకు ప్రభుత్వ అనుమతి లేనిదే ఏ ప్రైవేట్ ఉద్యోగంలోనూ చేరకూడదు.

## ముస్లిం చిన్నారులను నిర్బంధిస్తున్న చైనా

- బోర్డింగ్ స్కూళ్లకు దాదాపు ఐదు లక్షల మంది తరలింపు
- తల్లిదండ్రులకు దూరమై వేదన అనుభవిస్తున్న చిన్నారులు

**హోటన్:** చైనా సర్కార్ అభంశుభం తెలియని ముస్లిం చిన్నారులపై ఉక్కుపాదం మోపుతున్నది. దేశంలో ముస్లింల సంఖ్యను తగ్గించేందుకు జిన్‌పింగ్ ప్రభుత్వం గత మూడేండ్లలో పది లక్షల మందికిపైగా ముస్లింలపై అక్రమ వలసదారుల ముద్ర వేసి నిర్బంధ కేంద్రాలకు, జైళ్లకు తరలించింది. ఇప్పుడు ముస్లిం చిన్నారులను బలవంతంగా తల్లిదండ్రుల నుంచి వేరు చేసి బోర్డింగ్ స్కూళ్లకు పంపుతున్నది. జిన్‌జియాంగ్ ప్రావిన్స్ పశ్చిమ ప్రాంతంలో బోర్డింగ్ స్కూళ్ల పేరుతో తెరిచిన వందల పాఠశాలల్లోకి ఇప్పటివరకు దాదాపు 5 లక్షల మంది పిల్లలను తరలించినట్టు నివేదికలు చెప్తున్నాయి. ఊహ తెలియని వయసులో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులంతా నరకయాతన అనుభవిస్తున్నారు. ఇవీ ఒక రకమైన నిర్బంధ కేంద్రాలయ్యాయి. పేదరికంతో ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్న శరణార్థుల పిల్లలకు మంచి విద్య అందించేందుకే ఈ పాఠశాలలను ప్రారంభించామని అధికారులు చెప్తున్నారు.



ముస్లిం పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం పడకుండా చేసేందుకు ఈ స్కూళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం 2017లో చెప్పింది. వీటి చుట్టూ భద్రత కల్పిస్తున్నారు. వీటిపై మీడియాకు చెప్పిన వారిని అరెస్ట్ చేస్తున్నారు.

## లైంగిక దోపిడీ బారిన.. 19 వేల మంది చిన్నారులు

బ్రిటన్ ప్రభుత్వ తాజా గణాంకాల్లో వెల్లడి



**లండన్:** గత ఏడాది బ్రిటన్‌లో దాదాపు 19 వేలమంది పిల్లలు లైంగిక వేధింపుల బారిన పడినట్టు ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడైంది. ఐదేండ్ల క్రితం దేశంలో దాదాపు 3,300 మంది చిన్నారులు లైంగిక వేధింపులకు గురయ్యారని, 2018-19లో ఇది 18,700కు చేరిందని అధికారులు అన్నారు. ప్రభుత్వ గణాంకాలు వాస్తవాలను తెలపడంలేదని, లైంగిక వేధింపుల బారిన పడుతున్న చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నదని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ప్రముఖుల పిల్లలపై లైంగిక వేధింపులు జరిగినట్టు కొన్ని రోజులుగా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఈ కేసుల విచారణను అధికారులు చేపట్టడంతో లైంగిక వేధింపుల కోణం వెల్లడైంది. బ్రిటన్‌లోని లంకాషైర్, బర్మింగ్‌హోమ్, బ్రాడ్‌ఫోర్డ్ ప్రాంతాల్లో ఎక్కువగా చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతున్నట్టు తేలింది.



## విశ్రాంతి తీసుకోను!

ఇంకా నటించాల్సి ఉన్నది.. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ వ్యాఖ్య

రాష్ట్రపతి చేతుల మీదుగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు స్వీకరణ

జాతీయ సినీ అవార్డుల గ్రహీతలకు కోవింద్ తేనీటి విందు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** తాను ఇంకా నటించాల్సి ఉన్నదని, సినిమా అవకాశాలూ బాగానే వస్తున్నాయని ప్రముఖ బాలీవుడ్ మెగాస్టార్ అబితాబ్ బచ్చన్ తెలిపారు. తాను సినిమాల నుంచి ఇప్పుడప్పుడే రిటైర్డ్ కావడం లేదని పరోక్షంగా సంకేతమిచ్చారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అమితాబ్ స్వీకరించారు. అనారోగ్యం వల్ల ఇటీవల జరిగిన జాతీయ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును ఆయన స్వీకరించలేకపోయారు. కాగా, జాతీయ సినీ అవార్డుల గ్రహీతలకు రాష్ట్రపతి ఆదివారం తేనీటి విందు ఇచ్చారు. అమితాబ్‌కు ఫాల్కే అవార్డును కోవింద్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ.. తనకు ఫాల్కే అవార్డు ప్రకటించినప్పుడు తాను విశ్రాంతి తీసుకోవాలని ఇది గుర్తుచేస్తున్నదా అన్న సందేహం కలిగిందని అయితే తాను ఇంకా నటించాల్సి ఉందన్నారు. ఇప్పుడే విశ్రాంతి తీసుకోబోనని పరోక్షంగా చెబుతూ చలోక్తులు విసిరారు. తనను ప్రోత్సహించిన వారికి ధన్యవాదాలు చెప్పారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ఇవ్వడం ప్రారంభించి 50 ఏండ్లయిందని, తనకూ 50 ఏండ్లుగా సినీ ప్రపంచంలో పని చేసే భాగ్యం లభించిందన్నారు. ఈ అవార్డును వినయంతో స్వీకరిస్తున్నానన్నారు. భార్య జయా బచ్చన్, కుమారుడు అభిషేక్ బచ్చన్‌తో కలిసి ఈ వేడుకలో పాల్గొన్నారు. భారతీయ సినీ పితామహుడు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే పేరుతో ఏర్పాటు చేసిన ఈ అవార్డును 1969 నుంచి ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డు కింద బంగారు పతకం, శాలువాతోపాటు పది లక్షల నగదు బహుమతిని అందజేస్తారు.

**1969లో అమితాబ్ సినీ రంగ ప్రవేశం**

1942లో జన్మించిన అమితాబ్ 1969లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ఆయన నటించిన తొలి చిత్రం 'సాత్ హిందుస్థానీ' అంతగా విజయవంతం కాలేదు. 1972లో 'జంజీర్'తో అమితాబ్ దశ తిరిగింది. దీవార్, షోలే, మిస్టర్ నట్వర్‌లాల్, లవారిస్, ముకద్దర్ కా సికందర్, త్రిశూల్, శక్తి, కాలా పత్థర్ సినిమాల్లో రాణించి గుర్తింపును పొందారు. 1980 దశకంలో కుదేలైన అమితాబ్‌కు అగ్నీపత్ (1990)చిత్రం తొలి జాతీయ సినీ అవార్డును తెచ్చిపెట్టింది. తర్వాత పలు చిత్రాల్లో విలక్షణ పాత్రలను పోషించారు. మరో 3 జాతీయ సినీ అవార్డులు వరించాయి. 1984లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2015లో పద్మ విభూషణ్ పురస్కారాలతో భారత ప్రభుత్వం సత్కరించింది. బిగ్‌బీ బుల్లితెరపైనా ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షో అత్యధిక ప్రేక్షకాదరణ పొందింది.

## నేడు మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ

**ముంబై:** మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే సోమవారం తన క్యాబినెట్‌ను విస్తరించనున్నారు. ఎన్సీపీ నేత అజిత్ పవార్‌కు తిరిగి డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టే అవకాశాలున్నాయి. అలాగే ఆ పార్టీ నేత నవాబ్ మాలిక్, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్‌లకు కూడా క్యాబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉన్నది. మొత్తంగా క్యాబినెట్‌లో కాంగ్రెస్ నుంచి 12 మంది, ఎన్సీపీ నుంచి 16 మంది, శివసేన నుంచి 15 మంది ఉండనున్నట్లు తెలుస్తున్నది.

# విశ్వేశతీర్థ స్వామీజీ శివైక్యం

- అనారోగ్యంతో పరమపదించిన పెజావర మఠాధిపతి
- బెంగళూరులోని పూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలో అంత్యక్రియలు
- రామజన్మభూమి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వామీజీ
- ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చి పరమత సహనం చాటిన ఉదారవాది
- స్వామీజీ మృతిపట్ల ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల దిగ్భ్రాంతి
- మూడు రోజల సంతాప దినాలు ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వం



**ఉడుపి, డిసెంబర్ 29:** ప్రఖ్యాత ఆధ్యాత్మిక వేత్త, పెజావర మఠాధిపతి విశ్వేశ తీర్థ స్వామీజీ (88) శివైక్యం చెందారు. గత కొన్ని రోజులుగా అస్వస్థులుగా ఉన్న ఆయన ఆదివారం ఉదయం పెజావర మఠంలో పరమపదించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఈ నెల 19న స్వామీజీని మణిపాల్ సమీపంలోని కేఎంసీ దవాఖానలో చేర్చారు. శనివారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో స్వామీజీ కోరిక మేరకు పెజావర్ మఠానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆయన కన్నుమూశారు. బెంగళూరులోని పూర్ణప్రజ్ఞ విద్యాపీఠంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. స్వామీజీ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కర్ణాటక సీఎం యెడియూరప్ప, వివిధ మఠాధిపతులు సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కర్ణాటక ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. స్వామీజీ అస్తమయంతో ఆయన భక్తజనం శోకసంద్రంలో మునిగిపోయారు.

**ప్రముఖుల నివాళులు..**

స్వామీజీ పార్థివదేహాన్ని తొలుత ఉడుపిలోని ఉజ్జర్‌జడ్ మైదానానికి అనంతరం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో బెంగళూరులోని నేషనల్ కాలేజ్ మైదానానికి తరలించారు. సీఎం యెడియూరప్ప స్వామీజీ పార్థివ దేహంపై జాతీయ జెండా కప్పి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం గోవింద్ కర్జోల్, మంత్రి అశోకా, బీజేపీ నేతలు ఉమాభారతి, రామ్‌మాధవ్, వివిధ మఠాధిపతులు, సంఘ్‌పరివార్ నేతలు, వేలాదిమంది భక్తులు స్వామీజీని చివరిసారిగా దర్శించుకున్నారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో పూర్ణ ప్రజ్ఞ విద్యాపీఠంలో స్వామీజీ అంత్యక్రియలు నిర్వహించారు.

**అధిక పర్యాయాలతో రికార్డు..**

800 ఏండ్ల కిందట ద్వైత సిద్ధాంత బోధకులు శ్రీ మద్వాచార్యులు ఉడుపిలో నెలకొల్పిన అష్ట మఠాల్లో పెజావర మఠం ఒకటి. ఈ మఠాధిపతుల్లోకెల్లా విశ్వేశ తీర్థ స్వామీజీ సీనియర్. పెజావర మఠానికి ఆయన 32వ అధిపతి. ఉడుపి శ్రీకృష్ణ ఆలయంలో సోడె మఠాధిపతి శ్రీ వాదిరాజా స్వామీజీ తర్వాత ఐదు 'పర్యాయాలు' పూర్తిచేసుకున్నది విశ్వేశ తీర్థనే కావడం విశేషం. శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించే హక్కులను ప్రతి రెండేండ్లకొకసారి అష్ట మఠాధిపతుల మధ్య బదిలీ చేసే ప్రక్రియనే 'పర్యాయ'గా వ్యవహరిస్తారు. పెజావర్ మఠానికి తన వారసుడిగా శ్రీ విశ్వప్రసన్న తీర్థను స్వామీజీ ఇదివరకే ప్రకటించారు.

**బెంగళూరులో పూర్ణప్రజ్ఞ విద్యాపీఠం స్థాపన**

ప్రాచీన సంస్కృతులు, శ్రీ మద్వాచార్యుల తత్వ బోధనలను పరిరక్షించే ఉద్దేశంతో విశ్వేశ తీర్థ 1956లో బెంగళూరులో పూర్ణప్రజ్ఞ విద్యాపీఠం పేరిట ఒక గురుకులాన్ని నెలకొల్పారు. 2017లో రంజాన్ మాసంలో శ్రీకృష్ణ మఠం వెలుపల ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కొన్ని హిందూ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. స్వయంగా ఆయనే ముస్లింలకు ఖర్జూరాలు అందజేశారు. వీహెచ్‌పీతో అనుబంధం పైనా, మాంసాహారానికి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలపైనా స్వామీజీ విమర్శలు ఎదుర్కొన్నారు. మరోవైపు, మతమార్పిడులకు వ్యతిరేకంగా ఆయన గొంతెత్తారు. తమిళనాడులోని మీనాక్షిపురంలో ఇతర మతంలో చేరిన దళితులను తిరిగి హిందూమతంలో చేర్చే కార్యక్రమం చేపట్టారు. అయోధ్య తీర్పు నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన శాంతి సమావేశానికి స్వామీజీ హాజరయ్యారు. తీర్పు తర్వాత హిందువులు కానీ, ముస్లింలు కానీ విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తే నిరాహారదీక్ష చేస్తానంటూ హెచ్చరించారు.

**ఇఫ్తార్ ఇచ్చిన లౌకికవాది**

1931 ఏప్రిల్ 27న కర్ణాటకలోని రామకుంజలో నారాయణాచార్య, కమలమ్మ దంపతులకు రెండో సంతానంగా విశ్వేశతీర్థ జన్మించారు. స్వామీజీ అసలు పేరు వెంకటరమణ. తన ఎనిమిదో ఏట నాటి పెజావర మఠాధిపతి శ్రీ విశ్వమాన్య తీర్థ వద్ద సన్యాసం స్వీకరించారు. హిందూ ధర్మ ప్రచారం కోసమే జీవితాన్ని అంకితం చేసిన స్వామీజీ ఉదార వ్యక్తిత్వం కలవారు. హిందూ వాణిని ఆయన బలంగా వినిపించేవారు. అయోధ్య రామజన్మభూమి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. బలమైన హిందుత్వ వాదిగా కనబడినప్పటికీ.. రంజాన్ పర్వదినాన ఉడుపిలోని శ్రీకృష్ణ ఆలయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన తెగువ స్వామీజీది. దళితులు హిందూ సమాజంలో అంతర్భాగమేనని పేర్కొంటూ పలు సామాజిక కార్యక్రమాలను ప్రారంభించారు. దళితవాడలను సందర్శించారు. దళితులతో సహభోజనం చేశారు. విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ)తోపాటు బీజేపీ అధినాయకత్వంతో స్వామీజీకి సన్నిహిత సంబంధాలున్నాయి. రాజకీయాల్లో తనకు ఎందరో భక్తులు ఉన్నప్పటికీ ఆధ్యాత్మిక నేతలు ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించడాన్ని స్వామీజీ వ్యతిరేకించేవారు.

> **లక్షలాది** మంది హృదయాల్లో ఉడుపి చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రజలకు ఆయన నిరంతరం మార్గదర్శకుడిగా నిలిచారు. సేవ, ఆధ్యాత్మికతకు స్వామీజీ పవర్‌హౌస్ లాంటివారు. కారుణ్య సమాజం కోసం ఎల్లవేళలా శ్రమించారు. స్వామీజీని అనేకమార్లు కలిసే అవకాశం రావడం నా అదృష్టం. ఇటీవల గురుపౌర్ణమి సందర్భంగా స్వామీజీని కలువడం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భక్తజనానికి నా ప్రగాఢ సంతాపం.
>
> **-ప్రధాని మోదీ**

> **హిందూ** మతం గొప్ప మార్గదర్శకుడిని కోల్పోయింది. హిందూ ధర్మం అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అజరామరం. అయోధ్య రామ మందిర నిర్మాణం సాకారం కాకమునుపే స్వామీజీ శివైక్యం చెందడం బాధాకరం.
>
> **-యెడియూరప్ప, కర్ణాటక సీఎం**

**హిందూ జాతికి తీరని లోటు**

**శారదా పీఠాధిపతుల సంతాపం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెజావర మఠాధిపతి విశ్వేశ తీర్థ స్వామీజీ పరమపదించడంపై విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర విచారం వ్యక్తం చేశారు. విశ్వేశ తీర్థ మరణం హిందూ జాతికి తీరని లోటని పేర్కొన్నారు. హిందూ సమాజం గర్వించదగ్గ మత గురువుల్లో ఆయన ఒకరని కొనియాడారు. శ్రీమద్వాచార్యుని ప్రధాన శిష్యులు అధోక్షజ తీర్థ నుంచి వేదాంతంపై సంపాదించిన పట్టుతో హిందూ ధర్మ పరిరక్షణకు విశ్వేశతీర్థ పాటుపడ్డారని కొనియాడారు.

## క్రూరంగా ప్రవర్తించారు!

ప్రియాంకాగాంధీ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** సీఏఏకి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న వాళ్లపై క్రూరంగా ప్రవర్తిస్తున్న యూపీ సర్కారు తన పరిధులను ఎప్పుడో దాటిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మండిపడ్డారు. హింసాత్మక నిరసనల్లో పాల్గొనకపోయినప్పటికీ కాంగ్రెస్ కార్యకర్త సదాఫ్ జఫార్‌ను పోలీసులు అరెస్టు చేశారని ఆమె అన్నారు. అయితే, ప్రియాంక ఆరోపణల్ని యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య కొట్టివేశారు. నాటకీయ ప్రదర్శనలకు ఓట్లు రాలవని ఎద్దేవా చేశారు. ప్రియాంక పట్ల యూపీ పోలీసులు వ్యవహరించిన తీరును ఆమె భర్త రాబర్ట్ వాద్రా ఖండించారు. మరోవైపు, దారాపురి ఇంటికి వెళ్లేందుకు ప్రియాంక శనివారం ద్విచక్రవాహనంపై బయల్దేరడం తెలిసిందే. అయితే, వాహనం నడుపుతున్న సమయంలో సదరు వాహనదారుడు హెల్మెట్ ధరించలేదని పేర్కొంటూ స్కూటరిస్టుకు పోలీసులు రూ.6,300 జరిమానా విధించారు.

# జార్ఖండ్ గద్దెపై రెండోసారి హేమంత్

- హాజరైన ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు
- సోరేన్‌తో పాటు మంత్రులుగా మరో ముగ్గురు ప్రమాణం
- శుభాకాంక్షలు తెలిపిన మోదీ



ప్రమాణస్వీకార వేదికపై ప్రతిపక్ష నేతల అభివాదం.. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న హేమంత్ సోరేన్

**రాంచీ, డిసెంబర్ 29:** జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరేన్ జార్ఖండ్ 11వ ముఖ్యమంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. సోరేన్ ప్రమాణం చేస్తున్న రోజును రాష్ట్రంలో ఓ కొత్త శకానికి నాంది పలుకుతున్న 'సంకల్ప్ దివస్'గా ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. రాంచీలోని మొహ్రాబాది మైదానంలో జరిగిన ఈ ప్రమాణస్వీకారోత్సవానికి వివిధ పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్‌భఘేల్, జేఎంఎం అధినేత, జార్ఖండ్ మాజీ సీఎం శిబు సోరేన్, జార్ఖండ్ మాజీ సీఎం రఘుబర్‌దాస్, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ఆయన సోదరి కనిమొళి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. విపక్ష పార్టీల ప్రముఖ నేతలు హాజరైన ఈ కార్యక్రమం చాలాకాలం తరువాత దేశంలో ప్రతిపక్షాల 'సమైక్యత'గా కొందరు అభివర్ణించారు. సోరేన్ గతంలోనూ జార్ఖండ్‌కు సీఎంగా పనిచేశారు. 2013-14లో ఆయన సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. సోరేన్‌తో పాటు మాజీ అసెంబ్లీ స్పీకర్, కాంగ్రెస్ నేత ఆలంగిర్ ఆలం, జార్ఖండ్ పీసీసీ అధ్యక్షుడు రామేశ్వర్ ఓరన్, ఆర్జేడీ ఎమ్మెల్యే సత్యానంద్ భోక్తా మంత్రులుగా ప్రమాణం చేశారు. 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి 47 సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే.

**సహకారం అందిస్తాం: ప్రధాని మోదీ**

జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా ఆదివారం ప్రమాణం చేసిన హేమంత్ సోరేన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.



# పెరిగిన 'సోషల్' స్వరం

ప్రజల గొంతుకగా సోషల్ మీడియా ■ స్వేచ్ఛగా అభిప్రాయాల వెల్లడి

సీఏఏ, ఆర్టికల్ 370 రద్దుపై విస్తృత చర్చ ■ పెరిగిన నకిలీ వార్తల ప్రచారం




**న్యూఢిల్లీ, డిసెంబర్ 29**: దేశంలో సోషల్‌మీడియా ఆన్‌లైన్ స్నేహాలు, చాటింగ్‌ల స్థాయిని దాటి ప్రజల ప్రత్యామ్నాయ గొంతుకగా మారింది. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటివి ఇప్పుడు ఉద్యమాలకు వేదికలయ్యాయి. సమాజంలో జరుగుతున్న పరిణామాలతోపాటు ప్రభుత్వ నిర్ణయాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాన్ని కల్పించాయి. ఆర్టికల్ 370 రద్దుకు అనూహ్య మద్దతు లభిస్తే.. సీఏఏకు అదే స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. అదేసమయంలో నకిలీ వార్తల ప్రచారం కూడా పెరిగింది. దీంతో ప్రభుత్వాలు సోషల్ మీడియా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. 2019 సంవత్సరం ముగుస్తున్న సందర్భంగా.. ఈ ఏడాది సోషల్ మీడియా ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే..

**గ్రామాల్లో పెరిగిన యూజర్లు**

ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం దేశంలో ఈ ఏడాది మార్చి చివరినాటికి 45 కోట్లకుపైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో 6.6 కోట్ల మంది 5-11 ఏండ్ల మధ్యవారే. వీరిలో అత్యధిక శాతం మంది సోషల్‌మీడియాలో అకౌంట్ కలిగి ఉన్నారు. చాటింగ్, వీడియో మెసేజింగ్ యాప్‌లలో ప్రాంతీయ భాషల కంటెంట్ భారీగా దొరుకుతుండటంతో మారుమూల ప్రాంతాల్లోనూ మీడియా వాడకం పెరిగింది. భవిష్యత్‌లో కొత్తగా చేరే ఇంటర్నెట్ వినియోగదారుల్లో 90 శాతం మంది ఇంగ్లిషేతరులే ఉంటారని అంచనా.

**వాట్సప్‌కు ఝలక్**

ఈ ఏడాది వాట్సప్ యాప్ హ్యాక్‌కు గురవడం పెద్ద సంచలనం. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో అనే ప్రైవేట్ నిఘా సంస్థ తమ యాప్‌లోకి పెగాసస్ అనే నిఘా సాఫ్ట్‌వేర్‌ను జొప్పించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1,400 మంది యూజర్ల ఫోన్లను హ్యాక్ చేసిందని వాట్సప్ సంచలన ప్రకటన చేసింది. ఇందులో 121 మంది భారతీయులు ఉన్నట్టు చెప్పింది. ఇది మన దేశంలో రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపింది. దీంతో వాట్సప్‌లో వ్యక్తిగత గోప్యత భద్రతపై సమీక్షించాలని కేంద్రం నిర్ణయించింది.

**టిక్‌టాక్.. ఒడిదుడుకులు**

టిక్‌టాక్‌లో అసభ్యకర వీడియోలు పోస్ట్ చేస్తున్నారంటూ మద్రాస్ హైకోర్టు ఈ యాప్‌పై నిషేధం విధించింది. కొన్నాళ్ల తర్వాత ఊరట లభించింది. సంఘ విద్రోహ శక్తులు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నాయంటూ ఫిర్యాదులు రావడంతో కేంద్రం నోటీసులు జారీ చేసింది.

**ఉద్యమాలకు ఊపిరి**

ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు సోషల్ మీడియా ఊపిరిగా నిలిచింది. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు తీసుకునే నిర్ణయాలపై నెటిజన్లు నిర్మొహమాటంగా అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా జరుగుతున్న భారీ ఉద్యమానికి సోషల్‌మీడియా వెన్నెముకగా నిలుస్తున్నది. దీంతో ప్రభుత్వాలు ఇంటర్నెట్‌ను నిలిపివేయడాన్ని ఓ ఆయుధంగా మార్చుకున్నాయి. ఈ ఏడాది మన దేశంలో 95 సార్లు ఇంటర్నెట్ నిలిపివేశారు.

**'సోషల్' నియంత్రణకు చర్యలు**

సోషల్ మీడియా దుర్వినియోగం పెరిగిపోతుండటంతో ప్రభుత్వం ఐటీ చట్టాన్ని కఠినతరం చేసింది. నకిలీ వార్తలు, మూకదాడులు, వినియోగదారుల వివరాల చోరీ నేపథ్యంలో కేంద్రం 'వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు'ను రూపొందించింది. ఇందులో కొన్ని నిబంధనలు యూజర్లపై, కంపెనీలపై నిఘా పెట్టేందుకు అధికారాలను ఇస్తున్నాయి. సాధారణ ఎన్నికలప్పుడు ప్రభుత్వం, ఈసీ సోషల్ మీడియాను హెచ్చరించాయి.

# చలి గుప్పిట్లో ఉత్తరాది

- జమ్ముకశ్మీర్‌లోని ద్రాస్‌లో మైనస్ 28.7 డిగ్రీలు నమోదు
- హర్యానాలో పాఠశాలలకు రెండు రోజులు సెలవులు
- బంగ్లాదేశ్‌లో 50 మంది మృతి



ఢిల్లీలో కోతికి చలిమంట

**శ్రీనగర్/జైపూర్:** ఉత్తర భారతంలో చలి పంజా విసురుతున్నది. కశ్మీర్‌లోయ, లఢక్ కేంద్రపాలిత ప్రాంతాల్లో సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రతతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండటంతో హర్యానాలో సోమ, మంగళవారాల్లో అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. గత ఐదు దశాబ్దాల్లో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. జమ్ముకశ్మీర్‌లో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉన్నది. శ్రీనగర్‌లో శనివారం రాత్రి ఉష్ణోగ్రతలు మైనస్ 6.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ద్రాస్ పట్టణంలో మైనస్ 28.7 డిగ్రీల సెల్సియస్, లఢక్‌లో మైనస్ 19 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి ప్రభావంతో కశ్మీర్‌లోని దాల్ సరస్సు ఆదివారం గడ్డకట్టింది. స్థానిక నీటి సరఫరా పైప్‌లైన్లు గడ్డకట్టిపోయాయి.

**ట్రాఫిక్‌కు అంతరాయం**

చలిగాలులు హర్యానా, పంజాబ్ ప్రజల్ని కూడా వణికిస్తున్నాయి. చలి తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్టు హర్యానా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు, రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఆదివారం ఉదయం 1.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గత ఐదు దశాబ్దాల్లో ఇదే అత్యంత అల్ప ఉష్ణోగ్రత అని వాళ్లు పేర్కొన్నారు. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో కూడా చలిగాలుల తీవ్రత కొనసాగింది. పొగమంచు కారణంగా పలు రాష్ట్రాల్లో రోడ్డు, రైలు, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.

**పేదలపై చలి పిడుగు**

**ఢాకా:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌పై చలి ప్రభావం తీవ్రంగా ఉన్నది. దీని వల్ల నవంబర్ 1 నుంచి ఈ నెల 28వరకు దేశంలో 50 మంది చనిపోయారని, వీరిలో 17 మంది చలి వల్ల తలెత్తిన శ్వాసకోశ ఇబ్బందుల కారణంగా చనిపోగా, మరో 33 మంది అతిసారం తదితర వ్యాధులతో చనిపోయినట్టు ప్రభుత్వాధికారులు తెలిపారు.

# తగ్గని సీఏఏ ఆందోళనలు

- ముగ్గులేసినందుకు తమిళనాట ఎనిమిది మంది అరెస్ట్



చెన్నైలో ముగ్గు వేస్తున్న మహిళ

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై దేశవ్యాప్తంగానూ, విదేశాల్లోనూ నిరసనలు కొనసాగుతునే ఉన్నాయి. సీఏఏకు మద్దతు ప్రకటించిన మధ్యప్రదేశ్ బీఎస్పీ ఎమ్మెల్యే రమాబాయిని ఆ పార్టీ అధినాయకురాలు మాయవతి సస్పెండ్ చేశారు. సీఏఏ భారత్ అంతర్గత వ్యవహారమని బంగ్లాదేశ్ పేర్కొంది. తమిళనాడులోని చెన్నైలో సీఏఏ, ఎన్నార్సీని నిరసిస్తూ మహిళలు ఆదివారం 'ముగ్గులు' వేశారు. దీంతో ఐదుగురు మహిళలతోపాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి తర్వాత విడుదల చేశారు. ప్రజలకు హక్కులను అన్నాడీఎంకే హరిస్తున్నదని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ట్విట్టర్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఏఏ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా లౌకిక పార్టీలు ఉమ్మడిగా పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఎంపీ కనిమొళి స్పందిస్తూ.. 'ముగ్గు వేయడం కూడా దేశ ద్రోహ కార్యక్రమం అని నాకు ఈ రోజే తెలిసింది. కేంద్రం మెప్పు కోసం ప్రయత్నించినందుకు సీఎం పళనిస్వామిని అభినందిస్తున్నా' అని ట్వీట్ చేశారు. జనవరి 10న గువాహటిలో 'ఖేలో ఇండియా' క్రీడలను ప్రారంభించడానికి ప్రధాని మోదీ వస్తే భారీ నిరసన తెలుపుతామని అఖిల అసోం విద్యార్థి సంఘం హెచ్చరించింది. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ కార్యాలయానికి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్ పోలీస్ స్టేషన్ బయట భారీ ప్రదర్శన జరిగింది. కేరళ సీఎం పినరాయి విజయన్ సీఏఏకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆందోళన విషయమై వివిధ పార్టీలు, సామాజిక, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులతో భేటీ కాగా, బీజేపీ బాయ్‌కాట్ చేసింది. తాను ఎన్పీఆర్ పత్రాలను పూర్తి చేయబోనని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ ప్రకటించారు. భారత సంతతి అమెరికన్లు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

**దేశ విభజనకు మోదీ యత్నం: ఒవైసీ**

సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ పేరిట దేశాన్ని విభజించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని రక్షించండి' నినాదంతో బీహార్‌లోని కిషన్ గంజ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.

## ఎన్పీఆర్‌ను ఎన్నార్సీకి వాడొచ్చు.. వాడకపోవచ్చు!

**న్యూఢిల్లీ:** జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) కోసం సేకరించే కొంత సమాచారాన్ని దేశవ్యాప్త జాతీయ పౌర జాబితా(ఎన్నార్సీకి) వాడొచ్చు లేదా వాడకపోవచ్చు అని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలుకు ముందు న్యాయపరమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉన్నదని, ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఎన్పీఆర్ సమాచారాన్ని ఎన్నార్సీకి ఉపయోగించబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్న నేపథ్యంలో రవిశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 'భారత్ మాతాకీ జై' అనాల్సిందే!

**పుణే:** 'భారత్ మాతాకీ జై' అనేవారే దేశంలో ఉండాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని పుణేలో అఖిల భారత విద్యార్థి పరిషత్ 54వ వార్షిక మహాసభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'దేశాన్ని మనం ధర్మశాల చేద్దామా? ఎవరంటే వారు వచ్చి దేశంలో ఉండవచ్చా? దీన్ని మనం సవాల్‌గా తీసుకుని ఒక విషయాన్ని స్పష్టంచేయాలి. భారత్‌లో.. 'భారత్ మాతాకీ జై అనాల్సిందే'. అలా అనేవారే దేశంలో ఉండాలి' అని పేర్కొన్నారు.




## నేల భయం

పౌరసత్వ బిల్లు పట్టాలెక్కిన తర్వాత
ఎటు పోతున్నానో తెలియటం లేదు
రైల్వే స్టేషన్‌లు కూల్చి వేసినట్టున్నారు
పాత పట్టాలకు చట్టాల నిప్పు పెట్టారు
కొత్త చట్టం పట్టాలేయదు
రైలు కూలిపోతుందో కాలిపోతుందో

అర్థం కావటం లేదు
నాదేశం కానిదేశంలో ఆగేలా కనిపిస్తుంది
నాప్రియాతిప్రియమైన నేలనుండి
నన్ను దూరం చేయాలని పెద్ద కుట్ర జరుగుతూవుంది

ఇంట్లో అన్నీ వుండగా
అగ్ని రాజేయటమెందుకూ?
కంకర రోడ్డు కావచ్చు, మట్టిరోడ్డు కావచ్చు
ఏదో నడుస్తున్నాం ఆకలితో.. అప్పులతో..

ఆర్థిక మాంద్యంతో
ముళ్లు చల్లటమెందుకూ?
ఆధార్‌లు, పాన్‌కార్డులు, ఓటర్ కార్డులు, బ్యాంక్ నెంబర్లు
నా ఫోటోలు నా మచ్చలు, నా అడుగులు
అన్నీ రుజువులుండగా..
పౌరసత్వ బిల్లు ఎందుకు?
నా కాళ్ల క్రింది నేలను లాగి వేయటానికా..?

– సీహెచ్ మధు, 99494 86122

# ప్రజ్ఞా తెలంగాణం..

అనాదిగా సాహిత్యం ప్రపంచ రూపురేఖలను మనిషికి అర్థపరుస్తూనే స్తుంది. కానీ అదే సాహిత్యం మనిషి గొప్పతనాన్ని ప్రపంచం తెలుసుకునేలా చేస్తుందంటే అతిశయోక్తి లేదు. అలాగే తెలంగాణలో భాష పుట్టింది మొదలు నేటివరకూ విరబూస్తున్న సాహిత్య సుమాలు భావ వారసత్వం అందిపుచ్చుకొని ప్రపంచ వేదికపై పరిమళిస్తున్నాయి. అందుకు నిదర్శనంగా ఒక గొప్ప వ్యక్తి జీవితాన్ని సంస్కృత కావ్యంగా మలచిన తెలంగాణ వాసికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

2019 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించింది. అందులో మొత్తం 23 భాషలకు చెందిన రచయితలను పురస్కారాలకు ఎంపికచేసింది. సంస్కృతంలో డాక్టర్ పెన్నా మధుసూదన్ రాసిన 'ప్రజ్ఞా చాక్షుషం' అనే కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పెన్నా మధుసూదన్ శర్మ మహారాష్ట్రకు చెందిన 'సంత్ గులాబ్ రావు మహరాజ్' అనే యోగి జీవితం ఆధారంగా 'ప్రజ్ఞా చాక్షుషం' అనే మహాకావ్యాన్ని 18 సర్గలలో 850 శ్లోకాలతో రచించారు.



'ప్రజ్ఞా చాక్షుషం' అంటే అంతః ప్రజ్ఞ లేదా జ్ఞాననేత్రం అని అర్థం. పుట్టుకతోనే అంధుడైనా, అక్షరగంధం అంటనివాడైనా, వినికిడితో శాస్త్రాలను నేర్చుకొని, అంతః ప్రజ్ఞతో అన్ని శాస్త్రాలను గ్రహించి 134 గ్రంథాలను వివిధ భాషలలో రచించి 34 సంవత్సరాలకే తనువు చాలించిన గులాబ్ రావు మహారాజ్ జీవిత గాథను కావ్యంగా అందించారు మధుసూదన్ శర్మ.

పెన్నా మధుసూదన్ శర్మ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో పెన్నా నరసింహాశర్మ–భారతీదేవి దంపతులకు జన్మించారు. పదవ తరగతి తర్వాత సంస్కృతం నేర్చుకోమన్న తండ్రి మాట కోసం సికింద్రాబాద్ బోయిన్‌పల్లి శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధిని కళాశాలలో పి.డి.సి, బి.ఎ.(ఎల్) పూర్తి చేశారు. సంస్కృత విభాగంలో పీహెచ్‌డీ ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా పూర్తిచేశారు. జర్మనీ, నెదర్లాండ్ వంటి దేశాల్లో పర్యటించి సం స్కృతభాషను ప్రచారం చేసిన మధుసూదన్ శర్మ మాతృభాష తెలు గు, చదువుకున్న సంస్కృతంలోనే గాక ఇంగ్లీష్, హిందీ, మరాఠీ, జర్మన్ భాషలలో ప్రావీణ్యం పొంది బహుభాషా కోవిదుడుగా పేరు గడించారు. కెనడాలోని నాంకోవర్‌లో 2018లో జరిగిన ప్రపంచ సంస్కృత సదస్సుకు ఎంపిక చేసిన 12 మందిలో వీరొకరు కావడం గర్వించదగ్గ విషయం.

పెన్నా మధుసూదన్ శర్మ మహారాష్ట్ర నాగపూర్ రామ్‌టెక్‌లోని కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయం దర్శన విభాగంలో 2000 సంవత్సరంలో లెక్చరర్‌గా బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతం ఆచార్యుడిగా పదోన్నతి పొందారు. అదే విభాగానికి డీన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈయన ఇప్పటివరకు 2 మహా కావ్యాలు, 9 లఘు కావ్యాలు, 7 ఇంగ్లీషు అనువాదాలు, 8 తెలుగు అనువాద రచనలు, 9 సంపాదిత గ్రంథాలను రచించారు.

సంస్కృత భాష సాహిత్యంలో తన రచనల ద్వారా మధుసూదన్ శర్మ చేసిన కృషికి పలు పురస్కారాలు, సత్కారాలు దక్కాయి. మహారాష్ట్రలో సాహిత్య విభాగంలో అందించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాతవలేకర్ పురస్కారం, లాట్‌కర్ శాస్త్రీ, ఘటాటీ పురస్కారాలు, గుజరాత్‌లోని సోమనాథ్ ట్రస్టు ద్వారా స్వర్ణపథక సత్కారం, తెలంగాణ రాష్ట్రంలో శ్రీరంగాచార్య–శ్రీరామానుజాచార్యుల స్మారక పురస్కారాలు, సంస్కృత భారతి వారి సంస్కృత పండిత పురస్కారం వంటివెన్నో ఆయన్ను వరించాయి. ఒక గొప్ప తత్త్వజ్ఞాని జీవిత చరిత్ర నేపథ్యంలో 2015లో ప్రచురితమైన 'ప్రజ్ఞాచాక్షుషం' కావ్యానికి సంస్కృత విభాగంలో 2019లో సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం మధుసూదన్ శర్మ కృషికి దక్కిన అపూర్వ గౌరవం. పెన్నా మధుసూదన్ శర్మ తెలంగాణ సాహిత్య వనంలో వికసించిన కవన కమలం.

భారతీయ సాహిత్యశాస్త్రంలో కావ్యానికి సంబంధించినంత వరకు పదే పదే చదివించేదీ, నవనవత్వాన్ని కలిగించేదీ కావ్యం. వినూత్నంగా ఆలోచించి ఒక వ్యక్తిగాథను ప్రపంచానికి పరిచయం చేయాలనే ఆతృతలో ఒక మంచి కావ్యాన్ని అందించిన పెన్నా మధుసూధన్ శర్మ సహృదయుడు.

మునుపటి రచయితల సాహిత్యంలో ఉన్నంత భావ గాంభీరత నేటి రచయితల్లో కనిపించడం సాధ్యపడుతుందా అనేది ప్రశ్న అయితే, రచయిత ఏ కాలానికి చెందినవాడైనా, అతను రచనల్లో ఉపయోగించేది భాషే అయితే, ఆ భాషనూ భావావిష్కరణ కోసం ఉపయోగిస్తే, ఆ భావావిష్కరణం ప్రభావంతంగా ఉండాలని అతను తలిస్తే, నాటి సిద్ధాంతాలూ, విశేషాలు ఆధునిక సాహిత్యానికే కాదు భవిష్యత్తులోని సాహిత్య ప్రక్రియలకు కూడా సమన్వయించవచ్చనే విషయాన్ని రూఢీపరిచిన రచయిత పెన్నా మధుసూదన్ శర్మ. అతనికి దక్కిన పురస్కారం సాహితీ వారసత్వానికి అద్భుత ప్రేరణ.

– ఇట్టేడు అర్కనందనాదేవి

పోతన కవిత్వం చదువుతూ ఉంటే పాలు, పంచదారా, తేనె, చెరుకురసం, మామిడి పండు కలకండలలోని తియ్యదనాన్ని రుచి చూసినట్లుంటుంది. మల్లెపూలు, మంచిగంధం వాసనలతో నిండిన పండు వెన్నెలలో మెత్తని చిగురులపై పదమెత్తి సాగిపోతున్నట్లనిపిస్తుంది. 'బాల రసాల సాల నవ పల్లవ కోముల'మైన ఆయన కవితా కాంత 'మందార మకరంద మాధుర్యాన్ని' చవిచూపుతూ ధారాశుద్ధి శోభితమైన ద్రాక్షపాక సమన్వితమై రసానందం అందిస్తూనే ముక్తి పదాన్ని చూపుతుంది.

# నిత్యస్మరణీయం భాగవతం

**పోతన** పేరు వినగానే భాగవతం స్ఫూర్తినిస్తుంది. భాగవతం అనగానే భక్తి తత్వం గుర్తుకువస్తుంది.

మన జాతి సంస్కృతిని, ప్రతిబింబింపజేసి, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసిన రచనలు రామాయణం, భారతం, భాగవతం. ఇవి మన సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. వాటిల్లో ఉదాత్తమైన మానవీయ మూల్యాలు ఉండటం వల్లనే నేటికీ వాటి గురించి మనం ప్రస్తావించుకుంటున్నాం. రామాయణం ఒక కుటుంబ వ్యవస్థకు ప్రత్యేకం అయితే, భారతం ఒక సమాజ పాలనకు, పటిష్టతకు నిలువుటద్దంగా నిలిచింది. ఇక భాగవతం భారతీయ సనాతన ధర్మానికీ, ఆధ్యాత్మిక చింతనకూ, ఆత్మ పరమాత్మ తత్వానికీ ఆలంబనగా పేరొందినది.

ఇటువంటి మహత్తరమైన వ్యాస విరచిత భాగవత గ్రంథాన్ని తేట తెలుగులో అందించిన పరమ భాగవతోత్తముడు పోతనామాత్యుడు. తేట తేట తెనుగు పదాల తేనె సొనలతో భాగవత భక్తి తత్త్వామృతాన్ని తెలుగు వారికి పంచిపెట్టి పునీతుల్ని గావించిన కవీశ్వరుడు పోతన. పోతన కవిత్వం చదువుతూ ఉంటే పాలు, పంచదారా, తేనె, చెరుకురసం, మామిడి పండు కలకండలలోని తియ్యదనాన్ని రుచి చూసినట్లుంటుంది. మల్లెపూలు, మంచిగంధం వాసనలతో నిండిన పండు వెన్నెలలో మెత్తని చిగురులపై పదమెత్తి సాగిపోతున్నట్లనిపిస్తుంది. 'బాల రసాల సాల నవ పల్లవ కోముల'మైన ఆయన కవితా కాంత 'మందార మకరంద మాధుర్యాన్ని' చవిచూపుతూ ధారాశుద్ధి శోభితమైన ద్రాక్షపాక సమన్వితమై రసానందం అందిస్తూనే ముక్తి పదాన్ని చూపుతుంది.

కవి వరేణ్యుడు, భక్తాగ్రగణ్యుడు అయిన పోతన క్రీ.శ.1400–1470 మధ్య కాలంలో జీవించినట్లు పరిశోధకులు పేర్కొంటారు. ఇతను తెలంగాణలోని ఏక శిలా నగరంగా పేరుపొందిన నాటి ఓరుగల్లు, నేటి వరంగల్‌కు సమీపంలో ఉన్న బమ్మెర గ్రామంలో పుట్టినవాడు. తండ్రి కేసన, తల్లి లక్కమాంబ, అన్న తిప్పన. వీరు కౌండిన్యస గోత్రులం, ఆపస్తంబ సూత్రులు, శైవ మతస్థులు. సదాచార, సంస్కార సంపన్న కుటుంబంలో పుట్టిపెరిగిన పోతన సద్గుణ, సవినయ సంపన్నునిగా ఎదిగాడు. గుపముఖతః నేర్చుకొన్నది బహుస్వల్పమే అయినా, తారక మంత్ర మహిమ చేతవిబుధ జనుల వలన విన్నంత, కన్నంతనే స్వయంకృషితో ఆ సరస్వతీదేవి కరుణా కటాక్షంతో సకల విద్యాపారీణుడే గాక భక్తి కవితాధురేణుడైనాడు. శ్రీ పరమేశ్వర కరుణా కవితా విచిత్ర సహజ పాండిత్యాన్ని 'అలవర్చు కొన్నందువల్ల ఇతనిని 'సహజకవి' అంటారు.

పోతన నిరాడంబర జీవి, నిగర్వి, భూమిని నమ్ముకొని హాలిక వృత్తితో జీవితాన్ని కొనసాగించిన నిస్సంగుడు. భోగభాగ్యాలను ఆశించలేదు, రాజాశ్రయం జోలికి వెళ్ళలేదు. శ్రమ జీవనమే సుఖప్రదం, శాంతిమయమైనది నమ్మినవాడు. అందుకే మనుజేశ్వరుల మన్ననలను తిరస్కరించిన ఆత్మాభిమాని. అందుకే..

'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు, వాహనంబులన్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలు చే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చిచెప్పెనే
బమ్మెర పోతరాజొక్కడు భాగవతంబు జగద్ధితంబుగన్' అన్నాడు.

ఒకనాటి పున్నమిరాత్రి, నదీతీరంలో ధ్యానమగ్నుడైన పోతనకు శ్రీరామచంద్రుడు కనిపించి, 'శ్రీ మహ భాగవతాన్ని తెనిగించు, భవబంధాలు తెగిపోతా య'ని ఆదేశించాడట. శైవుడైన పోతనకు శ్రీరాముడు కనిపించి శ్రీకృష్ణుని గాథను రాయమనడం శివకేశవాభేదాన్ని తెలియజేయడమే.

భాగవత కవిత్వంలో పరతత్త్వం గోపికా కృష్ణుల వృత్తాంతం. వీరి అనుబంధం జీవాత్మ, పరమాత్మల సంయోగం. అందుకే ఆ పరమాత్ముని చూడాలనే తపన, చేరుకోవాలనే తహతహ గోపికారూపాలైన జీవాత్మలు చేసే ఆక్రందనలను పోతన 'నల్లవాడు పద్మనయనంబుల వాడు' పద్యంలో సువ్యక్తం చేశాడు. ఆ సూర్యుని ప్రతిబింబం అద్దంలో కనిపించినట్లు ఆ పరమాత్ముని ప్రతిరూపం ప్రతి జీవాత్మలో ఉంటుందన్న తాత్విక రహస్యాన్ని పోతన 'ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కక్కడై తోచు' అన్న పద్యంలో ఎంతో హృద్యంగా చెప్పాడు. నిలకడగా జీవాత్మ పరమాత్మ కోసం పరితపిస్తే, ఆపన్నులను కాపాడే పరమాత్ముడు ఎంత దూరాన్నైనా లెక్కచేయకుండా వచ్చి భక్తులను రక్షిస్తాడని 'అల వైకుంఠపురంబులో, నగరిలో, నా మూల సౌధంబు' అనే పద్యంలో అలతి అలతి పదాల కూర్పుతో మన అంతర్నేత్రాలను తెరిపింపజేసే ప్రయత్నం చేశాడు. 'కలయో! వైష్ణవ మాయ యో!!' అనే పద్యం ద్వారా జీవాత్మను చుట్టుకొని ఉండే మోహావేశాన్ని, భ్రాంతిని తొలగింపజేస్తాడు. ఈ జీవితం మిథ్య, మాయ అనే, ఈ దేహం నశించిపోయేదనీ, శాశ్వతమైనది ఆ పరమాత్మ తత్త్వమేననీ, దానిని తెలుసుకొమ్మని ప్రబోధిస్తాడు పోతన. అందుకే ప్రతి తెలుగువారి ఇంట్లో భాగవతం ఉండాలి, అది ప్రాతః స్మరణీయం, నిత్య స్మరణీయం కావాలి. భాగవత పద్యాలు కొన్నైనా తెలుగు పిల్లల నోటికి రావాలి.

– డాక్టర్ టి.గౌరీశంకర్, 94409 69130

## 'పలికెద భాగవతం'పద్య పఠన పోటీల బహుమతి ప్రదానం

సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో.. 'పలికెద భాగవతం'పద్య పఠన పోటీల బహుమతి ప్రదానోత్సవ సభ 2019 డిసెంబర్ 30న మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టీఆర్ కళామందిరంలో జరుగుతుంది. డాక్టర్ కె.వి. రమణాచారి అధ్యక్షతన జరుగు సభలో ముఖ్య అతిథిగా పి.సబితా ఇంద్రారెడ్డి, విశిష్ఠ అతిథులుగా ఆచార్య శలాక రఘునాథ శర్మ, డాక్టర్ గరికపాటి నరసింహారావు, ఎం.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ టి.గౌరీశంకర్ హాజరవుతారు. సభ ప్రారంభకులుగా డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం హాజరవుతారు.

– పసుపులేటి నరేంద్రకృష్ణ, ఇ.డి.నగరాజు, సాధన నరసింహాచార్య

# కన్నడలో 'ప్రజాకవి వేమన'

డాక్టర్ ఎన్.గోపి రచించిన పిహెచ్.డి, సిద్ధాంత గ్రంథం '**ప్రజాకవి వేమన**' కన్నడ భాషలోకి అనువాదమైంది. ధార్వాడ్ కర్నాటక విశ్వవిద్యాలయంలోని మహాయోగివేమనపీఠం వారు ఇటీవల దీనిని ప్రచురించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు డాక్టర్ ఆర్. శేషశాస్త్రి అనువాదకులుగా పనిచేశారు. ఇదొక అపురూపమైన సాహిత్యవార్త. ఒక పీహెచ్‌డీ థీసిస్, అందునా తెలుగు పరిశోధన గ్రంథం ఇతర భాషలోకి వెళ్ళడం అరుదైన విషయం.

కర్నాటక విశ్వవిద్యాలయం కులపతి (కులపతి గళు) ప్రొఫెసర్ ప్రమోద భీగాయ ముందుమాట రాస్తూ కన్నడంలోని సరజ్ఞుని లాగే వేమన ఒక '**జనపరకవి**' (అంటే ప్రజాకవి), సంతకవి (అంటే యోగి కవి) అనీ, సామాన్య జనులకు లోతైన సూక్తులనందించిన మహానుభావుడనీ కొనియాడారు. అతని పైన ప్రామాణిక పరిశోధనతో వెలువడిన తెలుగు గ్రంథాన్ని కన్నడంలోకి తెచ్చుకోవడం ముదావహమనీ, ఇది తులనాత్మక అధ్యయనానికి తోడ్పడుతుందని రచయిత గోపి పైన ప్రశంసల జల్లు కురిపించారు. వేమన పీఠం సంచాలకులు డాక్టర్. హెచ్.బి. నీలగుంద ఒక తెలుగు పరిశోధన గ్రంథం కన్నడ అనువాదాన్ని పీఠం ద్వారా ప్రచురిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



గోపి గారి 'ప్రజాకవి వేమన' మొదటి నుంచి రికార్డులు సృష్టిస్తూనే వచ్చింది. 1979లో అంటే నలభై యేళ్ళ కిందట వెలువడిన ఈ గ్రంథం ఆ రోజుల్లో ప్రామాణిక పరిశోధనగా పేరు తెచ్చుకున్నది. అచ్చుపుస్తకాలతో ఆగక తాళపత్ర గ్రంథాల మూలాల్లోకి వెళ్లి, విశేష పరిశ్రమ కోర్చి తీర్చిన రచనగా గౌరవానికి నోచుకున్నది. ఇంత వరకు విశ్వవిద్యాలయ తెలుగు శాఖలన్నింటినుంచి దాదాపు నాలుగు వేల థీసిస్సులు వచ్చాయని ఒక అంచనా. వాటిలో ఓ ఇరవైదాకా పరమ ప్రామాణికమై, పఠన పాఠవాల్లో నలుగుతూ, ఉటంకింపులకాలవాలమై పరామర్శ గ్రంథాలుగా నిలిచాయని కాలం చెబుతున్న తీర్పు. వాటిలో 'ప్రజాకవి వేమన' అగ్రశ్రేణిలో నిలవటం విశేషం. గోపి గారి ఈ పరిశోధన గ్రంథం ఇప్పటివరకు ఆరు ముద్రణలు పొందింది. నాకు తెలసినంత వరకు తెలుగు థీసిస్సుల్లో ఇన్ని ముద్రణలు పొందిన గ్రంథం ఇంకోటి లేదంటే అతిశయోక్తికాదు.

'ప్రజాకవి వేమన' తొలిసారి 1980 లో అచ్చయింది. మూడు నెలల్లోనే వెయ్యి కాపీలు చెల్లిపోయినై. తర్వాత రెండో ముద్రణ గోపి గారే సొంతంగా వేసుకున్నారు. అనంతరం 2000, 2005, 2012, సంవత్సరాల్లో విశాలాంధ్ర వారు ప్రచురించారు. ఇప్పుడు వారే ఏడో ముద్రణ కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఈ పరిశోధన వల్ల గోపి గారికి విశేష ఖ్యాతి లభించింది. 'వేమన గోపి' అంటూ వేమన ఆయన ఇంటి పేరుగా మారిపోయింది. చేసిన పని పరంగా ప్రసిద్ధి కలుగడం ఆ పని నాణ్యతకూ దానికి లభించిన పాఠకాదరణకూ నిదర్శనంగా భావించవచ్చు.

ఇక కన్నడానువాదానికి అనుకూలమైన నేపథ్యాన్ని గురించి రెండు మాటలు. 17వ శతాబ్దానికి చెందిన వేమన దక్షిణ భారతంలోని చాలా ప్రాంతాల్లో పర్యటించాడనడానికి దాఖలాలున్నాయి. ముఖ్యంగా కన్నడ దేశంలో ఉత్తర కర్ణాటక, బళ్లారి, కొలార్ జిల్లాలు, బెంగుళూరు ప్రాంతాల్లో ఎందరో తెలుగు వారున్నారు. ఎన్నో వేమన ఆశ్రమాలున్నాయి. లక్షల సంఖ్యలో వేమన భక్తులున్నారు. తరాలుగా తెలుగు మరిచి పోయినా వేమనను ఆరాధిస్తున్నారు.

అల్లరచిల్లరగా తిరిగే వేమన్న మనసు మార్చి యోగిగా పరివర్తనకు కారణమైన వేమన్న వదిన 'వేమారెడ్డి మల్లమ్మ' కన్నడ దేశంలో నిత్యపూజలందుకుంటున్నది. వేమన్న ప్రేమికులు కర్ణాటకలో ఇప్పుడు ఓటుబ్యాంకు. గోపి గారు ఇటీవల బెంగళూరులోని 'విధాన సేధ'లో వేమన పై యావత్ ప్రజాప్రతినిధుల ముందు ప్రసంగించి, అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా సన్మానం పొంది వచ్చారు. అప్పటి రెవెన్యూ మంత్రి హెచ్.కె.పాటిల్ చొరవతోనే వేమన పీఠం స్థాపన జరిగింది. ఆయన పినతండ్రి ఎస్.ఆర్. పాటిల్ 400 వేమన పద్యాలను కన్నడంలోకి అనువదించి ప్రచురించారు. యోగి జీవితం గడిపారు.

ఈ సందర్భంగా ఒక విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఉత్తర భారతదేశంలో ఆ మాటకొస్తే యావద్భారతంలోనే కబీర్‌కు ఉన్న ప్రాచుర్యం మరే కవికి లేదు. హిందీలో ఉండటం వల్ల కూడా అది సాధ్యమయ్యింది. వేమన పద్యాలు కబీర్‌దోహాల కన్న ఏమాత్రం తక్కువవి కావు. కాని వేమన దురదృష్టం ఏమిటో గాని ఆయన ఇంటినే సరిగ్గా గెలవలేక పోయాడు. తెలుగు సమాజమంతా ఆత్మవిమర్శ చేసుకోవలసిన విషయమిది. వేమన హిందీలోకి అనువదించబడితే అఖిల భారతకవిగా మారి పోయేవాడు. కబీర్, వేమన ఇద్దరూ సంత్ కవులే. 17వ శతాబ్దం నాటి క్షీణ వ్యవస్థలను తూర్పార బట్టిన వారే. వేషధారులను దునుమాడి తాత్త్విక స్పష్టత కోసం పాటు పడిన వారే. ముఖ్యంగా నేటితరం జీవనసంక్షోభంలో పడి కొట్టుక పోతున్న తరుణంలో వేమన్న ప్రబోధాల అవసరం చాలా వుంది. తెలుగు రాష్ట్రాల్లోని సాహితీ సాంస్కృతిక సంస్థలు దీనిపై దృష్టి పెట్టవలసివుంది. ఆచార్య గోపి ఏకకాలంలో కవిత్వాన్ని, పరిశోధననూ అత్యున్నత స్థాయికి తీసికెళ్లిన భావుక సంపన్నుడు. పరిశోధనాకృషితో వేమనను భాషా సరిహద్దులను దాటించిన ఖ్యాతి ఆయనకే దక్కింది.

– డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ
99495 32456



## చర్వితచరణం

**బాల భానుని తొలి కిరణాల స్పర్శలాంటి**
నిన్నటి నీ ప్రవేశం నాకింకా గుర్తుంది
నిన్నా నేటి ఈ సంధికాలంలో
ఎన్నిక కథలు, ఎన్ని వ్యథలు, ఎన్నెన్ని కన్నీటి రొదలు
లేలేత చివుళ్ళు అరవిరిసిన మెగ్గలు
కసాయి పాదాల కింద చితికిపోయిన వైనాలు
సభ్య సమాజపు నాగరికత కంటిన మరకలు
మానవతకు మసిపట్టిన కాలమది
జాబిలిని ముద్దాడితేనేం
పగతుర గుండెల్లో వణుకు పుట్టిస్తేనేం
ఇంట్లో బుసకొడుతున్న విషపు నాగుల
కోరలు పెకలించనప్పుడు
గతం తాలూకు విషాద మరకల్ని కడిగేసుకోలేక
నిష్క్రమిస్తోంది పాత సంవత్సరం. దిగులుగా, మౌనంగా
చాలామంది వినడం లేదు, కనడం లేదు
పబ్బుల్లో, క్లబ్బుల్లో నీ స్వాగతాల హోరు
బాణాసంచాల జిలుగు వెలుగులు
కళ్ళు జిగేల్మనే రంగురంగుల లైట్ల జిగేషలు
పీకల్దాకా తాగి ఉర్రూతలూగే యువత జోరు
కల్లుపాకలో ఓ మృగం మత్తుగా
ఒళ్ళు విరుచుకుంటున్నవేళ
ముడుచుకు కూర్చున్న ముసలివాడి మదిలో
వికృత కేళి రేగుతున్న వేళ
రాక్ డాన్సుల్లో అలసిన యువత మత్తులో జోగుతూ
తరతమాలు మరిచి సోలిపోతున్న వేళ
విషాదము, భయము పెనవేసుకున్న వేళ
మరో దురాగతానికి నాంది పలుకుతున్న
దేవాసుర సంధి వేళ
రాలిన పండుటాకు స్థానంలో మొలిచిన తొలి చిగురులా
కల్మషం లేని పసిపాప లాంటి చిరునవ్వుతో
వచ్చి నిలుచుంది కొత్త సంవత్సరం నడిరేయి అంచున
బెదురుగా, దిగులుగా, ఆశగా
మొదటిసారి బడికెళ్ళే ఎల్‌కేజీ పిల్లాడిలా
నల్లేటి మీది నడక కాదు నేస్తం నీ పయనం
సోమరితనానికి అలవాటు పడ్డ యువత
వక్రమార్గాలు పడుతున్న నడక
పెనుభూతంలా కమ్ముకొస్తున్న మాంద్యం
అడుగడుగు గండాలు, ఏడాది బతుకు
రచ్చ గెలిస్తే చాలదు మిత్రమా
పరీక్షా సమయమిది
ఇంట గెలువాల్సిన తరుణమిది
చట్టాలకు పదును పెట్టాల్సిన వేళ ఇది
పువ్వుల్ని, నవ్వుల్ని ఎదగనివ్వాల్సిన సమయమిది
చేయి చేయి కలిపి దన్ను నిలువాల్సిన అవసరమిది
చర్వితచరణమిది–ఇకనైనా నిజమవ్వాలనే కాంక్ష ఇది.

– ప్రతికంఠం దత్తాత్రేయరాజు,
99594 75471

## ప్రకటనలు

### అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాలు

విలక్షణ కవి, పాత్రికేయులు అరుణ్‌సాగర్ విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవ సభ 2020 జనవరి 2న సాయంత్రం 6.30లకు, హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. ఈ సంవత్సరం అరుణ్‌సాగర్ విశిష్ట పాత్రికేయ పురస్కారం ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్‌కు, విశిష్ట సాహిత్యపురస్కారం ప్రముఖ కవి ప్రసేన్‌కు ప్రదానం చేస్తారు. ఈ సంద ర్భంగా అల్లం నారాయణ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా ఘంటా చక్రపాణి, కె.శివారెడ్డి, బీఆర్ నాయుడు, కట్టా శేఖర్‌రెడ్డి, దేవీప్రియ, సీతారాం హాజరవుతారు. కార్యక్రమ నిర్వాహకులుగా డాక్టర్ ప్రసాదమూర్తి వ్యవహరిస్తారు. అందరికీ ఆహ్వానం.

– అరుణ్‌సాగర్ ట్రస్ట్, మిత్రులు, కుటుంబ సభ్యులు

### రచనలకు ఆహ్వానం

సాహితీవేత్త డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ సాహిత్యరంగంలోకి ప్రవేశించి 52ఏండ్లయిన సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి 'మిణుగురులతోట' అనే అభినందన సంచికను తేవాలనుకుంటున్నది. దానికోసం.. ఆయన మిత్రులు,అభిమానులు ఆయన సాహిత్యాన్ని గురించి, వారితో అనుబంధం గురించి వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. రచనలను 2020 జనవరి 20లోగా పంపాలి. చిరునామా: డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, ఇంటి నెం: 11–9–317, లక్ష్మీనగర్, రోడ్ నెం:4, కొత్తపేట, హైదరాబాద్–35.

– డాక్టర్ ఘంటా జలంధర్‌రెడ్డి, 9848292715

### ఆవిష్కరణ సభ

నసీరుద్దీన్ కవిత్వం 'ముఝే ఏకాంత్‌మే జేనేదో' ఆవిష్కరణ సభ 2020 జనవరి 5, ఉదయం 10 గంటలకు కరీంనగర్ ఫిలింభవన్‌లో జరుగుతుంది. కందుకూరి అంజయ్య అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా ఎఫ్.ఎమ్. సలీం, గాజోజు నాగభూషణం, డాక్టర్ వాసాల వరప్రసాద్, డాక్టర్ సుష్మాదేవి, సి.వి. కుమార్ హాజరవుతారు. పుస్తకాన్ని డాక్టర్ కరణ్ సింహ్ ఊట్‌వాల్ ఆవిష్కరిస్తారు.

– తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్ జిల్లా

## గాలిపటం

**గాలి పాట ఎత్తుకుని**
నింగి కెగిరే రెక్కలు లేని పక్షి

కాగితంపై
ఎముకలు అమర్చినట్టు
బాణం గురి పెట్టిన విల్లులా
రెండు వెదురు పుల్లలు అతికించి

ఇరు భుజాల సమాంతర సూత్రం ముడేసి

దారం కట్టి ఎగరేసే.. పావురం!

నరం తీగ పట్టుకుని
ప్రాణం పాకుతున్నట్టు
పట్టుపురుగులా
వొదులుతున్న దారం దారెంట

ఊపిరి అందుతున్నట్టు..
పతంగం
ఎవరెస్ట్ ఎక్కిన విజయ సూచికలా
ఎర్రకోటపై ఎగురుతున్న స్వేచ్ఛా పతాకంలా
చంద్రుడి మీద కాలు మోపిన గెలుపు చిహ్నంలా
దోసిలి తెరిచినట్టు
ఏ అడ్డులేని శూన్యంలోకి
సీతాకోక చిలుకలా ఎగిరిపోతూ వుంటే

అప్పుడే కదా..!

అప్పటి దాకా
ఆకాశంలో పిచ్చుకలా ఎగిరిన
కనుచూపులో
ప్రపంచం గెలిచిన సంబరం ఉదయించేది!

అప్పటి మైదానం
అప్పటి ఊరూ
ఇప్పటి కాంక్రీటు పద్మవ్యూహం

ఇప్పుడా గాలిపటం
శిఖరంలా మొలిచిన
చివరి అంతస్తు ప్రమాదం అంచున
ఎగురుతున్న నూరేండ్ల జీవితం...

– గజ్జెల రామకృష్ణ, 89774 12795

## పుస్తకాలు

### భిన్నస్వరం




'భిన్నస్వరం' వ్యాసాలలో ప్రాంతీయ అస్తిత్వముంది. తులనాత్మక అధ్యయనముంది. జాతీయ, అంతర్జాతీయ దృక్పథముంది. ఈ వ్యాసాలు చదువుతూ ఉంటే పాఠకునికి ఒక నిబద్ధత అలవడుతుంది. ఆలోచనలు విస్తృతమవుతాయి. ఎస్.మల్లారెడ్డి రాసిన ఈ వ్యాసాల్లో సమస్య పూర్వపరాలను సున్నితంగా విశ్లేషించే ఒక కళాత్మక నైపుణ్యం, ఆయన వాక్యాల వెనుక ఏదో తనదైన అక్షరశక్తి ఉన్నది.

**రచన: ఎస్.మల్లారెడ్డి, వెల: రూ. 150, ప్రతులకు: 1-5-447/1, c/o: ప్రజాపాఠశాల, హనుమాన్‌వాడ, భువనగిరి. అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు**

### 22, మే–హాషింపురా




**ఉత్తరప్రదేశ్‌లోని** హాషింపురాలో పీఏసీ జవాన్లు 42 మంది అమాయక యువకులను వ్యాన్లలో తీసుకొని పోయి ఒక్కొక్కరిని కాల్చి చంపి ఓ నదిలో పడేశారు. ఆ ఘటనను అప్పుడక్కడ జిల్లా ఎస్పీగా పనిచేసిన పోలీస్ అధికారి విభూతి నారాయణ్ రాయ్ కళ్లారా చూసి చలించిపోయి ఆ ఘటన వెనుక ఉన్న క్రూరత్వాన్ని బయటపెట్టారు. చట్టాన్ని రక్షించాల్సిన భద్రతా బలగాలు ప్రజలను బలితీసుకుంటున్న వైనాన్ని బహిర్గతం చేసిన పుస్తకమే ఇది.

**రచన: విభూతి నారాయణ్ రాయ్, తెలుగు:వి.వి.జ్యోతి, వెల: రూ.150, ప్రతులకు: మలుపు ప్రచురణలు,3-6-677/2,ఫ్లాట్ నెం:302, ఎం.ఎస్.కె.టవర్స్, స్ట్రీట్ నెం:11, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29.సెల్:9866559868**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com



శ్రీలక్ష్మీనరసింహుని దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆదివారం యాదాద్రి కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. శ్రీసత్యనారాయణ వ్రతపూజల్లోనూ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీవారి ఖజానాకు రూ.19,16,711 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ

## 'మహా' కోలాట ప్రదర్శన

- ఒకేసారి ఐదువేల మంది మహిళలు
- వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

**శ్రీరాంపూర్:** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో మహిళల మహా కోలాట ప్రదర్శన ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటుదక్కించుకున్నది. శ్రీమత్‌భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ, ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం టీటీడీ విద్వాంసులు, శ్రీరామపాద రామగుండాల కోట దేవాలయ కమిటీలు సంయుక్తంగా నిర్వహించాయి. ఐదు వేల మంది మహిళలు ఏకరూప దుస్తులతో నిర్వహించిన ఈ కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నది. అనంతరం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, సింగరేణి జీఎం లక్ష్మీనారాయణ, ఇంచార్జి రంగ జ్యోతి తదితరులు కార్యక్రమ నిర్వాహకులకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు జ్ఞాపికను అందించి అభినందించారు. అంతకుముందు వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



మహా కోలాట ప్రదర్శనలో మహిళలు



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీవైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం రామయ్యస్వామి వరాహావతారంలో దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక నివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారిని వరాహావతారంలో అందంగా అలంకరించి పల్లకీలో నిత్యకల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం స్వామివారు నరసింహావతారంలో దర్శనమివ్వనున్నారు. - భద్రాచలం, నమస్తే తెలంగాణ

# పల్లెలు పచ్చగుండాలె..

- ప్రగతిబాటలో పయనించాలి
- అదే సీఎం కేసీఆర్ సంకల్పం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆదివారం వరంగల్ నగరంలో పల్లె ప్రగతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. వేదికపై మంత్రి సత్యవతిరాథోడ్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కడియం, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.

**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తేతెలంగాణ:** 'పల్లెలు పచ్చగుండాలె.. అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామాలుగా మార్చుకోవాలి.. పల్లెలన్నీ ప్రగతి దారుల్లో పయనించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు'.. ఇందుకోసం సర్పంచ్‌ల నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ నగరంలో రెండో విడుత 'పల్లె ప్రగతి'పై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు రాకపోయినా.. సీఎం కేసీఆర్ మనం నిర్దేశించుకున్న లక్ష్యాల కోసం నిధులు సర్దుబాటు చేస్తున్నారని చెప్పారు. తొలివిడుతలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు, డంపింగ్‌యార్డుల నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ స్థలాలు లేకుంటే దాతల సహకారం తీసుకోవాలన్నారు. 50 మంది ఉన్నతాధికారుల బృందం 'పల్లె ప్రగతి'పై ఆకస్మిక తనిఖీలు చేస్తూ ప్రభుత్వానికి నివేదికలు ఇస్తుందన్నారు. బాగా పనిచేసిన సర్పంచ్‌ల్లో మండలానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి జనవరి 26న ప్రోత్సాహకాలతోపాటు గ్రామాల అభివృద్ధికి రూ.25 లక్షల చొప్పున సీసీ రోడ్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. అదేవిధంగా పనిచేయని ఐదుగురు సర్పంచ్‌లను ఎంపిక చేస్తామని సూచించారు.

**సర్పంచ్‌లు అదృష్టవంతులు..**

గతంలో తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఇలాంటి ముఖ్యమంత్రి లేరని, పని చేద్దామన్నా చేసే పరిస్థితి లేకపోయేదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఇప్పటి సర్పంచ్‌లు అదృష్టవంతులని, గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.

**పల్లెప్రగతిని విజయవంతం చేయాలి: పల్లా**

తొలి దశ పల్లె ప్రగతి స్ఫూర్తితో రెండో విడుత కార్యక్రమాన్ని కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంపీలు డాక్టర్ బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, జెడ్పీ చైర్‌పర్సన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**అన్నదాతల సంక్షేమమే సర్కార్ ధ్యేయం**

**వరంగల్, నమస్తేతెలంగాణ :** అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ సర్కార్ కృషి చేస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా చింతం సదానందంతో మంత్రి ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన రెండేండ్లకే 24 గంటల కరెంట్.. అతితక్కువ కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసి నీళ్లు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

## ఉదయసముద్రంలో దూకి యువతి ఆత్మహత్య

**నల్లగొండ సిటీ:** ఇంట్లో మందలించారని మనస్తాపానికి గురైన ఓ యువతి ఉదయ సముద్రం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండలోని పద్మానగర్‌కు చెందిన సాయిచందన(21) స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నది. ఇంట్లో ఏ పని చేయకుండా నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండటంతో ఆదివారం తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సాయిచందన ఉదయం 11 గంటల ప్రాంతంలో మొబైల్ స్విచ్‌ఆఫ్ చేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సమీపంలోని పానగల్ ఉదయ సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఆ సమయంలో కట్టపై ఉన్న యువకులు ఆమెను కాపాడేందుకు యత్నించేలోపే మునిగిపోయింది. దీంతో వారు 100 నంబర్‌కు ఫోన్‌చేసి విషయాన్ని తెలుపడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు టూటౌన్ ఎస్సై నర్సింహులు తెలిపారు.

## గజ్వేల్ అభివృద్ధి అద్భుతం

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



గజ్వేల్‌లో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

**గజ్వేల్, నమస్తేతెలంగాణ:** గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి అమోఘమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ వారు నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గజ్వేల్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన పనులు ప్రజోపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చడానికి కేసీఆర్ అమలు చేసిన పల్లె ప్రగతి కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తున్నదని చెప్పారు. హరితహారం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు వర్షాలు అధికంగా పడుతాయన్నారు. నదులు అనుసంధానం చేసి నీటి వసతిని పెంచేలా చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకుమేలు కల్గిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు తమ జీవితంలో కొంత సమయాన్ని సమాజ సేవ కోసం కేటాయించాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం చాలా బాగున్నదన్నారు.

# కూలికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు మృతి.. 19 మందికి గాయాలు
- ఖమ్మం జిల్లా జీళ్లచెరువు వద్ద విషాదం
- మరో ఘటనలో కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. ఇద్దరికి స్వల్పగాయాలు



ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జీళ్ల చెరువు ప్రమాద బాధితులు

**కూసుమంచి/నేలకొండపల్లి:** రోజువారీగా కూలి పనికి వెళ్తున్న ఆ కుటుంబాలను ట్రాక్టర్ ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది. ట్రాక్టర్ ఇంజిన్‌తో ట్రాలీ లింక్ విడిపోయి బోల్తా పడటంతో ఇద్దరు మృతిచెందగా.. 19 మంది గాయపడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. జీళ్లచెరువుకు చెందిన 23 మందిని మిర్చి తోటలో పని చేసేందుకు సమీపంలోని అగ్రహారం రైతు సత్యనారాయణ తన ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నాడు. ట్రాక్టరు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత ఇంజిన్‌తో ఉన్న లింక్ విరిగిపోయి ట్రాలీ బోల్తా పడింది. ఒక్కసారిగా ట్రాలీ కుదుపునకు గురవడంతో కొందరు కూలీలు ఎగిరి రోడ్డుపై పడిపోగా, మరికొందరు ట్రాలీ కింద చిక్కుకున్నారు. ప్రమాదంలో అయితగాని వెంకులు(65), అయితగాని జయమ్మ (45) అక్కడికక్కడే మృతిచెందారు. కొండా నాగమణి, మరో ఇద్దరి శరీరాలపై ట్రాలీ డోర్లు పడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల రోదనలు విన్న మునిగేపల్లికి చెందిన టీఆర్ఎస్ నాయకులు ఎన్ శేషగిరి, పరిసరాల్లోని రైతులు అక్కడికి చేరుకుని బయటకుతీశారు. 23 మందిలో ఇద్దరు మృతి చెందగా 19 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కూసుమంచి సీఐ మురళి, ఎస్సై అశోక్‌రెడ్డి సిబ్బందితో ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాలను, క్షతగాత్రులను ఖమ్మం వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వెంకులు ఇద్దరు కూతుర్లకు వివాహం జరగ్గా.. భార్యాభర్తలు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. జయమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ట్రాక్టర్ నడిపిన సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు జయమ్మ కుమారుడు వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

**ఎన్నెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెం సమీపంలో ఎన్నెస్పీ ప్రధాన కాల్వ నుంచి వచ్చే నందిగామ బ్రాంచి కాల్వలో ఆదివారం ఉదయం ట్రాక్టర్ పల్టీ కొట్టింది. గ్రామానికి చెందిన అడపాల శ్రీనుకు చెందిన ట్రాక్టర్‌లో ధాన్యం కాంటాలు వేసే హమాలీలు పది మంది ప్రయాణిస్తున్నారు. గ్రామం పక్కనే ఉన్న కాల్వపై ఇరుకుగా ఉన్న వంతెన మీదుగా వెళ్తూ మలుపు తిరుగుతున్న సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న వారంతా వెంటనే నీటిలోకి దూకారు. కాల్వలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో అందరూ బయటకు వచ్చారు. వీరిలో దూదిపాళ్ల వెంకట్రావ్‌కు చెయ్యి విరగగా, గండు రామకృష్ణకు స్వల్పగాయాలయ్యాయి.

## ఇద్దరు మహిళలపై హత్యాయత్నం

**గుమ్మడిదల:** ప్రేమ వివాహానికి సహకరించారని అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి తల్లి, అక్కపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం రాంరెడ్డిబావి గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. రాంరెడ్డిబావికి చెందిన గంగిరెడ్డి సుశీల-మోహన్‌రెడ్డి దంపతుల కుమారుడు నవీన్‌రెడ్డి(26), అదే గ్రామానికి చెందిన సామల రాములమ్మ-శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కూతురు ప్రవళిక (20)లు ప్రేమించుకున్నారు. ఈనెల 17న వీరు ఇంట్లో నుంచి వెళ్లి వివాహం చేసుకోవడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో నవీన్‌రెడ్డి తల్లి సుశీల, అక్క మమత ఊరువిడిచి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న సామగ్రిని తీసుకెళ్లడానికి వారు గ్రామానికి రాగా.. ప్రవళిక తల్లిదండ్రులు అక్కడికి వచ్చి వారిద్దరిపై పెట్రోల్ చల్లి నిప్పంటించారు. సుశీల తప్పించుకోగా, మమతకు నిప్పు అంటుకొని తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు మంటలార్పి దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి శ్రీనివాస్‌రెడ్డి, రాములమ్మను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

## 29కిలోల గంజాయి పట్టివేత

**భద్రాచలం, నమస్తేతెలంగాణ:** భద్రాచలం పట్టణంలో ఆదివారం రూ.4.40 లక్షల విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కాపుగాసిన పోలీసులు అటువైపు వస్తున్న ఓ ఆటోను ఆపేందుకు ప్రయత్నించగా పారిపోయారు. పోలీసులు వెంబడించగా నిందితులు ఆటోను వదిలి పరారయ్యారు. ఆటోతోపాటు అందులో ఉన్న రూ.4.40 లక్షల విలువ చేసే 29.30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వినోద్ తెలిపారు.



జిన్నారం మండలం వావిలాలలో చిక్కుడు పంటను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## ఉద్యాన పంటల సాగు పెంపునకు కృషి

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**జిన్నారం:** రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని వావిలాలలో ఓ రైతు సాగు చేస్తున్న చిక్కుడు, టమాట, బంతి సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగును పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కొత్తతరం యువకులు, విద్యావంతులు ఈ రంగంలోకి రావాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా పంటల సాగును పెంచేందుకు వచ్చే ఆర్థిక బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. అంతకుముందు మంత్రి మొక్కలు నాటారు.



వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకోవడంతో పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైన సంఘటన సూర్యాపేట మండలం మోదిన్‌పురంలో ఆదివారం చోటుచేసుకున్నది. మోదిన్‌పురం గ్రామానికి చెందిన ఓర్సు పెద్ద లింగయ్య, చంద్రమ్మ దంపతులు గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం గ్యాస్‌పైన వంట చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు రాగా గుడిసెకు అంటుకున్నాయి. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ కూడా పేలింది. ఈ ఘటనతో ఆ దంపతులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే గుడిసె మొత్తం దగ్ధమైంది. ఇటీవల తెచ్చుకున్న పొదుపు సంఘం డబ్బులు రూ. 95 వేలు, అరతులం బంగారం, బియ్యం, దుస్తులు, వంట సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి. - చివ్వెంల

## ఆహారం వికటించి 180 మందికి అస్వస్థత

- రిమ్స్‌లో 25 మందికి చికిత్స
- మిగతా వారికి పెండల్‌వాడలో ప్రత్యేక శిబిరంలో వైద్యం

**జైనథ్/ఎదులాపురం:** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పెండల్‌వాడ దాజీనగర్ కాలనీలో ఆదివారం ఆహారం వికటించి 180 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురుపూజ నిర్వహించారు. శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది వరకు భోజనం చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఒక్కొక్కరు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున మరికొంత మందికి.. ఇలా భోజనం తిన్న ప్రతి ఒక్కరూ అస్వస్థతకు గురయ్యారు. మండల వైద్యురాలు దీపిక వైద్య సిబ్బందితో గ్రామానికి వెళ్లి సేవలందించారు. జిల్లా వైద్యశాఖ అధికారి చందు, అదనపు జిల్లా వైద్యాధికారి సాధన పెండల్‌వాడను సందర్శించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు. మెరుగైన చికిత్స కోసం 25 మందిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆహారం వికటించి అస్వస్థతకు గురయ్యారని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యులు తెలిపారు. గ్రామంలో మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు.

## మేడారం జాతర పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు

**ములుగు ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేసేందుకు జాతర పునరుద్ధరణ కమిటీని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వీ అనిల్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సభ్యులుగా ఆలం రామ్మూర్తి, వట్టం నాగరాజు, మడప శ్యాం, పోడెం శోభన్, పెండ్యాల ప్రభాకర్, చిలక మర్రి రాజేందర్, చంటి భద్రయ్య, వాసం కుమారస్వామి, కల్తి లక్ష్మయ్య, పోరిక కస్నా, గంటమూరి భాగ్యలక్ష్మీ, వాసం రజిని, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, సిద్దబోయిన జగ్గారావుతో కలిపి మొత్తం 15 మందితో కమిటీని నియమించారు. ఈ కమిటీ మూడు నెలల పాటు కొనసాగుతుంది. వీరిలో ఒకరు చైర్మన్‌గా ఎన్నికకానున్నారు.

### చలికాలం

| జిల్లా | కనిష్టం | గరిష్టం | జిల్లా | కనిష్టం | గరిష్టం |
|---|---|---|---|---|---|
| | | | సిద్దిపేట | 15.0 | 27.0 |
| | | | నల్లగొండ | 15.0 | 27.4 |
| | | | యాదాద్రి భువనగిరి | 15.0 | 28.0 |
| ఆదిలాబాద్ | 6.5 | 24.5 | జనగామ | 16.0 | 26.0 |
| మంచిర్యాల | 9.5 | 28.4 | నిర్మల్ | 16.0 | 27.0 |
| వికారాబాద్ | 10.6 | 31.4 | జయశంకర్ భూపాలపల్లి | 16.0 | 27.0 |
| పెద్దపల్లి | 12.0 | 26.0 | సూర్యాపేట | 16.0 | 29.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 12.0 | 28.0 | మెదక్ | 16.3 | 29.8 |
| వరంగల్ అర్బన్ | 12.5 | 27.0 | నాగర్‌కర్నూల్ | 17.0 | 27.0 |
| ములుగు | 13.0 | 29.0 | మహబూబాబాద్ | 17.0 | 28.0 |
| నిజామాబాద్ | 13.9 | 26.8 | భద్రాద్రి కొత్తగూడెం | 17.0 | 28.0 |
| కామారెడ్డి | 14.0 | 26.0 | సంగారెడ్డి | 17.8 | 28.7 |
| జగిత్యాల | 14.0 | 26.0 | రాజన్న సిరిసిల్ల | 18.0 | 26.0 |
| వరంగల్ రూరల్ | 14.0 | 26.0 | రంగారెడ్డి | 18.0 | 27.0 |
| కరీంనగర్ | 14.0 | 28.0 | ఖమ్మం | 18.0 | 29.0 |
| హైదరాబాద్ | 14.5 | 27.7 | మహబూబ్‌నగర్ | 18.0 | 29.5 |
| మేడ్చల్ | 14.5 | 27.7 | నారాయణపేట | 18.0 | 29.5 |
| వనపర్తి | 14.8 | 33.7 | జోగులాంబ గద్వాల | 19.1 | 31.1 |



తన పొలంలో రైతులకు భోజనాలు వడ్డిస్తున్న బాధిత రైతు శ్రీనివాస్

## రెవెన్యూ అధికారులతీరుపై వినూత్న నిరసన

ధర్మగంట

**కాసిపేట:** రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ ఆదివారం ఓ రైతు వినూత్నంగా వంటావార్పు చేపట్టి రైతులందరికీ భోజనాలు పెట్టారు. బాధిత రైతు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం పెద్దనపల్లి శివారులోని సర్వే నంబర్ 5/43లో 3.6 ఎకరాలు భూమిని గోనెల రాజయ్య కొనుగోలు చేశారు. ఏండ్ల తరబడి భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాజయ్య చనిపోవడంతో అతని కుమారుడు శ్రీనివాస్ తన పేరిట పట్టా చేయాలని రెవెన్యూ అధికారులను కొంతకాలంగా కోరుతున్నారు. ఇటీవల సింగరేణి, రెవెన్యూ సర్వేలో ఇతను కాస్తులో ఉన్నట్టు నోటీసులు కూడా ఇచ్చారు. తన భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇదే విషయాన్ని రైతులకు భోజనాలు పెట్టి తన గోడును వెళ్లబోసుకున్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

6 గ్రాముల కొకైన్, 4 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం



షేక్ షెహబాజ్

**మెహిదీపట్నం:** హైదరాబాద్ నగరంలో నయాసాల్ జోష్‌ను సొమ్ము చేసుకోవడానికి మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ముంబై వాసిని ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. ముంబై ప్రాంతానికి చెందిన షేక్ షెహబాజ్(28) రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 102 వద్ద డ్రగ్స్ అమ్ముతున్నట్టు వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్సైలు మల్లికార్జున్, ముజఫర్ అలీ అక్కడికి వెళ్లి డ్రగ్స్ విక్రయిస్తున్న షేక్ షెహబాజ్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 6 గ్రాముల కొకైన్, 4 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు.

## ఫైనల్లో నల్లగొండ, మహబూబ్‌నగర్

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర స్థాయి రగ్బీ టోర్నీ బాలికల విభాగంలో నల్లగొండ, మహబూబ్‌నగర్ జట్లు ఫైనల్‌కు చేరాయి. సెమీఫైనల్స్‌లో నల్లగొండ 31 గోల్స్ తేడాతో మెదక్‌పై.. మహబూబ్‌నగర్ 31 గోల్స్ తేడాతో హైదరాబాద్‌పై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించాయి. బాలుర విభాగంలో హైదరాబాద్, నల్లగొండ జట్లు ఫైనల్లో అడుగుపెట్టాయి. అంతకుముందు ఎస్జీఎఫ్ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌గౌడ్ రెండో రోజు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ రావు, వేణుగోపాల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## తనిష్క్‌కు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో శిక్షణ పొందుతున్న హైదరాబాద్‌కు చెందిన యువ సైక్లిస్ట్ ఎం.తనిష్క్‌ను క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. అతి చిన్న వయసులోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న తనిష్క్ ఒలింపిక్స్‌లో ప్రతిభ కనబరచి తెలంగాణకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, గోపగోని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో యువ సైక్లిస్ట్ తనిష్క్‌ను అభినందిస్తున్న క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

## ఓవరాల్ చాంప్ హైదరాబాద్




**జనగామ, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ సత్తాచాటితే.. బాలికల్లో రంగారెడ్డి ముందు వరుసలో నిలిచింది. అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్‌లో ఆదివారం నిర్వహించిన ఈ స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. అండర్-16, 18, 20 వయో విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 550 మంది బాలురు, 300 మంది బాలికలు పాల్గొన్నారు. బాలబాలికల విభాగాల్లో ఒక్కోదాంట్లో నుంచి నలుగురు చొప్పున మొత్తం 24 మందిని జాతీయ స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, జనగామ జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు పెద్ది వెంకట నారాయణ గౌడ్, గంటా రవీందర్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

## నేటి నుంచి మహిళా క్రికెట్ టోర్నీ



**మయూరిసెంటర్:** ఆల్‌ఇండియా మహిళల క్రికెట్ సంఘం, రాష్ట్రీయ సామాజిక్ సమరసతా సంఘటన్ (ఆర్‌ఎస్‌ఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్‌ఇండియా స్థాయి మహిళల క్రికెట్ టోర్నీ సోమవారం ప్రారంభం కానుంది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం వేదికగా జరిగే ఈ టోర్నీ జనవరి 3న ముగియనుంది. తెలంగాణ, జమ్ముకశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడుతో పాటు నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన జట్లు ఈ టోర్నీలో పాల్గొననున్నాయి. ఈ మేరకు ఆల్‌ఇండియా మహిళల క్రికెట్ సంఘం ఆర్గనైజింగ్ చైర్మన్ కూరపాటి ప్రదీప్ ఆదివారం వివరాలు తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో 8 జట్లు పాల్గొనే ఈ టోర్నీని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఎండీ మతిన్, సునీల్ రెడ్డి, ప్రవీణ్, రవి, వీరేశ్ గౌడ్, దుర్గా, వెంకట్, పీడీ శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణాఫ్రికా బోణీ

### టెస్టు చాంపియన్‌షిప్‌లో సఫారీలకు తొలి గెలుపు



రబడ (4/103)

**సెంచూరియన్:** ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. భారత్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన సఫారీలు.. ఇంగ్లండ్‌పై సమిష్టిగా సత్తాచాటడంతో.. బాక్సింగ్‌డే టెస్టులో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో గెలుపొందింది. అనూహ్య మలుపులు తిరిగిన ఈ పోరులో విజయం ఇరుజట్లతో దోబూచులాడినా.. చివరకు దక్షిణాఫ్రికాదే పైచేయి అయింది. 376 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. ఒకదశలో 139/1తో పటిష్ఠ స్థితిలో నిలిచి గెలుపొందేలా కనిపించినా.. ప్రొటీస్ బౌలర్లు రబడ (4/103), నోర్జే (3/56) విజృంభించడంతో చివరకు 268 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 121/1తో ఆదివారం నాలుగోరోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్.. కాసేపటికే బర్న్స్ (84) వికెట్ కోల్పోయింది. అయినా డెన్లీ (31), రూట్ (48) నిలకడగా ఆడటంతో ఇంగ్లండ్ గెలుపు ఖాయమే అనిపించింది. అయితే రబడ, నోర్జే రెచ్చిపోవడంతో 64 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో ప్రారంభం కానుంది.

# పదునెక్కిన పంచ్‌లు




అమిత్ పంగల్

**చరిత్రాత్మక ప్రదర్శనలు.. నూతన రికార్డులు.. ఎంపికపై నాటకీయ పరిణామాలు.. కాసిన్ని డోపింగ్ మరకలు.. ఇదీ ఈ ఏడాది భారత బాక్సింగ్ సాగిన తీరు. మొత్తంగా మన బాక్సర్లు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అమిత్ పంగల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన తొలి భారత పురుష బాక్సర్‌గా చరిత్ర సృష్టించడం సహా మిగిలిన టోర్నీల్లోనూ సత్తాచాటడం హైలెట్‌గా నిలిచింది. తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాంజా మెమోరియల్‌లో స్వర్ణం సహా ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తాచాటింది. మిగిలిన బాక్సర్లు సైతం రాణించడంతో ఈ ఏడాది అంతర్జాతీయ టోర్నీల్లో భారత్ పతకాల సంఖ్యను మెరుగుపరుచుకుంది. మరోవైపు ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో విజేందర్ జైత్రయాత్ర దిగ్విజయంగా కొనసాగింది.**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

భారత బాక్సర్ల పంచ్‌లు ఈ ఏడాది మరింత పదునెక్కాయి. అడుగుపెట్టిన అంతర్జాతీయ టోర్నీల్లో గతం కంటే మెరుగైన ప్రదర్శనతో అదరగొట్టారు. ముఖ్యంగా అమిత్ పంగల్ ఆసాంతం జోరు కనబరిచాడు. తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ మెరుగైన ప్రదర్శనతో పతకాలు సాధించింది. ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ కోసం ట్రయల్స్ నిర్వహించాలని చేసిన పోరాటంలో నెగ్గినా.. బౌట్‌లో కాస్త వెనుకబడి మేరీకోమ్ చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు నీరజ్ ఫొగట్, సుమిత్ సాంగ్వాన్ డోపింగ్ పరీక్షల్లో విఫలమవడం బాక్సింగ్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసింది.

### స్ట్రాంజాతో షురూ..

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ప్రతిష్ఠాత్మక యూరప్ టోర్నీ స్ట్రాంజా మెమోరియల్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. 49 కేజీల విభాగంలో చివరిసారిగా బరిలో దిగిన అమిత్ పంగల్ స్వర్ణంతో భారత్ పతకాల ఖాతా తెరిచాడు. నిజామాబాద్ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు) తన పదునైన పంచ్‌లతో సత్తాచాటి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ మాజీ జూనియర్ చాంపియన్ నిఖత్ ఫైనల్లో ఫిలిప్పీన్స్ బాక్సర్ ఐరిశ్ మ్యాగ్నపై పూర్తి ఆధిపత్యం కనబరిచి 5-0తో గెలుపొందింది. మీనా కుమారి దేవి (54 కేజీలు) సైతం ఆకట్టుకునే ప్రదర్శనతో పసిడి పట్టింది. 52 కేజీల విభాగానికి మారిన తర్వాత కూడా అమిత్ పంగల్ అద్భుత ప్రదర్శన కొనసాగించాడు. ఏప్రిల్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కొత్త విభాగంలో పోరును స్వర్ణంతో ఆరంభించాడు. పూజా రాణి (81 కేజీలు) కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ సన్నాహకాలపై దృష్టిపెట్టిన దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ ఆసియా పోరుకు దూరమైంది.

### అమిత్ రికార్డు పతకం

రష్యా వేదికగా జరిగిన ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో అమిత్ పంగల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ప్రారంభం నుంచి ఎదురైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ తుదిపోరుకు చేరి, ఆ ఘనత సాధించిన తొలి భారత పురుష బాక్సర్‌గా చరిత్ర సృష్టించాడు. అయితే, ఫైనల్లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ చేతిలో ఓడినా భారత్‌కు ఈ టోర్నీ చరిత్రలో తొలి రజతాన్ని సాధించిపెట్టాడు. అలాగే మనీశ్ కౌశిక్ (63 కేజీలు) సైతం కాంస్యంతో రాణించాడు. ఇక మహిళల చాంపియన్‌షిప్‌లో మంజు రాణి రజత పతకం సాధించగా.. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్ కాంస్యంతో సరిపెట్టుకుంది.



మేరీ కోమ్

### వివాదం మొదలైందిక్కడే..

అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఏఐబీఏ)లో ఆర్థిక, పరిపాలనా పరమైన అవకతవకలు జరిగాయన్న కారణంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ఒలింపిక్స్ అర్హత హోదాను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) రద్దు చేసింది. దీనికి బదులు ప్రత్యేకంగా ఒలింపిక్ క్వాలిఫయర్స్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం భారత బాక్సింగ్‌లో వివాదానికి కారణమైంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, రజత పతకాలు గెలిచిన బాక్సర్లను నేరుగా క్వాలిఫయర్స్‌కు పంపాలని భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్‌ఐ) నిర్ణయించుకుంది. అయితే కాంస్యమే గెలిచినా గత ప్రదర్శనల ఆధారంగా మేరీకోమ్‌ను నేరుగా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు పంపాలని బీఎఫ్‌ఐ అనుకుంది. ఈ నిర్ణయాన్ని తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ బహిరంగంగానే వ్యతిరేకించి, ట్రయల్స్ నిర్వహించాల్సిందేనని డిమాండ్ చేసింది.

### చలో టోక్యో

ఈ ఏడాది ఆకట్టుకునే ప్రదర్శన చేసిన భారత బాక్సర్లు టోక్యో (2020 ) ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం తీవ్ర కసరత్తులు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 నుంచి 14 వరకు చైనాలోని వుహాన్‌లో విశ్వక్రీడల అర్హత పోటీలు జరుగనున్నాయి. క్వాలిఫయర్స్‌లో ఎలాగైన విజయం సాధించి ఒలింపిక్స్‌లో అడుగుపెట్టాలని భారత బాక్సర్లు పట్టుదలగా ఉన్నారు. 2016 రియో ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత్‌కు ఒక్క పతకం కూడా దక్కకపోగా.. మహిళల విభాగంలో కనీసం ఒక్కరు కూడా మెగాటోర్నీకి అర్హత సాధించలేకపోయారు. ఆ ప్రదర్శనను మరిపించేలా ఈసారి విశ్వక్రీడల్లో సత్తాచాటడమే మన బాక్సర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.



### రాటుదేలిన నిఖత్

**తెలంగాణ** యువ బాక్సర్ నిఖత్ జరీన్ ఆటతో పాటు మానసికంగానూ రాటుదేలి ఎనలేని పోరాట పటిమ ప్రదర్శించింది. ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా టోర్నీలో అదరగొట్టే పంచ్‌లతో ప్రత్యర్థులను చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని అందుకుంది. ఏప్రిల్‌లో థాయ్‌లాండ్ వేదికగా జరిగిన ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లోనూ రాణించిన నిఖత్ కాంస్య పతకం నెగ్గింది. అదే జోరు కొనసాగిస్తూ థాయ్‌లాండ్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నీలో రజతంతో ఆకట్టుకుంది. ఓ వైపు ఆటను మెరుగుపరుచుకుంటూనే తన హక్కుల కోసం నిఖత్ చేసిన పోరాటం అందరి మన్ననలందుకుంది. ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు 51 కేజీల విభాగంలో మేరీకోమ్‌ను నేరుగా పంపాలన్న బీఎఫ్‌ఐ నిర్ణయాన్ని ధైర్యంగా ప్రశ్నించింది. మేరీతో తనకు ట్రయల్స్ నిర్వహించాల్సిందేనని చివరి వరకు పట్టువదలకుండా పోరాడింది. కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజుకి లేఖ రాసి.. తనకు న్యాయం చేయాలని కోరింది. దీంతో దిగివచ్చిన బీఎఫ్‌ఐ.. ట్రయల్స్ నిర్వహిస్తామని చెప్పడంతో నిఖత్ తన పోరాటంలో విజయం సాధించింది. శనివారం మేరీతో జరిగిన ట్రయల్ బౌట్‌లో కాస్త వెనుకబడి పరాజయం చెందినా.. పోరాట స్ఫూర్తితో జరీన్ బాక్సింగ్ అభిమానుల మనసు గెలుచుకుంది. సీనియర్ అయిన మేరీకోమ్ తన పట్ల దురుసుగా ప్రవర్తించినా నిఖత్ హుందాగా మాట్లాడి పరిణితి ప్రదర్శించి ఆటతోనూ, ప్రవర్తనతోనూ ఆకట్టుకున్నది.

### విజేందర్ జైత్రయాత్ర

**స్టార్** బాక్సర్, బీజింగ్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత విజేందర్ సింగ్ ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన జైత్రయాత్రను కొనసాగించాడు. జూలైలో అమెరికా సర్క్యూట్‌లో అడుగుపెట్టిన విజేందర్.. స్టార్ బాక్సర్ మైక్ స్నైడర్‌ను నాకౌట్‌తో చిత్తుచేశాడు. నవంబర్‌లో దుబాయ్ వేదికగా జరిగిన బౌట్‌లో ఘనా బాక్సర్ చార్లెస్ అదామును మట్టికరిపించి ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో అజేయంగా నిలిచాడు. ఇప్పటి వరకు 12 ప్రొఫెషనల్ బౌట్లలో బరిలోకి దిగిన విజేందర్.. అన్నింట్లోనూ విజయపతాక ఎగురవేశాడు.





ఆదివారం హైదరాబాద్‌లోని జీవీకే మాల్‌లో అసిక్స్ స్టోర్ ప్రారంభించిన భారత పేసర్ భువనేశ్వర్ కుమార్

## బుకీ- పీసీబీ భాయ్ భాయ్

### కనేరియా సంచలన ఆరోపణలు

**కరాచీ:** పాకిస్థాన్ ఆటగాళ్లు మతపరమైన వివక్ష చూపారని వ్యాఖ్యానించిన ఆ దేశ మాజీ ఆటగాడు దానిష్ కనేరియా మరో బాంబు పేల్చాడు. కౌంటీ క్రికెట్‌లో 2012లో జరిగిన స్పాట్ ఫిక్సింగ్‌లో కీలకపాత్ర పోషించిన బుకీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆహ్వానం మేరకు తమ దేశానికి చాలాసార్లు వచ్చాడని ఆదివారం చెప్పాడు. తనను ఎప్పుడూ తప్పుడు కోణంలోనే చూపించారని ఆవేదన వ్యక్తం చేశాడు. 'వాస్తవాలు బయటపెట్టాలనుకుంటున్నా. నాకు ఆ వ్యక్తి (బుకీ)ని కొందరు పరిచయం చేశారు. అతడితో నాకు పరిచయం లేదు. నేను పొరపాటు చేశాను తప్ప దేశాన్ని అమ్ముకోలేదు. అలాంటి వాళ్లు జైలు శిక్ష అనుభవించి మళ్లీ జట్టులోకొచ్చారు' అని కనేరియా చెప్పాడు.

## దాదా దావత్ ఇచ్చాడు..



- పాక్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ వ్యాఖ్య
- మా మధ్య మతం ఎప్పుడూ అడ్డురాలేదని వెల్లడి

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ క్రికెట్‌లో మత ప్రాతిపదికన అంతరాలు ఏనాడు లేవని ఆ జట్టు మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ స్పష్టం చేశాడు. హిందువునైన కారణంగా కొందరు పాక్ ఆటగాళ్లు తనతో కలిసి భోజనం చేసేందుకు ఇష్టపడకపోయేవారని పాక్ మాజీ స్పిన్నర్ దానిశ్ కనేరియా చేసిన వ్యాఖ్యలపై ఇంజీ మండిపడ్డాడు. కెరీర్‌లో అత్యధిక శాతం తన కెప్టెన్సీలో ఆడిన కనేరియా అభిప్రాయాన్ని ఇంజమామ్ తప్పుబట్టాడు. ఈ అంశంతో పాటు భారత క్రికెటర్లతో తమ అనుబంధాన్ని ఇంజీ గుర్తుచేసుకున్నాడు. ఆ వివరాలు అతడి మాటల్లోనే.. కనేరియా అభిప్రాయంతో నేను ఏకీభవించడం లేదు. పాకిస్థానీలు విశాల హృదయులు. వారు ఎవరినైనా అక్కున చేర్చుకుంటారు. పదిహేనేండ్ల విరామం అనంతరం భారత జట్టు 2004లో పాక్ పర్యటనకు వచ్చినప్పుడు మా ఆతిథ్యానికి ఆ జట్టు ఆటగాళ్లు ఫిదా అయ్యారు. వాళ్లు ఎక్కడికెళ్లినా ఘనస్వాగతం లభించడంతో పాటు.. వారు తిన్న తిండికి, కొనుగోలు చేసిన వస్తువులకు మా దేశ వాసులు ఎలాంటి డబ్బులు తీసుకోలేదు. ఆ తర్వాతి ఏడాది మేము భారత పర్యటనకు వెళ్లినప్పుడు కూడా మాకు అలాంటి ఆదరణే లభించింది.

### దాదా రెస్టారెంట్‌ను నేనే ఓపెన్ చేశా

భారత పర్యటన (2005)కు ముందు గంగూలీ ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను నేను, సచిన్ కలిసి ప్రారంభించాం. ఆ తర్వాత దాదా ప్రేమతో నాకు భోజనం పంపాడు. నేను దాన్ని అంతే ఆప్యాయతతో ఆరగించాను. భారత్, పాక్ జట్లు షార్జాలాంటి చోట ఆడుతున్న సమయంలో అంతా కలిసి ఒకే హోటల్లో బసచేసేవాళ్లం. అదరం కలిసే భోజనం చేసేవాళ్లం. అంతేకానీ మత ప్రాతిపదికన ఒకరిని దూరం పెట్టేంత కుసంస్కారం పాక్ జట్టులో లేదు. కనేరియా చెప్పిన అంశం ఒక్కసారి కూడా నా దృష్టికి రాలేదు. యూసుఫ్ యోహానా ముస్లిమేతరుడిగానే కెరీర్ ఆరంభించాడు. ఆ తర్వాత ఇష్టపూర్తిగానే ఇస్లాం స్వీకరించాడు. అతడు యోహానాగా ఉన్నప్పుడు కూడాఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు.

### డీడీసీఏ ఏజీఎంలో కొట్లాట

ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) వార్షిక సర్వసభ్య సమావేశంలో తీవ్ర రభస జరిగింది. అంబుడ్స్‌మన్ తొలగింపు సహా మరికొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టిన సమయంలో చెలరేగిన వాగ్వాదం చివరకు బాహాబాహీ వరకు వెళ్లింది. జాయింట్ సెక్రటరీ రాజన్ మన్‌చందాను మక్సూద్ ఆలం చెంపదెబ్బ కొట్టినట్టు సమాచారం. ఇది సిగ్గుచేటు చర్య అని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, ఎంపీ గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తంచేశాడు. డీడీసీఏను తక్షణమే రద్దు చేయడంతో పాటు గొడవకు దిగినవారిపై జీవితకాల నిషేధం విధించాలని బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీకి విజ్ఞప్తి చేశాడు. కాగా.. చివరకు డీడీసీఏ నూతన అంబుడ్స్‌మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి దీపక్ వర్మను నియమించింది.



## హైదరాబాద్‌కు ఏడో ఓటమి

**ముంబై:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఆరో సీజన్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. ఆదివారం ఫుట్‌బాల్ ఎరీనా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 1-2తో ముంబై ఎఫ్‌సీ చేతిలో పరాజయం పాలైంది. ముంబై ఆటగాడు మొదౌ సౌగో (6వ, 78వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో జట్టును గెలిపించాడు. హైదరాబాద్ తరపున బోబో (81వ ని.లో) ఓ గోల్ చేశాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి ఆతిథ్య జట్టు దూకుడుకు కళ్లెం వేసేందుకే పరిమితమైన హైదరాబాద్ వచ్చిన కొన్ని అవకాశాలను సైతం చేజార్చుకుంది. చివర్లో పుంజుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో హైదరాబాద్‌కు ఏడో ఓటమి తప్పలేదు. లీగ్‌లో ఇప్పటివరకు కేవలం ఒక మ్యాచ్ మాత్రమే నెగ్గిన హైదరాబాద్ 5 పాయింట్లు ఖాతాలో వేసుకుని పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిస్తే.. గోవా 21 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నది.

## ఆసీస్ ఘనవిజయం

### 247 పరుగుల తేడాతో కివీస్ చిత్తు



**మెల్‌బోర్న్:** మూడు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌తో బాక్సింగ్ డే టెస్టు ఆడిన ఆస్ట్రేలియా భారీ విజయాన్ని మూటగట్టుకుంది. బౌలర్లు విజృంభించడంతో రెండో టెస్టులో ఆసీస్ 247 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకుంది. 488 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోదిగిన న్యూజిలాండ్.. లియాన్ (4/81), పాటిన్‌సన్ (3/35) ధాటికి 240 పరుగులకు ఆలౌటైంది. టామ్ బ్లండెల్ (121; 15 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కినా.. మిగిలినవాళ్లు విఫలమవడంతో కివీస్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 137/4తో ఆదివారం నాలుగో రోజు ఆట కొనసాగించిన కంగారూలు.. మరో 10 ఓవర్లు బ్యాటింగ్ చేసి 168/5 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. దీంతో బ్లాక్‌క్యాప్స్ ముందు భారీ లక్ష్యం నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో శతక్కొట్టిన ట్రావిస్ హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో టెస్టు జనవరి 3 నుంచి సిడ్నీలో జరుగనుంది.

## సిడిల్ వీడ్కోలు



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా వెటరన్ పేసర్ పీటర్ సిడిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకుంటున్నట్లు ఆదివారం వెల్లడించాడు. ఆసీస్ తరపున 67 టెస్టులు, 20 వన్డేలు, రెండు టీ20లు ఆడిన 35 ఏండ్ల సిడిల్.. ఓవరాల్‌గా 241 వికెట్లు పడగొట్టాడు. 2008లో టీమ్‌ఇండియాపై సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన అతడు.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇంగ్లండ్‌తో చివరి టెస్టు ఆడాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను ఔట్ చేయడంతో వికెట్ల ఖాతా తెరిచిన సిడిల్.. తన 26వ పుట్టిన రోజున ఇంగ్లండ్‌పై టెస్టుల్లో హ్యాట్రిక్ తీయడం విశేషం. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో సిడిల్ సభ్యుడు కాగా.. మెల్‌బోర్న్ మ్యాచ్‌లో అతడికి జట్టులో చోటు దక్కలేదు.

## రెండింతలైన ఎయిర్‌టెల్ కనీస రీచార్జి

### రూ.23 నుంచి రూ.45కి పెంచిన సంస్థ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** ప్రీ-పెయిడ్ టెలికం వినియోగదారులకు షాకిచ్చింది భారతీ ఎయిర్‌టెల్. తప్పనిసరి కనీస రీచార్జిని ఇంచుమించు రెండింతలు పెంచింది. ప్రస్తుతం రూ.23గా ఉన్న కనీస రీచార్జిని రూ.45కి పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకున్నది. 28 రోజులపాటు టెలికం సేవలు పొందాలంటే రూ.45 లేదా అంతకంటే ఎక్కువగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నూతన రీచార్జి ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. ఒకవేళ రూ.45 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో రీచార్జి చేయకుంటే ప్రస్తుతం పొందుతున్న ప్లాన్ గడువు ముగిసిన 15 రోజుల తర్వాత సర్వీసులను నిలిపివేయనున్నట్లు తెలిపింది. ఎంపిక చేసిన ప్లాన్లకు మాత్రమే ఈ అవకాశం కల్పించింది. మిగతా ప్లాన్లు మాత్రం గడువు ముగిసిన వెంటనే నిలిచిపోనున్నాయి. ఈ రీచార్జితో వినియోగదారుడికి ఎలాంటి డాటా కానీ, కాల్స్ చేసుకునే అవకాశాలు లేవు. అప్పులతో సతమతమవుతున్న భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్..టారిఫ్‌ల యుద్ధం, అత్యధికంగా వినిమయం మొత్తం టెలికం ఇండస్ట్రీని నాశనం చేస్తున్నదని, టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెంటనే జోక్యం చేసుకొని పెట్టుబడులకు భద్రత, వినియోగదారులు కోరుకుంటున్న విధంగా ప్లాన్ల రూపకల్పనలో పాలుపంచుకోవాలని ఇటీవల సూచించారు. మిట్టల్ వ్యాఖ్యల నేపథ్యంలో ట్రాయ్..కాల్, డాటా ధరల నియంత్రణపై చర్చించింది.

# ఏడాదిలోనే సీన్ రివర్స్

### సంక్షోభంలో దేశ ఆర్థిక వ్యవస్థ ● ఆరేండ్ల కనిష్ఠానికి జీడీపీ
### 45 ఏండ్ల గరిష్ఠానికి నిరుద్యోగ రేటు ● విజృంభించిన ద్రవ్యోల్బణం
### పడకేసిన పారిశ్రామికోత్పత్తి ● మందగించిన వినియోగ సామర్థ్యం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** దేశ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో 2019ని ఓ చీకటి సంవత్సరంగా చెప్పుకోవచ్చు. గతేడాది ఓ వెలుగు వెలిగిన భారత ఆర్థిక వ్యవస్థ.. ఈ ఏడాది మసకబారిపోయింది మరి. 2018 వరకు దేశ జీడీపీ అంచనాలు ఆకాశంలో కదలాడితే.. 2019లో మాత్రం అగాధంలోకి పడిపోయాయి. ఆరేండ్ల కనిష్ఠానికి వృద్ధి రేటు.. 45 ఏండ్ల గరిష్ఠానికి నిరుద్యోగ రేటు.. విజృంభించిన ద్రవ్యోల్బణం.. పడకేసిన పారిశ్రామికోత్పత్తి.. మందగించిన వినియోగ సామర్థ్యం.. స్తంభించిన మార్కెట్.. ఇది ఈ ఏడాది దేశ ఆర్థిక వ్యవస్థ విశ్లేషణాత్మక రూపం. ఒక్క ఏడాదిలోనే అన్నికలలూ కుప్పకూలిపోయాయి. నిన్నమొన్నటి దాకా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి భారత్ అన్న నోర్లే.. నేడు మాంద్యం అంచున భారత్ అంటూ హెచ్చరికలు చేస్తున్నాయి. నిరుడు ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటు కలిగిన దేశంగా భారత్‌ను కీర్తించినవారే.. ఈ యేడు జీడీపీ అంచనాలకు భారీగా కోత పెట్టేస్తున్నారు.

**వచ్చే ఏడాది**

దేశ వృద్ధి రేటు కోలుకోవచ్చని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ ఆశాభావం వ్యక్తం చేస్తున్నది. అటు కేంద్ర ప్రభుత్వం.. ఇటు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వగలవన్న విశ్వాసాన్ని సీఐఐ అధ్యక్షుడు విక్రమ్ కిర్లోస్కర్ కనబరుస్తున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులు చక్కబడగలవనీ అంటున్నారు. కాగా, దేశ జీడీపీ మళ్లీ పరుగులు పెట్టేందుకు సీఐఐ పలు సూచనల్ని కేంద్రానికి చేసింది. ద్రవ్యలోటు లక్ష్యాలను సవరించుకోవాలని, ఇప్పుడున్న దాని కంటే చాలా తక్కువ పరిమితికి కుదించుకోవాలని, 0.50 శాతం నుంచి 0.75 శాతంగా నిర్దేశించుకోవాలని కోరింది. కీలక మౌలిక రంగ ప్రాజెక్టుల కోసం అదనపు నిధులను వినియోగించాలని సూచించింది. జీఎస్టీ రేట్ల సంఖ్యను తగ్గించాలని, కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధం చేయాలన్నది.

**వచ్చే ఏడాది కోలుకోవచ్చు: సీఐఐ**

**ప్రతికూలతలెన్నో..**

కర్ణుడి చావుకు కారణాలెన్నో.. అన్నట్లుగా భారత ఆర్థిక వ్యవస్థ మందగమనానికి ప్రతికూలతలూ అన్నే కనిపిస్తున్నాయి. అందులో ప్రధానమైనది వినియోగదారుల కొనుగోళ్ల శక్తి క్షీణత. దీని వల్ల దేశీయ మార్కెట్ అతలాకుతలమైపోయింది. 2014 నుంచి గమనిస్తే అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వృద్ధి రేటు క్షీణిస్తున్న సంకేతాలు స్పష్టమవగా, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 5 శాతానికి, జూలై-సెప్టెంబర్‌లో 4.5 శాతానికి పతనమైంది. ఇది ఆరేండ్ల కనిష్ఠం కావడం గమనార్హం. ఇదే సమయంలో నిరుద్యోగ రేటు 45 ఏండ్ల గరిష్ఠాన్ని తాకి 6.1 శాతాన్ని చేరింది. ఆహారోత్పత్తుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం సైతం విజృంభించింది. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం మళ్లీ రెక్కలు తొడుగగా, రిజర్వ్ బ్యాంక్ వరుస వడ్డీ రేట్ల కోతలకు బ్రేక్ పడింది. నవంబర్‌లో మూడేండ్ల గరిష్ఠాన్ని అందుకుని చిల్లర ద్రవ్యోల్బణం 5.54 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. పారిశ్రామికోత్పత్తి కూడా వరుసగా మూడో నెల మైనస్‌కే పరిమితమైంది. అక్టోబర్‌లో -3.8 శాతంగా నమోదైంది. రుణాల మంజూరు సైతం దిగజారి వ్యవస్థను నిధుల కొరత వేధించింది. బ్యాంకింగ్ రంగ మోసాలు, ఐఎల్అండ్ఎఫ్ఎస్, డీహెచ్ఎఫ్ఎల్ వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల కుంభకోణాలు సైతం జీడీపీని కుదేలు చేశాయి. పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావం కూడా కారణమే. అంతర్జాతీయంగా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, అగ్రరాజ్యాల వ్యాపార రక్షణాత్మక ధోరణులు తదితర అంశాలూ దేశ ఆర్థిక వ్యవస్థను కుంగదీశాయి.

**ఫలించని ప్రభుత్వ చర్యలు**

గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి దారిలో పెట్టేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు అనేకానేక సంస్కరణలనే తెచ్చింది. అయినప్పటికీ ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. సంస్కరణల ఫలాలు మొదలైయ్యాయని, త్వరలోనే దేశ జీడీపీ పుంజుకుంటుందని ప్రభుత్వ వర్గాలు ఎంతగా చెబుతున్నా.. ఆ ఆనవాళ్లు మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. పైపెచ్చు అంతకంతకూ వృద్ధిరేటు నేల చూపులు చూస్తున్నది. ఒకప్పుడు అమెరికా, చైనా జీడీపీల స్థాయిలో భారత వృద్ధికి ఆదరణ లభించగా, ఇప్పుడు ఫిలిప్పీన్స్, ఇండోనేషియా కంటే తక్కువ స్థాయిలో జీడీపీ నమోదవుతుండటం గమనార్హం. చివరి త్రైమాసికంలో ఇదే జరిగింది. మలేషియా కంటే కాస్త ముందున్నదంటే దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు ఎలా? ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి ఫిచ్ రేటింగ్స్, మూడీస్, ఎస్అండ్‌పీ వరకు అంతా దేశ జీడీపీ అంచనాలకు కోత పెడుతున్నది చూస్తూనే ఉన్నాం.

**2026 నాటికి..**

**2026 నాటికి** భారత్.. జర్మనీని దాటుకుని ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే వీలుందని బ్రిటన్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రిసెర్చ్ (సీఈబీఆర్) అంచనా వేసింది. అమెరికా, చైనా, జపాన్ తర్వాత భారతేనన్నది. ఇప్పటికే ఈ ఏడాది బ్రిటన్, ఫ్రాన్స్‌లను భారత్ అధిగమించిందని గుర్తుచేసిన సీఈబీఆర్.. 2026కల్లా దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుందని చెప్పింది. అయితే 2024 నాటికే ఈ లక్ష్యాన్ని సాధిస్తామని మోదీ సర్కారు చెబుతున్నది. కానీ వృద్ధిపై నెలకొన్న సందేహాలు భారత్ సత్తాను ప్రశ్నిస్తున్నాయి.

## విస్తరణ బాటలో కేర్ హాస్పిటల్స్

### 2021 చివరి నాటికి 800 పడకలు ఏర్పాటు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** హైదరాబాద్ కేంద్రస్థానంగా వైద్య సేవలు అందిస్తున్న కేర్ హాస్పిటల్స్ విస్తరణ బాటపట్టింది. ఇదివరకే దేశవ్యాప్తంగా 2,200 పడకలు కలిగిన 12 హాస్పిటల్స్‌ను నిర్వహిస్తున్న సంస్థ.. 2021 చివరి నాటికి మరో 800 పడకలను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. దుబాయికి చెందిన ఎవర్‌కేర్ గ్రూపు ఆధ్వర్యంలో ఆ ఆసుపత్రి నడుస్తున్నది. వచ్చే రెండేండ్లకాలంలో భారత్‌లో పడకల సంఖ్యను 3 వేలకు పెంచుకోవాలని తమ లక్ష్యమని, ఇందుకోసం మరో 800కి పైగా పడకలను ఏర్పాటు చేయబోతున్నట్లు కేర్ హాస్పిటల్స్ గ్రూపు సీఈవో, ఎవర్‌కేర్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ సింఘల్ తెలిపారు. దీంట్లోభాగంగా 250 పడకలతో విశాఖపట్నంలో నిర్మిస్తున్న నాలుగో ఆసుపత్రి త్వరలో అందుబాటులోకి రానున్నట్లు ఆయన పీటీఐకి చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా చిన్న స్థాయి ఆసుపత్రులను కొనుగోలు చేసే ఆలోచన కూడా ఉన్నదని, కుదిరితే కొనుగోళ్లు లేక నూతనంగా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. విశాఖపట్నం, భువనేశ్వర్, రాయ్‌పూర్, నాగపూర్, పుణె, హైదరాబాద్‌లలో తక్కువ ఖర్చుకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇక్కడ ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే పడకల కోసం నిధులను సేకరించే అవకాశం లేదని, సంస్థ వద్ద తగినన్ని నిధులు ఉన్నాయని చెప్పారు. ఒక్కో పడకను ఏర్పాటు చేయడానికి కనీసంగా రూ.65 లక్షల ఖర్చు అవుతుదని, మొత్తం 800 పడకలకోసం రూ. 500 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు ఆయన సూచనప్రాయంగా చెప్పారు. ప్రస్తుతం సంస్థ ద్వి, తృతీయ శ్రేణి నగరాల్లో వైద్య సేవలు అందిస్తున్నది.







## ఈ-కామర్స్‌లో ప్రకంపనలు

### వచ్చే ఏడాది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు సవాలే
### రిలయన్స్ రాకపై అంచనాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** వచ్చే ఏడాది ఆన్‌లైన్ మార్కెట్‌లో భారీ ప్రకంపనలే చోటుచేసుకోనున్నాయి. ఈ-కామర్స్ రంగంలోకి రిలయన్స్ అడుగుపెడుతున్నది మరి. దీంతో ప్రస్తుతం ఈ రంగాన్ని ఏలుతున్న అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలకు సవాళ్లు తప్పవన్న అంచనాలు పరిశ్రమ నుంచి వ్యక్తమవుతున్నాయి. దేశీయ టెలికం రంగ ముఖచిత్రాన్ని రిలయన్స్ జియో ఏ స్థాయిలో మార్చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ క్రమంలో ఆన్‌లైన్ షాపింగ్ తీరుతెన్నులూ రిలయన్స్ రాకతో మారిపోగలవన్న అభిప్రాయాలు సర్వత్రా నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ మార్కెట్‌ను కలిగి ఉన్న భారత్‌ను.. ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్ శాసిస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు అందరికీ అందుబాటులోకి రావడం, ఇంటర్నెట్ చౌకగా లభించడంతో అన్నీ ఆన్‌లైన్‌లోనే కొనేస్తున్నారంతా. ముఖ్యంగా ఆన్‌లైన్ షాపింగ్‌కు యువత అమితాసక్తిని ప్రదర్శిస్తున్నది. ఫలితంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు భారీ డిమాండ్ కనిపిస్తుండగా, ఈ రంగంపై రిలయన్స్ కన్ను పడింది. ఈ ఏడాది పండుగ సీజన్‌లో ఆన్‌లైన్ అమ్మకాలను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు రికార్డు స్థాయిలో నమోదు చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 మధ్య ఏకంగా రూ.19 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు బెంగళూరుకు చెందిన రెడ్‌సీర్ కన్సల్టింగ్ తెలిపింది. ఇందులో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల వాటానే 90 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నది.

**వచ్చే దీపావళి ముహూర్తం?**

వచ్చే ఏడాది దీపావళికల్లా దేశీయ ఈ-కామర్స్ వ్యాపారంలోకి రిలయన్స్ ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కస్టమర్లకు ఆఫర్లే.. ఆఫర్లు అన్న అంచనాలు మిన్నంటుతున్నాయి. జియో ప్రారంభ సమయంలో ఇంటర్నెట్‌ను ఉచితంగా ఇచ్చిన ముకేశ్.. ఆన్‌లైన్ షాపర్స్‌ను ఇంకెలా ఆకట్టుకుంటారో చూడాల్సిందేనని విశ్లేషకులు అంటున్నారు. దీంతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు దెబ్బేనని వారు విశ్లేషిస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఈ-కామర్స్ పాలసీతోనే ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ సమయంలో రిలయన్స్ రాక ప్రతికూలమేనని స్పష్టంగా చెప్పవచ్చు. ఇక దేశవ్యాప్తంగా 6,600లకుపైగా నగరాలు, పట్టణాల్లో విస్తరించిన 10,145 రిలయన్స్ రిటైల్ స్టోర్లు.. రిలయన్స్ ఈ-కామర్స్ వ్యాపారానికి దన్నుగా నిలువనున్నాయి. జియో 4జీ సేవలూ కలిసిరానున్నాయి. 2026 నాటికి భారతీయ ఈ-కామర్స్ మార్కెట్ విలువ 200 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనా.

## పోటెత్తిన క్లయిములు

### పీఎంసీ కేసులో డీఐసీజీసీకి రూ.14,100 కోట్ల దరఖాస్తులు

**ముంబై, డిసెంబర్ 29:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ)కు క్లయిములు పోటెత్తుతున్నాయి. ఈ కేసులో దాదాపు రూ.14,100 కోట్ల క్లయిములను డీఐసీజీసీ అందుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. సెప్టెంబర్ ఆఖరు నాటికి రూ.14,098 కోట్ల క్లయిములు వచ్చినట్లు చెప్పింది. పీఎంసీ బ్యాంక్‌లో రూ.6,500 కోట్ల స్కాం జరుగగా, మొత్తం రూ.9 వేల కోట్ల బ్యాంక్ ఆస్తుల్లో ఇది 73 శాతానికి సమానం. దీంతో బ్యాంక్ డిపాజిటర్లు తమ సొమ్ము కోసం క్యూ కడుతున్నారు. ఈ క్రమంలోనే డీఐసీజీసీకి క్లయిములు వెల్లువెత్తుతున్నాయి. పీఎంసీ కుంభకోణానికి కారణం హెచ్‌డీఐఎల్ సంస్థ అవగా, పరిమితికి మించి దీనికి బ్యాంక్ అధికారులు రుణాలిచ్చారు. బ్యాంక్ డిపాజిట్లు రూ.11,800 కోట్లుగా ఉన్నాయి. అమాయకులు తమ కష్టార్జితం నష్టపోకుండా అన్ని బ్యాంకుల్లోని డిపాజిట్లపై రూ.లక్ష వరకు బీమాను డీఐసీజీసీ అందిస్తున్నది. సదరు బ్యాంకులు మూతబడితే డిపాజిటర్లకు ఈ సొమ్ము చేరుతుంది.

**ఇంకా పూర్తికాని నివేదిక**

పీఎంసీ బ్యాంక్ ఆర్థిక పరిస్థితులపై తనిఖీ నివేదిక ఇంకా సిద్ధం కాలేదని ఆర్బీఐ తెలిపింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద పీటీఐ జర్నలిస్టు దాఖలు చేసిన ఓ దరఖాస్తుకు బదులిస్తూ 'ఈ ఏడాది మార్చి 31 నాటికి బ్యాంక్ ఆర్థిక స్థితిగతులు ఎలా? ఉన్నాయన్నదానిపై పరిశీలన జరుగుతున్నది. నివేదిక తయారు కావాల్సి ఉంది' అని స్పష్టం చేసింది. పీఎంసీ సంక్షోభం నేపథ్యంలో బ్యాంక్‌పై పలు ఆంక్షలను విధించిన ఆర్బీఐ.. నగదు ఉపసంహరణలపై పరిమితులు పెట్టిన సంగతి విదితమే. ప్రస్తుత యాజమాన్యాన్ని రద్దు చేసి, తమ అధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు దేశీయ ఈక్విటీ, డెబిట్ మార్కెట్లోకి ఎఫ్‌పీఐలు రూ.2,613 కోట్ల మేర నిధులు చొప్పించారు. కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశం ఉండటం, మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో ఎఫ్‌పీఐలు భారీగా నిధులు కుమ్మరించారు. డిపాజిటరీ వద్ద ఉన్న తాజా సమాచారం మేరకు ఈక్విటీల్లో రూ.6,301.96 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..డెబిట్ మార్కెట్ల నుంచి రూ. 3,688.94 కోట్ల నిధులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ నెల 2 నుంచి 27 మధ్య కాలంలో రూ.2,613.02 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు అయింది. దేశీయ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులు కొనసాగించడం విశేషమని మార్నింగ్ స్టార్ సీనియర్ ఆర్థికవేత్త హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. జనవరి, జూలై, ఆగస్టు నెలల్లో తప్పా మిగతా నెలల్లో ఎఫ్‌పీఐలు భారీగా పెట్టుబడులు పెట్టారు. నికరంగా ఇప్పటి వరకు రూ.73,276.63 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. కార్పొరేట్ల ట్యాక్స్ తగ్గింపు, రియల్ ఎస్టేట్ చట్టం రెరా అమల్లోకి రావడం వంటి సానుకూల అంశాలు ఎఫ్‌పీఐలను ఆకట్టుకున్నాయి.

# దిగొస్తున్న రుణ భారం

### అప్పుల్ని తీర్చేస్తున్న దేశీయ కార్పొరేట్లు
### ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో రూ.60 వేల కోట్లు తగ్గుదల




**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** దేశీయ కార్పొరేట్లు అప్పులను తీర్చేసుకోవడంపై దృష్టి పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో టాప్-50 కార్పొరేట్లు రూ.59,600 కోట్ల రుణ భారాన్ని తగ్గించుకున్నారు. తమ బ్యాలెన్స్‌షీట్ల పరపతిని వ్యూహాత్మకంగా తగ్గించుకోవడంలో భాగంగానే కార్పొరేట్లు అప్పులను చెల్లిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. గత ఆర్థిక సంవత్సరం (2018-19) లోనూ ఈ కంపెనీలు సుమారు రూ.43 వేల కోట్ల రుణ భారాన్ని తగ్గించుకున్నాయి.

**ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి**

ఆర్థిక అవసరాలను అప్పుల ద్వారా తీర్చుకోవడం ఎందుకని భావిస్తున్న సంస్థలు.. నిధుల సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్ (ఈసీబీ) వంటి ఇతరత్రా దారుల వైపు చూస్తున్నాయి. రుణాలతో పోల్చితే వీటిపై వడ్డీరేట్లు కూడా చాలా తక్కువ. దివాలా చట్టం వంటి న్యాయపరమైన అంశాలనూ పరిగణనలోకి తీసుకుని రుణాలపై ఆధారపడటాన్ని కార్పొరేట్లు తగ్గించుకుంటున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) భారతీయ సంస్థల విదేశీ రుణాలు ఈ అక్టోబర్‌లో 3.41 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతేడాది అక్టోబర్‌లో 1.41 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. ఆటోమేటిక్ ఈసీబీ ద్వారా 2.87 బిలియన్ డాలర్లు, ఆమోదిత ఈసీబీ ద్వారా 538 మిలియన్ డాలర్లు వచ్చాయి.

**బ్యాంకుల వ్యాపారంపై ప్రభావం**

కార్పొరేట్లలో వచ్చిన మార్పు.. బ్యాంకుల వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నది. రుణాల పంపిణీ తగ్గిపోవడంతో రుణ వృద్ధి సన్నగిల్లుతున్నది. ఇప్పటికే ఆర్థిక మందగమనం నేపథ్యంలో బ్యాంకుల రుణ మంజూరు రేటు పడిపోయిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో వినియోగ సామర్థ్యాన్ని పెంచడం కోసం బ్యాంకులు రుణ మేళాలనూ పెడుతున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో కార్పొరేట్ల ఆలోచనా సరళి.. బ్యాంకుల్లో కార్పొరేట్ రుణాలను తగ్గించేస్తున్నది. ఇటీవల ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సైతం తమ తాజా ఆర్థిక సుస్థిరత నివేదికలో కార్పొరేట్లు వ్యాపార వృద్ధి నిమిత్తం రుణ భారాన్ని తగ్గించుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. అక్టోబర్‌లో పరిశ్రమ రుణాలు 3.4 శాతం తగ్గినట్లు కూడా తేలింది. అయితే రిటైల్ రుణాలు 17.2 శాతం పెరుగడం బ్యాంకర్లకు కాస్త ఊరటనిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా బ్యాంకింగ్ రుణ వృద్ధి 1.7 శాతంగానే ఉండగా, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి 6.7 శాతంగా ఉండటం గమనార్హం.

**ముకేశ్ అంబానీ కూడా..**

భారత అపర కుబేరుడు ముకేశ్ అంబానీ సైతం రుణ భారాన్ని తగ్గించుకోవడంపై నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకున్నారు. 2021 మార్చి నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)కు రుణ విముక్తిని కల్పించాలన్న సంకల్పంతో ముకేశ్ అంబానీ వెళ్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చమురు వ్యాపారంలో కొంత వాటాను సౌదీ అరేబియా ప్రభుత్వ రంగ చమురు దిగ్గజం ఆరామ్కోకు అమ్మాలని చూస్తున్నారు. అంతేగాక రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్ వంటి సంస్థలను దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదు చేయాలనీ ప్రయత్నిస్తున్నారు. దీని ద్వారా వచ్చే సొమ్ముతో అప్పులను చెల్లించాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుకుంటున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి సంస్థ రుణ భారం రూ.2.9 లక్షల కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ సుమారు రూ.10 లక్షల కోట్లుగా ఉన్న విషయం తెలిసిందే.



## 2021పైనే ఆశ

### దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్‌పై ఆడీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** ప్రస్తుత సంవత్సరం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న దేశీయ విలాసవంత కార్ల మార్కెట్‌కు.. వచ్చే ఏడాదిలోనూ నిరాశ తప్పదని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2020లో నిలకడైన వృద్ధిని నమోదవనుండగా, 2021లో మాత్రం కాస్త వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా హెడ్ బాల్బిర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరిలో ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ మోడల్ క్యూ8ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్న ఆడీ.. ఆ మరుసటి నెలలో ఏ8 సెడాన్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ రెండు కార్లు బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించింది సంస్థ. దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్లో ప్రస్తుతం మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ, జేఎల్ఆర్, వోల్వోలు ఉన్నాయి. 2018లో ఈ ఐదు సంస్థలు కలిపి 40,340 యూనిట్లు విక్రయించగా, 2019లో పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ ఏడాది ఆటోమొబైల్ రంగ సంస్థలు సవాళ్లను ఎదుర్కొన్నాయని, నూతన కార్ల విక్రయల్లో తీవ్ర ఒత్తిడికి గురైనట్లు ఆయన చెప్పారు.

# రికార్డుల బ్లాక్‌బస్టర్!

### చారిత్రక గరిష్ఠ స్థాయికి స్టాక్ మార్కెట్లు
### 2019లో సెన్సెక్స్ 15, నిఫ్టీ 13 శాతం లాభం







**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** స్టాక్ మార్కెట్లకు 2019 ఏడాది లాభాల నామ సంవత్సరంగా నిలిచిపోయింది. బుల్ పరుగు పందెంలో గత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన సూచీలు ఈ ఏడాది మరో చరిత్రను సృష్టించాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడం, అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం తీవ్రతరం, ఉగ్రదాడులు జరిగినప్పటికీ మార్కెట్లు మాత్రం వాయువేగంతో దూసుకుపోయాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలో 2019ని సువర్ణాక్షరాలతో లిఖించింది. ఈ ఏడాదిలోనే బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారిగా 40,000 మార్క్‌ను దాటగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 12,000 దాటి మరో చరిత్రను లిఖించింది. మధ్య, చిన్న స్థాయి స్టాకులు నిరాశాజనక పనితీరు కనబరిచినప్పటికీ మదుపరులు బ్లూచిప్ సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది 36,254.57 పాయింట్ల వద్ద ప్రారంభమైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ.. కేవలం నాలుగు నెలల్లోనే 39 వేల మార్క్‌ను ఏప్రిల్ 2న చేరుకున్నది. పార్లమెంట్‌కు తొలి విడుత జరిగిన ఎన్నికల నాటికి 39 వేల స్థాయికి చేరుకున్న సూచీలు..నరేంద్ర మోదీ సర్కార్ రెండో విడుత అధికారం చేజిక్కించుకున్న నాటి నుంచి ఆకాశమే హద్దుగా దూసుకుపోయింది. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మే 23న పెట్టుబడిదారులు ప్రాఫిట్ బుకింగ్‌కు పాల్పడినప్పటికీ ఆ తర్వాత రోజుల్లో భారీగా నిధులు కుమ్మరించారు. దీంతో జూన్ 2న తొలిసారిగా 40 వేల మార్క్‌ను దాటింది. నిఫ్టీ కూడా 12 వేల దాటి ముగిసింది. ప్రస్తుత సంవత్సరంలో స్టాక్ మార్కెట్లో జరిగిన అంశాలు క్లుప్తంగా...

- ☛ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ స్టాక్ మార్కెట్లలో ప్రకంపనాలు సృష్టించింది.
- ☛ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐఎస్), సంపన్న వర్గాలు, పబ్లిక్ షేరు హోల్డింగ్‌లపై సర్చార్జి విధిస్తున్న ప్రకటించడంతో మార్కెట్లు కుప్పకూలాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు 400 పాయింట్లకు పైగా, ఆ మరుసటి రోజు ఏకంగా 793 పాయింట్లు కోల్పోయింది. 2019లో ఒక రోజులో ఇంతటిస్థాయిలో పతనమవడం ఇదే తొలిసారి.
- ☛ ఎఫ్‌పీఐలు ప్యానిక్ బటన్ నొక్కడంతో జూలై నెలలో ఏకంగా రూ.12,500 కోట్ల పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు.
- ☛ వ్యాపారవర్గాలు, ఎఫ్‌పీఐల నుంచి వచ్చిన ఒత్తిడి నేపథ్యంలో కేంద్రం వెంటనే విధించిన సర్చార్జీని ఉపసంహరించుకుంటున్నట్లు ఆ తర్వాత ప్రకటించింది.
- ☛ కార్పొరేట్ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేట్ ట్యాక్స్‌ను పది శాతం వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి.
- ☛ సెప్టెంబర్ 20న ఏకంగా 1,921 పాయింట్లు లాభపడింది. గత పదేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి.
- ☛ కొనుగోళ్లతో కళకళలాడిన దలాల్ స్ట్రీట్ నవంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 41 వేల పాయింట్ల మార్క్‌ను అధిగమించింది.
- ☛ డిసెంబర్ 27తో ముగిసిన ఏడాదికాలంలో సెన్సెక్స్ 15.26 శాతం, నిఫ్టీ 12.73 శాతం చొప్పున లాభపడ్డాయి.
- ☛ మాంద్యం గుప్పిట్లో అంతర్జాతీయ దేశాలు జారుకుంటున్నట్లు వచ్చిన సంకేతాలు మార్కెట్ల భారీ ర్యాలీకి బ్రేక్‌వేశాయి.
- ☛ ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధికి ఊతమివ్వడానికి రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను 135 బేసిస్ పాయింట్లు తగ్గించింది.
- ☛ దేశీయ ఈక్విటీలపై నమ్మకాన్ని వ్యక్తంచేసిన ఎఫ్‌పీఐలు ఈ ఏడాది రూ.97,250 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. గడిచిన ఆరేండ్లలో ఇదే గరిష్ఠం.

**2020పై గంపెడు ఆశలు..**

**2019లో** రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న స్టాక్ మార్కెట్లు నూతన సంవత్సరంపై గంపెడు ఆశలు పెట్టుకున్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరిస్తుండటం, కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు మొగ్గుచూపిస్తే రికార్డుల మీద రికార్డుల బద్దలు కొట్టే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ల ఆశాజనక ఫలితాలు, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయితే 45 వేల పాయింట్లకు చేరుకున్న ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

**ఆర్థిక గణాంకాలే కీలకం**

గతవారంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారంలోనూ కోలుకునే అవకాశాలు కనిపించడం లేదని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటం, మరోవైపు ఈవారంలోనే 8 కీలక రంగాల గణాంకాలు విడుదలకానుండటం, గత నెలకుగాను ఆటోమొబైల్ సంస్థలు తమ విక్రయాలను ప్రకటించడం కూడా మార్కెట్లపై తీవ్రంగా ప్రభావం చూపే అంశాలని పేర్కొన్నాయి. బుధవారం డిసెంబర్‌కుగాను ఆటోమొబైల్ కంపెనీల తమ విక్రయాలను ప్రకటించనుండటంతో ఈ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావచ్చునని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ హెడ్ దీపక్ జసాని తెలిపారు. అలాగే నవంబర్ నెలకుగాను కీలక రంగాల పనితీరు, పీఎంఐ తయారీ సూచీ మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నదన్నారు.



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మొక్క నాటుతున్న కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ

## నిరాటంకంగా గ్రీన్ చాలెంజ్

- ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపునకు భారీ స్పందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రీన్‌చాలెంజ్ కార్యక్రమం నిరాటంకంగా సాగుతున్నది. ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపునకు భారీ స్పందన లభిస్తున్నది. వెండితెర, బుల్లితెర నటులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటూ తమవంతుగా మూడుమొక్కలు నాటుతున్నారు. గ్రీన్‌చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటిన వారికి ఎంపీ సంతోష్‌కుమార్ ప్రతిరోజు ట్విట్టర్, ఇతర ప్రచార మాధ్యమాల్లో ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఆదివారం ఎంపీ సంతోషకుమార్ గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ కలక్టర్ బంగ్లా ఆవరణలో మొక్కలు నాటారు. జబర్దస్త్ ఆర్టిస్టులు గెటప్ శ్రీను, ఆటో రామ్‌ప్రసాద్ తమ ఇండ్ల ఆవరణల్లో మొక్కలు నాటారు.



హైదరాబాద్‌లోని తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుతున్న కమెడియన్లు గెటప్‌శీను, ఆటో రామ్‌ప్రసాద్

## హక్కుల పరిరక్షణలో తెలంగాణ టాప్

- హెచ్చార్సీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య

**బేగంపేట:** మానవహక్కుల పరిరక్షణలో తెలంగాణ ఎంతో ముందంజలో ఉన్నదని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ (హెచ్చార్సీ) చైర్మన్ జస్టిస్ జీ చంద్రయ్య అన్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో గుర్తింపు పొందిన వృద్ధులకు ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ సన్‌షైన్ ఆసుపత్రిలోని శాంతా ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించేందుకు తెలంగాణ యువత కృషిచేయాలన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతుందని చెప్పారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు జస్టిస్ చంద్రయ్యను సత్కరించారు. సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పీఎస్ నారాయణ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ మందాడి కృష్ణారెడ్డి, ఆవులప్ప, వేముల గౌరీశంకర్ పాల్గొన్నారు.




'ఎల్డర్స్ ప్రైడ్ సెలబ్రేషన్' కార్యక్రమంలో హెచ్చార్సీ చైర్మన్ జస్టిస్ జీ చంద్రయ్యను సన్మానిస్తున్న ఎల్డర్స్ క్లబ్ ప్రతినిధులు

# మేలిమి బంగారం తుకారాం!

- పర్వతారోహకుడు నాయక్‌ను ప్రశంసించిన అహోబిలం రామానుజ జీయర్‌స్వామి
- మౌంట్ అకాన్గువా సాహసయాత్రకు వికాసతరంగిణి పక్షాన రూ.6 లక్షల సాయం



తుకారం యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అహోబిలం రామానుజ జీయర్‌స్వామి, తేజావత్ రామచంద్రునాయక్

**ఖైరతాబాద్:** పర్వతశిఖరాలను తపస్విలా అధిరోహిస్తున్న తెలంగాణ మేలిమి బంగారం తుకారాంనాయక్ సంకల్పాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని చినజీయర్‌స్వామి శిష్యులు శ్రీత్రిదండి అహోబిలం రామానుజ జీయరుస్వామి పేర్కొన్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తుకారాం సాహసయాత్రలో భాగంగా 2020 జనవరి 5న దక్షిణ అమెరికాలోని మౌంట్ అకాన్గువాను అధిరోహించే యాత్రకు ఆశీస్సులు అందిస్తూ, రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జీయరుస్వామి యాత్ర విశేషాలను మీడియాకు తెలిపారు. జనవరి 5న యాత్ర ప్రారంభించి, 26న గణతంత్ర దినోత్సవంనాడు శిఖరంపై తివర్ణపతాకాన్ని ఎగురవేస్తారని చెప్పారు. ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రామచంద్రునాయక్‌తో కలిసి యా త్ర విశేషాల కరపత్రాలను ఆవిష్కరించారు.

## ఆకట్టుకున్న 'శ్రీకృష్ణార్జున విలాసం'



ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పైడి జయరాజు ప్రివ్యూథియేటర్‌లో జనతా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీకృష్ణార్జున విలాసం (సుభద్రార్జున కల్యాణ కథాంశం)' పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది. నమస్తే తెలంగాణ కుటుంబసభ్యుల కోసం ఈ నాటకాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. వరకవుల నరహరి రాజు రచన, సంగీతం, దర్శకత్వం అందించారు. నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్టు డీవీఎస్ రాజు శ్రీకృష్ణుడిగా, మార్కండేయరాజు అర్జునుడిగా, జీ మాధురి సుభద్రగా, ఇందిర సత్యభామగా, టీ కీర్తి రుక్మిణిగా పాత్రలను పోషించారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ , భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, హెచ్ఎండీఏ కార్యదర్శి రాంకిషన్, నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్టులు మ్యాడం మధు, కోటిరెడ్డి, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. - రవీంద్రభారతి

# పాపారావుకు 'ఆటా' ఎక్సలెన్సీ అవార్డు



ఉప రవాణా కమిషనర్ కే పాపారావుకు ఆటా ఎక్సలెన్సీ అవార్డును అందజేస్తున్న ఆర్అండ్ బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోడ్డు భద్రత రంగంలో ప్రజలకు విశేష సేవలందిస్తున్న తెలంగాణ మోటర్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, ఉప రవాణా కమిషనర్ (వీఅండ్ఈ, ఐటీ) కే పాపారావును అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ఆర్అండ్‌బీశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆయనకు ఈ అవార్డును ప్రదానంచేసింది. ఏటా వివిధ రంగాల్లో ఎనలేని సేవలందిస్తున్న ప్రముఖలను సత్కరిస్తున్న 'ఆటా'.. ఈ ఏడాది పాపారావును ఎక్సలెన్సీ అవార్డుతో సన్మానించింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, 'ఆటా' ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా సేవ చేయండి

- అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగించవద్దు
- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మంచి మనసుతో చేసే ఏ పనైనా దేశసేవ కిందికే వస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ (ఆరెస్సెస్) సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. సేవచేసేది ఎవరైనా, ఎలాంటిదైనా నిస్వార్థంగాచేయాలని సూచించారు. హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌లోని శారదాధామంలో ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యాభారతి పాఠశాలల్లో విద్యార్థులకు సంస్కారం నేర్పిస్తారని, బహుశా అది రక్తసంబంధంలో కూడా ఉండకపోవచ్చని అన్నారు. వ్యక్తికి ఎప్పుడూ నేనొక్కడినే అనే భావన కలుగకూడదని, ఆవిధంగా విద్యాభారతి విద్యార్థుల లక్ష్యం ఉండాలని సూచించారు. విద్యావిధానం వ్యక్తిగత జీవనవిధానానికి మార్గనిర్దేశం చేస్తుందని, ఆత్మవిశ్వాసం కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో సిద్ధాంతపరమైన సంఘర్షణ జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్, విద్యాభారతి అఖిల భారత అధ్యక్షుడు దూశీ రామకృష్ణారావు, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఆరెస్సెస్ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మోహన్ భాగవత్

## విభజించి పాలించే కుట్రలో భాగమే సీఏఏ

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**సుల్తాన్‌బజార్:** హిందూ-ముస్లింలను విభజించి పాలించే కుట్రలో భాగమే సీఏఏ అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని మీడియా ప్లస్‌లో 70 సంఘాల నాయకులతో కూటమిని ఏర్పాటుచేశారు. దీనికి కన్వీనర్‌గా ఉన్న విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, కో కన్వీనర్లుగా జమాతే ఇస్లామీ హింద్ కార్యదర్శి సాదిక్ అహ్మద్, సామాజిక కార్యకర్త విమల, పౌరహక్కుల కార్యకర్త జీవన్‌కుమార్‌లతో కలిసి సీఏఏ, ఎన్నార్సీ రద్దుపై పోరాటానికి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయమూర్తి మాట్లాడుతూ.. హిందూ-ముస్లింలు గంగాజమునా తెహజీబ్‌లా కలిసి జీవనం సాగిస్తున్నారని, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సీఏఏ చట్టాన్ని తెచ్చిందని దుయ్యబట్టారు. ఇది అందరి సమస్య అని, ఎలాంటి హింసకు తావులేకుండా రద్దుకు పోరాటంచేస్తామని తెలిపారు.

## అదృశ్యాలపై నివేదిక ఇవ్వండి

- హెచ్చార్సీ సుమోటోగా విచారణ

**సుల్తాన్‌బజార్:** హైదరాబాద్‌లో చోటుచేసుకుంటున్న అదృశ్యాలను హెచ్చార్సీ సు మోటోగా స్వీకరించింది. నగరంలో ఒకే రోజు 13 మంది అదృశ్యమయ్యారంటూ పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పం దించింది. అదృశ్యాలపై తీసుకుంటున్న చర్యలపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించింది.

# టీఆర్ఎస్ విజయానికి కృషిచేయాలి

- టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కార్మికవిభాగం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీఆర్ఎస్కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్కేవీ అనుబంధకార్మికసంఘాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. వేతనాలు పెంచడమే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ కార్యదర్శి రూప్‌సింగ్, టీఆర్ఎస్కేవీ ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేను హిందువును కాదు.. మనిషిని

- ఆరెస్సెస్ చీఫ్‌కు పీకాక్ క్లాసిక్స్ సంపాదకుడు గాంధీ బహిరంగ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారతీయులందరూ హిందువులేనన్న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలను తనతోపాటు ఎంతో మంది వ్యతిరేకిస్తున్నారని పీకాక్ క్లాసిక్స్ సంపాదకుడు ఏ గాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆరెస్సెస్ చీఫ్‌కు బహిరంగలేఖ రాశారు. 'భాగవత్ గారూ.. నేను భారతీయుడిని. నాకు మీరిచ్చే హిందూ సర్టిఫికేట్ అక్కర్లేదండీ. హిందూ అలంకారాలూ, ఆచ్ఛాదనలూ నాకు వద్దండి. అవేవీలేకుండానే నేను ఈ దేశ పౌరుడిని సార్. ఇంకొక్క మాట. మీరు గిల్లి జోలపాడుతున్నారండి. మీ జోలపాటలు మాకు వద్దండి. నేను హిందువుగా ఉంటే మీ చేష్టలకు సిగ్గుపడక తప్పదు. సిగ్గు అంటే కోపం. తన మీద తనకి వచ్చే కోపమే సిగ్గు.' అని లేఖలో పేర్కొన్నారు.

## రెవెన్యూ చట్టాలపై రైతులకు ఉచితశిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెవెన్యూచట్టాలపై రైతులకు సమగ్ర అవగాహన కలిగించడానికి వారికి ఉచితంగా శిక్షణఇస్తామని తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక ఎడిటర్, తెలంగాణ తాసిల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, సెయిల్స్ సంస్థ వ్యవస్థాపకుడు, భూచట్టాల నిపుణుడు ఎం సునీల్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలోని 12వేల గ్రామపంచాయతీలలో ఒక్కోగ్రామానికి ఐదుగురు చొప్పున త్వరలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆదివారం ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో తెలంగాణ రెవెన్యూ మాసపత్రిక, తెలంగాణ తాసిల్దార్ల సంఘం డైరీ, క్యాలెండర్లను రైతులతో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూచట్టాలపై ప్రజల్లో అవగాహన ఉంటే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకోసం ఇప్పటికే తెలంగాణ రెవెన్యూమాస పత్రిక కృషిచేస్తున్నదని చెప్పారు. ఎం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రైతుల మధ్య, రైతులచే రెవెన్యూ ఉద్యోగుల క్యాలెండర్, డైరీని ఆవిష్కరించాలనుకోవడం మంచి ఆలోచన అన్నారు. కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ జీబీరెడ్డి, తాసిల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షుడు సంపత్‌కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 30 డిసెంబర్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi

# చిన్నారుల భవిష్యత్తుకు బాటలు



**పిల్లలు చదువు కంటే ఎక్కువ ఆటల వైపే మొగ్గు చూపుతుంటారు. అటువంటి వారికి ఆటా పాటలతో పాఠాలు బోధించే వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టింది ఓ మహిళ . చిన్నారుల అభిరుచికి తగినట్లుగా సరికొత్త విద్యావిధానాలతో చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నది.**

కొందరు తల్లులు తమ పిల్లలు సరిగా మాటవినక ఎన్నో పాట్లు పడుతుంటారు. ఈ తల్లి కూడా అందరి లాగే అటువంటి బాధలెన్నో పడింది. తన కుమార్తెలో మార్పు తీసుకు వచ్చేందుకు చేసిన ఆ తల్లి ఆలోచన ఎంతోమంది చిన్నారుల బంగారు భవితకు మార్గం చూపిస్తున్నది. ముంబైలోని మల్టీనేషనల్ అడ్వర్టైజ్‌మెంట్ సంస్థలో శీతల్ పరేఖ్ క్రియేటివ్ డైరెక్టర్‌గా పదేండ్ల పాటు పని చేసింది. వైద్యుల కుటుంబంలో పుట్టిన శీతల్ డిగ్రీలో బయో కెమిస్ట్రీ చదివింది. ఆ తర్వాత కొలంబియా యూనివర్సిటీ నుంచి క్రియేటివ్ రైటింగ్‌లో డిప్లొమో కోర్సు చేసింది. శీతల్‌కు పెండ్లైన తర్వాత కొన్నాళ్లకు పాప పుట్టింది. ఆ చిన్నారి చదువంటే ఎంతో భయపడేది. దీంతో తల్లి ఆ పాపలో భయాన్ని పోగొట్టేందుకు పలురకాల ఆటవస్తువులు కొనిచ్చింది. అదే సమయంలో ఆమె స్నేహితురాలు బాబ్రీదేవి తన పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యను శీతల్‌కు వివరించింది. పిల్లల అభిరుచికి తగిన విధంగా విద్యా విధానాలుంటే ఇటువంటి సమస్య చిన్నారుల్లో తలెత్తేది కాదని శీతల్ గ్రహించింది. శీతల్ నేడు అందుబాటులో ఉన్న పలు విద్యా విధానాలను గురించి అధ్యయనం చేసింది. అవేమీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. మరికొంతమంది చిన్నారుల తల్లిదండ్రులకు తెలిసేలా శీతల్ ఆలోచనను సోషల్ మీడియా ద్వారా వారితో పంచుకున్నది. వారంతా ఆమె ఐడియాను సమర్థించారు. వారి అభిప్రాయాలను సేకరించిన శీతల్ సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథ్స్(స్టెమ్) విధానంలో ఓ ప్రణాళిక రూపొందించింది. 'ద ప్రెటీ –గీకీ' పేరుతో స్టార్టప్‌ను ప్రారంభించింది. చిన్నారుల భవిష్యత్‌కు ఎటువంటి అంశాలు ఉపయోగపడతాయనే దానిని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో వారికి పనికొచ్చే సిలబస్‌తోపాటు అందుకు సంబంధించిన వస్తువులను రూపొందించింది. నాలుగేండ్ల నుంచి పదకొండేండ్ల వయసుకలిగిన చిన్నారులకు కార్డ్ గేమ్స్, బోధనా విధానాలను అందిస్తున్నది. రేపటి భవిష్యత్ అంతా సైన్సు, సాంకతికపరిజ్ఞానంతోనే ముడిపడి ఉన్నది. ఇటువంటి పాఠాలే పిల్లల అభ్యున్నతికి ఉపయోగపడుతాయని ' శీతల్ అంటున్నది. నాలుగు ఇంటర్నేషనల్ స్కూళ్లతోపాటు పూణె ముంబై, నాసిక్, గోవాలోని పలు పాఠశాలలు ఆమె రూపొందించిన విద్యా విధానాలనే అనుసరిస్తునాయి.

# చర్మాన్ని మెరిపించే ఆలు!



**ఆలు వంటల్లో వాడుతుంటాం. దానివల్ల ఆరోగ్య ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. అంతకంటే ఎక్కువగా చర్మసంరక్షణకు, కురుల సంరక్షణకు ఆలు పనిచేస్తుంది. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే ఆలు చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. అదెలాగంటే..**

- ఆలు తురుమును పిండితే వచ్చిన రసాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో గుడ్డు సొన, పెరుగు వేసి బాగా కలపాలి. ఈ ప్యాక్‌ను కుదుళ్ల నుంచి జుట్టంతా పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగి షాంపూతో తలస్నానం చేయాలి. ఇరవై రోజులకోసారి ఇలా చేస్తే ఆరోగ్యవంతమైన మెరిసే జుట్టు మీ సొంతమవుతుంది.
- ఒక గిన్నెలో నీళ్లు పోసి వేడిచేయాలి. అవి ఉడుకు పట్టగానే బంగాళాదుంప పొట్టు వేసి ఇరవై నిమిషాలు ఉడికించాలి. ఆ నీటిని వడకట్టాలి. షాంపూతో తలస్నానం చేశాక వడకట్టిన నీళ్లతో జుట్టును కడగాలి. ఇది జుట్టుకు సహజమైన నలుపు రంగునిస్తుంది. వారంలో ఒక్కసారైనా ఇలా చేస్తే జుట్టు తెల్లబడే సమస్య నుంచి బయటపడొచ్చు.
- బంగాళదుంప, కలబంద రసాలను సమానంగా తీసుకొని 21 టీ స్పూన్ల తేనెను తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ గిన్నెలో వేసి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి జుట్టు అంతటా పట్టించి రెండు గంటలు ఉంచుకోవాలి. ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- మెడ తెల్లగా కావాలంటే ఒక స్పూన్ గంధంలో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి ఆ మిశ్రమాన్ని రాత్రివేళ మెడకు రాసుకుని ఉదయాన్నే కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మెడ తెల్లగా మారుతుంది. నిమ్మరసంలో కొద్దిగా పసుపు కలిపి పెట్టుకున్నా మెడ తెల్లగా కనిపిస్తుంది. ఆలుగడ్డను ముక్కలుగా కోసుకొని రెండు వారాలకోసారి మెడ మీద రుద్దుకుంటే నెల రోజుల్లో తేడాను గమనించవచ్చు.
- ఒక ఆలుగడ్డను మెత్తగా అయ్యేవరకు గ్రైండ్ చేయాలి. అందులో రెండు స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు స్పూన్లు తేనె, రెండు స్పూన్లు పాలు తీసుకోవాలి. ఆ మొత్తాన్ని కలిపి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో 2 లేదా మూడు సార్లు చేతులకు రాసుకొని 15 నిమిషాల పాటు ఉంచాలి. తర్వాత సబ్బుతో కడిగేసుకుంటే చేతులు మృదువుగా మారుతాయి.

# 'ఐవీఎఫ్' విధానంతో అమ్మతనం




**పిల్లలు కావాలని చాలా మంది ఆరాటపడతారు. అందుకోసం ఎదురు చూస్తారు. వివాహం అయిన వెంటనే తమ ఇంట్లో చిన్నారులు ఆటలాడాలని కోరుకుంటారు. మరి ఒంటరి మహిళల పరిస్థితి ఏంటి. వారు కూడా పిల్లల్ని కంటున్నారు. అదేలా అంటే ఐవీఎఫ్ పద్ధతితో బ్రిటన్‌లో ఇదొక ట్రెండ్‌గా మారింది.**

ఇటీవల కాలంలో చాలామంది ఒంటరి మహిళలు తల్లి కావాలనే తమ కోరికను నిజం చేసుకుంటున్నారు. ఇందుకు ఐవీఎఫ్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటికే ఈ సంస్కృతి బ్రిటన్‌లో విస్తరిస్తున్నది. యూకేకు చెందిన హ్యూమన్ ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబ్రియాలజీ అథారిటీ లెక్కల ప్రకారం.. ఐవీఎఫ్ ద్వారా తల్లులుగా మారుతున్న మహిళల సంఖ్య 2014 నుంచి 35 శాతం మేర పెరిగింది. దీనికి కారణం ప్రతీ ఒక్కరికీ ఈ విషయంలో అవగాహన పెరగడం, తమకు నచ్చని భాగస్వామితో పిల్లల్ని కనడం ఇష్టం లేని వారు ఈ పద్ధతిని ఆశ్రయిస్తున్నారు. ఐవీఎఫ్ అనేది అంత సులభం ఏమీ కాదు. ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ. పూర్తవడానికి దాదాపు 15 రోజులైనా పడుతుంది. ఇంత సమయం తీసుకున్నా.. ఇది కచ్చితంగా సక్సెస్ అవుతుందని చెప్పడం కష్టం. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఐవీఎఫ్ చేయించుకున్నవారి శరీరతత్వం ట్రీట్‌మెంట్‌కి సహకరిస్తుందా? లేదా? అన్నది కూడా సక్సెస్ రేటుపై ఆధారపడి ఉంటుంది. అంతేకాదు ఖర్చుతో కూడుకున్న పని. భారత్‌లో ఈ సంస్కృతి విస్తరించడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులు ఐవీఎఫ్‌ని ఎంచుకునేందుకు కారణాలుగా మారుతున్నాయి. గతేడాది మోదీ ప్రభుత్వం ఓ బిల్లును ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఒంటరి వ్యక్తులు సరోగసి ద్వారా పిల్లల్ని కనడానికి వీల్లేదు. భారతీయ చట్టం ప్రకారం వివాహం చేసుకున్న వాళ్లు ఈ చికిత్సను ఎంచుకోవచ్చు. భారత్‌కు చెందిన కొందరు సెలబ్రిటీలు ఇప్పటికే ఈ విధానంతో పిల్లల్ని కన్నారు. సినీ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తులు తాము సరోగసీతో పిల్లల్ని కన్నట్లుగా అంగీకరించారు కూడా. అందులో మంచు లక్ష్మి, కరణ్ జోహార్, తుషార్ కపూర్ వంటి సినీ ప్రముఖులు ఉన్నారు.




## ప్లాస్టిక్ రహిత సమాజానికో ఎంట్రీ అంటున్న

# లక్ష్మీమీనన్





**మనసుంటే మార్గం ఉంటుందంటారు. రోజు రోజుకీ విపరీతంగా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం వల్ల మన పర్యావరణానికి ఎలాంటి హాని కలుగుతుందో అందరికీ తెలిసిందే. పర్యావరణం చెడిపోతున్నదని బాధపడుతూ కూర్చోకుండా చేతనైనంత చేయాలని అనుకుంటే ఏదో ఒక మంచి ఆలోచన రాకపోదు. ఒక మహిళకు మెరిసిన ఆలోచన అటు వాతావరణానికి, ఇటు ప్రజలకు ఉపయోగపడుతున్నది. ఆమె లక్ష్మీమీనన్. ఆమె కాగితాలతో పెన్నులు తయారు చేసి, వాటిలో విత్తనాలను వేసి వాడిన తర్వాత మొలకెత్తేలా కొత్త తరహా పెన్నులను రూపొందించింది. మరోవైపు దక్షిణ కేరళలో 'ప్యూర్ లివింగ్' అనే సంస్థనూ నడుపుతూ ఎంతోమంది మహిళలకు జీవనోపాధి అవకాశాలను కల్పిస్తున్న లక్ష్మీ మీనన్ సక్సెస్‌మంత్ర.**

ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు ఎంతగా అవేర్‌నెస్ కల్పించినప్పటికీ మనం నిత్యం అనేక వస్తువుల రూపంలో ప్లాస్టిక్‌ను వాడుతూనే ఉన్నాం. అందుకు స్టేషనరీ ఐటమ్స్ అయిన పెన్నులు కూడా మినహాయింపు కాదు. రోజుకు కొన్ని వందల కోట్ల సంఖ్యలో పెన్నులను వాడుతుంటారు. అవన్నీ ప్లాస్టిక్‌తో తయారైనవే. ఒకప్పుడు రీఫిల్ అయిపోతే కొత్త రీఫిల్ కొనుక్కుని వేసుకునేవారు. కానీ ఇప్పుడు పెన్ను పారేసి కొత్తది కొంటున్నారు. దీంతో వాటి ద్వారా భూమిలో కలిసే ప్లాస్టిక్ ఎక్కువైపోతున్నది. అయితే దీన్ని తగ్గించడం కోసమే కేరళకు చెందిన లక్ష్మీ మీనన్ నడుం బిగించింది.

### ఒక్క ఆలోచన

మనలో చాలామంది బాల్ పాయింట్ పెన్నుల్ని వాడుతుంటారు. వాటిలో రీఫిల్ అయిపోతే తిరిగి రీఫిల్ వేసి మళ్లీ మళ్లీ వాడుకోవచ్చని అనుకుంటారు. కానీ ఆ పెన్ జేబులోనో, ఇంట్లోనో చాలాకాలం అలాగే ఉండిపోతుంది. ఆ తర్వాత కొత్త పెన్ను జేబులోకి చేరుతుంది. తిరిగి ఆ పెన్ను రాయడం ఆగిపోగానే చెత్త బుట్టలోకి విసిరేస్తారు. మనం ఇప్పుడు వాడుతున్నవన్నీ ప్లాస్టిక్ పెన్నులే. వాటన్నింటినీ మనం చెత్తపాలు చేసి చేతులు దులుపుకుంటున్నాము. కానీ అవి ఏమవుతున్నాయి? మట్టిలో కలవడానికి ఎన్నేండ్లు పడుతుంది. దానివల్ల నష్టం ఏంటీ? అన్నవి మనం ఏమాత్రం ఆలోచించం. కానీ ఈ అంశమే లక్ష్మీ మీనన్‌ను ఆలోచనలో పడేసింది. 'లివింగ్ ప్యూర్' అనే సంస్థను ప్రారంభించి పర్యావరణానికి హాని చేయకుండా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి దాని స్థానంలో నూతనంగా ఏం వాడితే బాగుంటుందో చేసి చూపింది.

### కాగితపు పెన్నులు

లక్ష్మీ మంచి ఆలోచనాపరురాలు. ప్రతిదాన్ని సృజనాత్మక ధోరణిలో ఆలోచిస్తుంది. దానికోసమే ఓ కొత్త ప్రయోగం చేసింది.అదే ఆమెకు ఓ చక్కటి పరిష్కారం చూపింది. చెత్త కాగితాల గుజ్జుతో దృఢమైన పెన్నులను తయారుచేయడం తెలుసుకుంది. ప్రింటింగ్ ప్రెస్సులో వృథా అయిన కాగితాల్ని, దినపత్రికల ప్రతుల్ని, చెత్త కాగితాల్ని వినియోగించుకుంటే కొత్త కాగితం కొనాల్సిన అవసరం ఉండదు. మరో చెట్టు నేల కూలదు. కాగితాన్ని పెన్నులా చుట్టచుట్టే ఓ యంత్రాన్ని కూడా ఆమె స్వయంగా రూపొందించింది. దానిపై పేటెంట్ కూడా పొందింది. దాని చివరన ఓ విత్తు ఉండేలా డిజైన్ చేసింది. కాగితపు కలాల్లో విత్తనాలను వేసి వాడి పారేసిన తర్వాత అవి చెట్లలా మొలకెత్తేలా వినూత్నమైన ఆలోచన చేసింది లక్ష్మీ మీనన్.దానికోసం అగస్త్య వృక్షం విత్తనాల్నే ఎంచుకుంది. కలంలో సిరా అయిపోగానే, దానిని నేలలో పాతితే అందులో పెట్టిన విత్తనం మొలకెత్తి మొక్క వస్తుంది. ఆ విధంగా మొలకెత్తించడానికి అవకాశం లేకపోయినపుడు, ఆ కలాన్ని పారేసినా ఎక్కడో ఒక చోట తప్పనిసరిగా అందులోని విత్తనం మొలకెత్తుతుంది.



### అగస్త్య విత్తనాలే ఎందుకంటే?

వాడేసిన పెన్నుల్లో అగస్త్య విత్తనాలను వాడుతున్నది లక్ష్మీ. ఈ వృక్షాన్ని హమ్మింగ్ బర్డ్ చెట్టుగా కూడా పిలుస్తారు. చాలామంది వీటిని అగిసె చెట్లని అంటారు. ఈ చెట్టు పూలు, ఫలాలు, కాండం, బెరడు చివరకు ఆకులను కూడా అనేక రకాలుగా ఉపయోగిస్తారు. చెట్టంతా ఎర్రటి పూలను వికసించే అగిసె చెట్లు సిద్ధ, ఆయుర్వేద వైద్యాలకే కాక వంటింటికి కూడా బాగా ఉపయోగిస్తారు.వీటిని కేరళ, కర్నాటక , రాయల సీమల్లో కొబ్బరితో కలిపి వంటకాలు చేస్తారు. థాయిల్యాండ్, శ్రీలంక, మలేషియాల్లోనూ వంటకాల్లో వాడుతారు. ఈ వృక్షాలు చాలా వేగంగా పెరుగుతాయి. అందుకే లక్ష్మి వాటి విత్తుల్నే కలాల్లో ఉంచుతున్నది. పెన్ను పోయినా, వాడి పారేసినా నేలలోకి చేరితే కాగితం త్వరగా మట్టిలో కలిసిపోతుంది. ఈలోగా విత్తు లోతులోకి వెళుతుంది. వర్షాకాలంలో గానీ లేదా నీటి లభ్యత వల్ల గానీ అవి మొలకెత్తుతాయి. ముందే ఆ పెన్నులు గురించి తెలిసిన వారైతే కుండీల్లో వాటిని నాటితే సరి. పర్యావరణ హిత కార్యక్రమంలోకి వాళ్లు ఎంట్రీ అయిపోయినట్టే. అందుకే ఆ కలాలకు 'ఎంట్రీ' అని పేరు కూడా పెట్టింది.

### మహిళలకూ ఉపాధి

ఈ పెన్నుల తయారీలో పేద, బడుగు వర్గాలవారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు లక్ష్మి. ముఖ్యంగా మహిళా గ్రూపులను ఎంచుకున్నది. మహిళా సాధికారత గురించి కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లక్ష్మి ఈ రకంగా వారికి చేయూతనిస్తున్నది. ముఖ్యంగా మహిళల్లో నడుం కింది భాగం పక్షవాతానికి గురైన వారికీ వీటి తయారీ తేలిగ్గా ఉండటాన్ని గమనించి వారిని ప్రోత్సహిస్తున్నది. దీంతో వారికీ ఉపాధి దొరికినట్లుంటుంది. ఇప్పుడిప్పుడే లక్ష్మి సదుద్దేశం గురించి తెలుసుకున్న కొన్ని సంస్థలు, కళాశాలలు ఈ పెన్నులు కొనేందుకు ముందుకు వస్తున్నాయి. ప్లాస్టిక్ పెన్నుల కాలుష్యం ప్రభావం గురించి అవగాహన కల్పించేందుకు స్థానిక పాఠశాలల్లో ఆమె అవగాహనా కార్యక్రమాలు కూడా చేపట్టింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితం రీసైక్లింగ్, వాతావరణ కాలుష్యం తగ్గడం, చెట్ల పెంపకం, మహిళా సాధికారత, ఉపాధి కల్పన వంటి మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని పలువురు ప్రశంసిస్తున్నారు. ఒక్కొక్క కలం రూ.12 చొప్పున అమ్ముతున్నారు. మంచి లక్ష్యం కోసం కొంత అదనంగా ఖర్చు చేయడానికి వెనుకాడనివారు లక్ష్మి ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్నారు.

# బిర్యానీ ఆకుతో ఆరోగ్యం!



**సువాసనను ఇచ్చేవాటిలో బిర్యానీ ఆకు కీలకమైంది. బిర్యానీలో తప్ప మిగతా వంటల్లో వాడని ఈ ఆకులో ఎన్నో ఆరోగ్య సుగుణాలున్నాయి. వాటిని రోజూ వంటల్లో వాడితే ఆరోగ్యానికి ఎలాంటి మంచి జరుగుతుందంటే..**

- బిర్యానీ ఆకులను రోజూ మనం తినే ఆహారంలో తీసుకుంటూ ఉండాలి. ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే 'ఇంటర్‌ల్యూకిన్' అనే ప్రొటీన్‌ను వ్యాధి నిరోధక వ్యవస్థ స్వల్ప పరిమాణాల్లో విడుదల చేస్తూ ఉంటుంది. బిర్యానీ ఆకు తరచుగా తీసుకుంటే ఈ ప్రొటీన్ విడుదల తగ్గుతుంది.
- చెడు కొలెస్ట్రాల్, చక్కెరలను తగ్గించి శరీరంలో మంచి కొలెస్ట్రాల్ తయారయ్యేలా బిర్యానీ ఆకు తోడ్పడుతుంది. తరచూ వంటకాల్లో బిర్యానీ ఆకును వాడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు, ప్రధానంగా 'కొలోరెక్టల్' క్యాన్సర్ ముప్పు తప్పుతుంది.
- నిద్రపోయే సమయంలో దిండు పక్కనే తువ్వాలు మీద రెండు చుక్కల బే లీఫ్ ఎసెన్షియల్ ఆయిల్ వేసి పడుకుంటే.. హాయిగా నిద్రపడుతుంది. ఉదయాన్నే కొత్త ఉత్సాహంతో నిద్ర లేస్తారు కూడా.
- బిర్యానీ ఆకుల పొడిని ఒక టీ స్పూన్ మోతాదులో తీసుకొని ఒక గ్లాస్ నీటిలో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు తాగితే రక్తంలో షుగర్ స్థాయిలు అదుపులోకి వస్తాయి. బిర్యానీ ఆకుల్లో మధుమేహాన్ని తగ్గించే గుణాలు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. టైప్–2 డయాబెటిస్ ఉన్న వారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది.
- సహజసిద్ధమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు బిర్యానీ ఆకులో ఉంటాయి. కొన్ని బిర్యానీ ఆకులు, ఆముదం చెట్టు ఆకులను తీసుకొని మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. నొప్పిగా ఉన్న చోట రాసి 20 నిమిషాలయ్యాక కడిగేయాలి. ఇలా వారం రోజులు చేస్తే నొప్పులు తగ్గుతాయి.

## సిరిముగ్గు

20 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు



**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం–10, హైదరాబాద్
–500034.
zindagi.nt@gmail.com



శాంతి నర్వా
సరూర్ నగర్,
హైదరాబాద్

నమస్తే తెలంగాణ

నిపుణ

[ కరీంనగర్ ]

సోమవారం 30 డిసెంబర్ 2019




**ప్రతిఏటా ఐక్యరాజ్యసమితి అనుబంధంగా ఉన్న యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఐక్యరాజ్యసమితి అభివృద్ధి పథకం (UNDP) హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్-HDI (మానవాభివృద్ధి సూచిక)ను ప్రచురిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాభివృద్ధి, దేశాల అభివృద్ధికి ఈ సూచీ కొలమానంగా నిలుస్తున్నది. ఉద్యోగం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి, పర్యావరణసుస్థిరత, సమాచారం వంటి అంశాల ఆధారంగా మానవాభివృద్ధి సూచీని తయారుచేస్తారు. పై అంశాల ఆధారంగా ఆయా దేశాలు సాధించిన ప్రగతిని పరిగణనలోకి తీసుకుంటారు. మానవాభివృద్ధి సూచిక ధ్యేయం పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ప్రాణి సమానం. ప్రస్తుత కాలంలో స్థూలజాతీయోత్పత్తికి ప్రత్యామ్నాయంగా మానవాభివృద్ధి సూచికను ఆధారం చేసుకొని ఒక దేశ ఆర్థికాభివృద్ధిని అంచనా వేస్తున్నారు. విద్య, ఆరోగ్యం, సగటు జీవితకాలం, శిశుమరణాలు, పేదరికం వంటి జీవన ప్రమాణాలు మానవాభివృద్ధి సూచిక రూపకల్పనకు ప్రతిపాదనలు. ఒక దేశం మానవాభివృద్ధిలో సాధించిన సగటు పురోభివృద్ధిని మానవాభివృద్ధి సూచిక తెలియజేస్తుంది. మొత్తం ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో 189 దేశాలను పరిగణనలోకి తీసుకుని స్పష్టమైన అంచనాలతో ఈ నివేదికను రూపొందించారు. ఈ ఏడాది ప్రచురించిన నివేదికలో ఆదాయం, సగటులు, వర్తమానం... 21వ శతాబ్దంలో మానవాభివృదిల్ధో అసమానతలు అనే ఇతివృత్తంతో రూపొందించి విడుదల చేశారు.**

# మానవ ప్రగతి సూచీ-2019

- 1975 నుంచి ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో మానవాభివృద్ధిని లెక్కిస్తుంది. 1990లో మొట్టమొదటి మానవాభివృద్ధి నివేదికను పాకిస్థాన్ ఆర్థికవేత్త మహబూబ్ ఉల్ హక్ రూపొందించిన HDI ఆధారంగా UNDPలో ప్రవేశపెట్టారు.
- ప్రజల ఎంపికలను విస్తృతం చేయడంతోపాటు, ప్రజాశ్రేయస్సును పెంపొందించే క్రమాన్ని మానవాభివృద్ధిగా మహబూబ్ ఉల్ హక్ పేర్కొన్నారు. ఈ HDI రూపకల్పనలో అర్థశాస్త్రంలో నోబెల్ ప్రైజ్ అందుకున్న అమర్త్యసేన్ భావాలు కూడా కనిపిస్తాయి.
- మానవాభివృద్ధి సూచిక మూడు రకాల మానవాభివృద్ధి సంబంధ ప్రాథమిక సగటు అంశాలను లెక్కిస్తుంది.
- దీర్ఘకాలిక ఆరోగ్యవంతమైన ఆయుర్ధాయాన్ని అంచనా వేస్తుంది.
- పరిజ్ఞానం, వయోజన విద్య ద్వారా 2/3వంతు భారత్వం ఇచ్చి అంచనా వేసి 1/3వంతు భారత్వం స్థూల విద్యార్థుల నిష్పత్తి ద్వారా లెక్కిస్తారు.
- ఉన్నత జీవన ప్రమాణాన్ని అమెరికా డాలర్లలో స్థూల దేశీయ తలసరి ఉత్పత్తి ద్వారా అంచనా వేస్తారు. దీన్ని పర్చేజింగ్ పవర్ పారిటీ (పీపీపీ) ఆధారంగా గణిస్తారు. పీపీపీనే అమెరికన్ డాలర్లలో కొనుగోలు శక్తి సమానత అంటారు.
- మానవాభివృద్ధి సూచికను లెక్కించే ముందు మూడు అంశాల్లో ప్రతిదానికి ఒక దిశను నిర్ణయించి ప్రతి సూచికకు కనిష్ట గరిష్ట విలువలు లెక్కిస్తారు.
- ప్రతి అంశం ప్రదర్శనకు 0 నుంచి 100 మధ్య విలువలు ఇచ్చి లెక్కగడుతారు.

| అభివృద్ధి చాలా ఎక్కువ దేశం - స్థానం | అభివృద్ధి ఎక్కువ దేశం - స్థానం | అభివృద్ధి మధ్యస్థం దేశం - స్థానం | అభివృద్ధి తక్కువ దేశం - స్థానం |
|---|---|---|---|
| 1. నార్వే (1) | సెర్బియా (63) | వియత్నాం (118) | నైజీరియా (158) |
| 2. స్విట్జర్లాండ్ (2) | ఇరాన్ (65) | పాలస్తీనా (119) | ఉగాండా (159) |
| 3. ఐర్లాండ్ (3) | శ్రీలంక (71) | ఇరాక్ (120) | మడగాస్కర్ (162) |
| 4. జర్మనీ (4) | మెక్సికో (76) | తజకిస్థాన్ (125) | సూడాన్ (168) |
| 5. కెనడా (13) | బ్రెజిల్ (79) | ఇండియా (129) | ఆఫ్ఘనిస్థాన్ (170) |
| 6. న్యూజీలాండ్ (14) | పెరు (82) | నమీబియా (130) | జాంబియా (174) |
| 7. అమెరికా (15) | చైనా (85) | భూటాన్ (134) | యెమెన్ (177) |
| 8. బెల్జియం (17) | ఈక్వెడార్ (85) | బంగ్లాదేశ్ (135) | మొజాంబిక్ (180) |
| 9. జపాన్ (19) | వెనిజులా (96) | నేపాల్ (147) | మాలి (184) |
| 10. ఖతార్(41 ) | మాల్దీవులు (104) | పాకిస్థాన్ (152) | నైగర్ (189) |

## వర్గీకరణలు

- ఈ నివేదిక అత్యంత మానవాభివృద్ధి చెందిన దేశాలు, అధిక మానవాభివృద్ధి చెందిన దేశాలు, మధ్యస్థ మానవాభివృద్ధి, తక్కువ మానవాభివృద్ధి చెందిన దేశాలుగా వర్గీకరించింది. 62 దేశాలను అత్యంత మానవాభివృద్ధి చెందిన దేశాలుగా, 54 దేశాలను అధిక మానవాభివృద్ధి చెందిన దేశాలుగా, 37 దేశాలను మధ్యస్థ మానవాభివృద్ధి దేశాలుగా, 36 దేశాలను అల్పమానవాభివృద్ధి దేశాలుగా విభజించింది.

**వివిధ సంవత్సరాల్లో మానవాభివృద్ధి సూచీ**

1981– 0.320
1991– 0.381
2001– 0.472
2017– 0.640
2019– 0.647



- ఈ నివేదిక ప్రకారం మానవాభివృద్ధి సూచీలో ఈ సారి కూడా నార్వే 0.954 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో స్విట్జర్లాండ్ 0.946, ఐర్లాండ్ 0.942 పాయింట్లతో రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. జర్మనీ 0.939, హాంకాంగ్ 0.939 స్కోర్‌తో ఉమ్మడిగా నాలుగోస్థానంలో నిలిచాయి. ఆస్ట్రేలియా 0.938, ఐస్‌లాండ్ కూడా 0.938 పాయింట్లతో ఆరోస్థానాన్ని పొందాయి. స్వీడన్ 0.937, సింగపూర్ 0.935, నెదర్లాండ్స్ 0.933 స్కోర్‌తో టాప్‌టెన్‌లో ప్లేస్‌లో చోటు సంపాదించాయి. అట్టడుగున 189వ స్థానంలో నైగర్ ఉంది. ఈ సూచీలో భారత్ ర్యాంకు స్వల్పంగా మెరుగుపడింది. ఒక మెట్టు పైకెక్కి తన స్థానాన్ని 130 నుంచి 129కి మెరుగుపర్చుకుంది. అదే సమయంలో పాకిస్థాన్ రెండు స్థానాలు దిగజారి 152వ స్థానంలో నిలిచింది. ఆఫ్ఘనిస్థాన్ 168 నుంచి 170కి పడిపోయింది. అయితే శ్రీలంక 71, చైనా 85 మనకంటే బాగా ముందున్నాయి. శ్రీలంక 4, చైనా ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాయి.

## భారత్@ 129

- ఈ సూచీలో భారత్ ర్యాంకు స్వల్పంగా మెరుగుపడింది. గతేడాది కంటే ఒక స్థానం ఎగబాకింది. 2018లో భారత్ 0.647 మానవాభివృద్ధి విలువతో 130వ ర్యాంకులో ఉండగా ఈసారి 0.647 పాయింట్లతో 129వ స్థానంలో నిలిచింది. అయితే ఆసియా ఖండం సగటు HDIతో పోలిస్తే భారత కాస్త పైనే ఉన్నది. అంతకుముందు అంటే 2016లో 0.624 విలువతో 131వ స్థానంలో ఉంది. దశాబ్దకాలంలో 27 కోట్లమందికి పైగా ప్రజలు దేశంలో పేదరికం నుంచి బయటపడ్డట్లు పేర్కొంటున్నప్పటికీ మానవాభివృద్ధిలో మాత్రం ఇంకా 128 దేశాలకన్నా దిగువనే ఉన్నాం.
- భారత్‌కు సంబంధించి మానవాభివృద్ధి సూచీ రూపకల్పనలో వినియోగించే వివిధ సూచికల ప్రగతిని పరిశీలిస్తే.. ఆయుఃప్రమాణం 69.4 సంవత్సరాలుగా, అడల్ట్ మోర్టాలిటీ రేట్ స్త్రీలు ప్రతి వెయ్యి మందికి 136, అదే పురుషుల్లో 210గా తెలిపింది. పాఠశాల విద్య 12.3 సంవత్సరాలుగా, పాఠశాల సగటు వయస్సు 6.5 సంవత్సరాలుగా, తలసరి స్థూల జాతీయాదాయం (పీపీపీ 2011) 6, 829 డాలర్లుగా నమోదయ్యాయి.
- భారత్‌కు సంబంధించి అసమానతలను సర్దుబాటు చేసిన మానవాభివృద్ధి సూచీ విలువ 2015లో 0.454 కాగా ఇప్పుడు 0.538గా నివేదిక తెలిపింది. యూఎన్‌డీపీ 189దేశాలతో లింగ సంబంధిత అభివృద్ధి సూచీని రూపొందించింది. నార్వేకు 2015లో ఈ సూచీ విలువ 0.993

**ఖండాలు- మానవాభివృద్ధి సూచికలు**

| ఖండం | ప్రథమస్థానం | హెచ్‌డీఐ విలువ | హెచ్‌డీఐ సూచికలో స్థానం |
|---|---|---|---|
| ఆసియా | హాంకాంగ్ | 0.939 | 4 |
| ఆఫ్రికా | సీషెల్స్ రిపబ్లిక్ | 0.801 | 62 |
| ఉత్తర అమెరికా | కెనడా | 0922 | 13 |
| దక్షిణ అమెరికా | చిలీ | 0.847 | 42 |
| యూరప్ | నార్వే | 0.954 | 1 |
| ఓషియానా | ఆస్ట్రేలియా | 0.938 | 6 |

## భారతదేశం-నివేదిక

**డెమోగ్రఫీ**

- మొత్తం దేశ జనాభా 1,352.6 మిలియన్లు కాగా మధ్యస్థ వయసు 28.4 సంవత్సరాలు. 15 నుంచి 64 సంవత్సరాల వయోవర్గం వారిపై 65 సంవత్సరాలు, అంతకు పైబడిన వయోవర్గం వారి డిపెండెన్సీ రేషియో 9.3 అంటే 15 నుంచి 65 సంవత్సరాల జనాభాను 903.1 మిలియన్లుగా, 65 సంవత్సరాలు అంతకు పైబడిన వయోవర్గం జనాభాను 83.6, ఐదేండ్లలోపు వయోవర్గ జనాభాను 116.4 మిలియన్లుగా నివేదిక పేర్కొంది. భారతదేశ జనాభాలో పట్టణ జనాభా 34.0 శాతంగా నివేదిక అంచనావేసింది.

**ఆరోగ్యం**

- ఆయుర్ధాయం సరాసరి 69.4 ఏండ్లు కాగా మహిళలు 70.7, పురుషులు 68.2 సంవత్సరాలు. మహిళల్లో ప్రతి వెయ్యి జనాభాకు వయోజన మరణరేటు 136 కాగా, పురుషులు 210గా పేర్కొంది. ప్రతి వెయ్యి జననాలకు శిశు మరణాల రేటు 32.0 శాతం, ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో 3.7 శాతంగా ఉంది. ప్రతి ఐదేండ్లలోపు చిన్నారుల్లో పోషకాహార లోపం 37.9శాతం, 15-49 ఏండ్లలోపు హెచ్ఐవీ ప్రబలుతున్నది 0.2 శాతం, ప్రతి వెయ్యిమందిలో మలేరియా వ్యాధి బారినపడుతున్నవారు 7.7 శాతంగా పేర్కొంది.



**విద్య**

- 15 సంవత్సరాలు అంతకు పైబడిన వయస్సు వారిలో వయోజన అక్షరాస్యత రేటు 69.3 శాతం. విద్యపై ప్రభుత్వరంగ వ్యయం.. జీడీపీలో 3.8 శాతం. 25 సంవత్సరాలకు పైబడిన వారిలో కనీసం సెకండరీ విద్యను అభ్యసించినవారు 51.6 శాతం కాగా, స్త్రీలు 39.0, పురుషులు 63.5 శాతంగా ఉన్నది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి, టీచర్ల నిష్పత్తి 1:35గా (ప్రతి టీచరుకు 35 మంది విద్యార్థులు) ఉన్నది. ప్రాథమిక విద్యలోనే డ్రాపౌట్ అవుతున్నవారి సంఖ్య 12.3 శాతం.

**ఆదాయం**

- తలసరి స్థూల దేశీయోత్పత్తి (2011 పీపీపీ) 6,829 డాలర్లు కాగా, స్థూల దేశీయోత్పత్తి (2011 పీపీపీ) 9,332 బిలియన్ డాలర్లు. స్థూల స్థిర మూల ధన సంచయనం స్థూల దేశీయోత్పత్తిలో 28.9 శాతంగా ఉంది.

## పని, ఉపాధి

- 15 సంవత్సరాలు, అంతకుపైబడిన వారిలో 50.6 శాతం ఉపాధి పొందుతున్నారు. గత నివేదికలో 5 నుంచి 14 సంవత్సరాల వయోవర్గంలో బాలకార్మికులు 12 శాతం ఉండగా.. ఈసారి సరైన డాటా ఇవ్వలేదు. మొత్తం ఉపాధి వ్యవసాయ రంగం వాటా 43.9 శాతం, సేవారంగం వాటా 31.5 శాతం ఉన్నది.
- 15 సంవత్సరాలు, అంతకు పైబడిన వారిలో శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 51.9 శాతం. అందులో స్త్రీలు 23.6 శాతం, పురుషులు 78.6 శాతంగా ఉన్నది.
- దేశంలో మొత్తం నిరుద్యోగిత రేటు గతంలో 3.5 శాతంగా ఉండగా ఈసారి 2.6 శాతం, మొత్తం ఉపాధి రంగంలో వ్యవసాయేతర రంగం ఉపాధి శాతం 74.8 శాతంగా ఉన్నది.
- యువతలో (15-24 సంవత్సరాలు) నిరుద్యోగిత రేటు 10.4 శాతం.

## వాణిజ్యం-విత్తప్రవాహాలు

- స్థూల దేశీయోత్పత్తిలో ఎగుమతులు, దిగుమతులు 43.1 శాతం.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నికర ప్రవాహాలు జీడీపీలో 1.5 శాతం.
- స్థూల జాతీయాదాయంలో నికర అధికార అభివృద్ధి సహాయం 0.1 శాతం కాగా, స్థూల దేశీయోత్పత్తిలో ప్రైవేటు మూలధన ప్రవాహాలను 2.2 శాతంగా నివేదిక పేర్కొంది.



## సమాచారం

- దేశ జనాభాలో 34.5 శాతం మంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారు. ప్రతి వందమందిలో 86.9 మంది మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారు. నికర వలస రేటు ప్రతి వెయ్యి జనాభాకు 0.4 శాతంగా ఉన్నది.

## మానవ భద్రత

- 5 ఏండ్లలోపు జనన నమోదు చేస్తున్నవారు 80 శాతం, ప్రకృతి విపత్తుల కారణంగా నిరాశ్రయులవుతున్న వారి సంఖ్య (ఏడాదికి సగటున మిలియన్ మందికి) 471, శరణార్థులు 9.6 శాతం, ఆత్మహత్యల నిష్పత్తి స్త్రీలు ప్రతి లక్షమందికి 14.5, పురుషులు 18.5 శాతంగా ఉన్నది.

## పర్యావరణ సుస్థిరత

- మనదేశంలో తలసరి కార్బన్ డై ఆక్సైడ్ విడుదల 1.6 టన్నులు. గత నివేదికలోనూ 1.6 టన్నులుగా ఉన్నది. మొత్తం భూ విస్తీర్ణంలో అటవీ విస్తీర్ణ శాతం 23.8. 1990-2018 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణంలో మార్పు 10.8 శాతం. శిలాజ ఇంధనశక్తి వినియోగం 73.6 శాతం, మొత్తం అంతిమశక్తి వినియోగంలో పునరుత్పాదక శక్తి వినియోగం 36.0 శాతం స్థూల జాతీయాదాయంలో సహజ వనరుల క్షీణత 1.0 శాతంగా ఉన్నది.

**పొరుగు దేశాలు - ర్యాంకులు**

| దేశం | 2019 | 2017 |
|---|---|---|
| ఇండియా | 129 | 130 |
| చైనా | 85 | 86 |
| శ్రీలంక | 71 | 76 |
| భూటాన్ | 134 | 134 |
| బంగ్లాదేశ్ | 135 | 136 |
| పాకిస్థాన్ | 152 | 150 |
| ఆఫ్ఘనిస్థాన్ | 170 | 168 |
| మయన్మార్ | 145 | 148 |
| నేపాల్ | 147 | 149 |

## మానవాభివృద్ధిలో పురోగతి సాధించాలంటే..

- సమాజంలోని ప్రజల స్వేచ్ఛకు ఆటంకం కలిగించే అన్ని అడ్డంకులను తొలగించినప్పుడే మానవాభివృద్ధి సాధ్యమవుతుంది. ఆయా అడ్డంకులను ఎదుర్కొనే సామర్థ్యం వారిలో పెంపొందించాలి. దీనికి అవసరమైన చర్యలను నివేదిక సూచించింది. పటిష్ట సాంఘిక భద్రతను పెంపొదిస్తే వ్యక్తుల్లో విపత్తులు, అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొని పురోగతి సాధించే సామర్థ్యం పెరుగుతుంది. కరువు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్వల్పకాల అత్యవసర పరిస్థితిలో భాగంగా సాంఘిక భద్రతా కార్యక్రమాలను అమలుచేసేందుకు పంపిణీ నెట్‌వర్క్ యంత్రాంగాన్ని ఉపయోగించుకోవాలి. సాంఘిక భద్రత ఉత్పత్తిలో ఒడిదుడుకులను తగ్గించడంతో పాటు వ్యయార్హ ఆదాయల్లోని ఒడిదుడుకులను తగ్గిస్తుంది.



## ఇతర ముఖ్యాంశాలు

- మానవాభివృద్ధిలో దక్షిణాసియా ఫస్ట్ ప్లేస్, తూర్పు ఆసియా సెకండ్ ప్లేస్, పసిఫిక్ థర్డ్ ప్లేస్‌లో ఉన్నాయి.
- భారత HDI విలువ గతం కంటే 50 శాతం పెరిగింది.
- భారత్‌తో పాటు మానవాభివృద్దిలో ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ కూడా ముందంజలో ఉన్నాయి.
- భారత్‌లో వాస్తవ పేదరికం తగ్గినప్పటికి అసమానతలు, మౌలిక సదుపాయల కొరత కొనసాగుతున్నది.
- స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు మౌలిక సదుపాయాలైన గృహవసతి, నాణ్యమైన యూనివర్సిటీ విద్య వంటివి కీలకం.
- దక్షిణాసియాలో ఆయుర్ధాయం, పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునే సగటు విద్యా సంవత్సరాలు పెరిగాయి.
- మూడు దశాబ్దాలుగా జరుగుతున్న అభివృద్ధి కారణంగా పేదరికంలోనూ, భారతీయుల ఆయుర్ధాయంలోనూ, విద్య, వైద్య సదుపాయాల్లో గణనీయమైన మార్పులు వచ్చినట్లు ఈ నివేదిక పేర్కొంది.
- ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (ఆర్థిక సమ్మిళితం), ఆయుష్మాన్‌భారత్ (ఆరోగ్య రక్షణ) వంటి కార్యక్రమాల వల్ల ప్రజల ఆరోగ్య పరిస్థితులు మెరుగయ్యాయి.
- భారత్‌లో 1990 నుంచి 2018 మధ్య సగటు ఆయుర్ధాయం 11.6 ఏండ్లు పెరిగింది. అదే సమయంలో పాఠశాలలో చదువుకునే సగటు విద్యా సంవత్సరాలు 3.5 ఏండ్లు పెరిగాయి.
- 250 శాతం తలసరి ఆదాయం పెరిగింది.
- 1.3 బిలియన్ల మంది నిరుపేదల్లో 28 శాతం మంది భారత్‌లో ఉన్నారు. ఇక్కడా స్త్రీలు, బాలికలు అసమానతల సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు.
- ప్రపంచంలోని 101 దేశాల్లో మొత్తం 130 కోట్ల మంది పేదలు ఉండగా, వారిలో 66.1 కోట్ల మంది (41 శాతం) ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోనే ఉన్నారు.
- జీవిత భాగస్వామి చేతిలో హింసను ఎదుర్కొనే మహిళలు దక్షిణాసియాలో 31 శాతం ఉండగా, సింగపూర్‌లో వారి సంఖ్య అత్యంత తక్కువగా ఉన్నది.
- లింగ అభివృద్ధి సూచీలో 162 దేశాలకు గాను (0.829) విలువతో భారత్ 122వ స్థానంలో నిలిచింది. అయితే ఈ సూచీలో దక్షిణాసియా దేశాల సగటు కంటే భారత్ కొద్దిగా మెరుగైన స్థితిలో ఉంది.
- మానవాభివృద్ధి విలువ 50 శాతం పెరిగినప్పటికీ దేశంలోని అసమానతలను పరిగణనలోకి తీసుకోగా ఒక మెట్టు మాత్రమే పైకి ఎగబాకింది. స్త్రీ, పురుష అసమానతల పరంగా చైనా, శ్రీలంక (86), భూటాన్ (99), మయన్మార్ (106) మనకంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి.
- 1990-2018 మధ్యలో దక్షిణాసియా ప్రాంతం 46 శాతం మేర సత్వర వృద్ధి సాధించిందని, ఆ తర్వాత తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాలు 43 శాతం వృద్ధిని సాధించాయని వెల్లడించింది.

... సత్యంగౌడ్ సూదగాని

epaper.ntnews.com

## చెన్నై, కోల్‌కతాల్లో భారీగా బంగారం పట్టివేత

గుర్రపులద్దెలో దాచి పచ్చడి పాకెట్ల పేరుతో
బంగారం తరలించే యత్నం

**చెన్నై, కోల్‌కత:** చెన్నై, కోల్‌కతా విమానాశ్రయాల్లో భారీగా బంగారం పట్టుబడింది. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1.12 కోట్లు విలువ చేసే 2.8 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని, ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కోల్‌కతా విమానాశ్రయంలో తనిఖీల్లో ఇద్దరు చైనీయుల నుంచి రూ.75 లక్షలు విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. ఇదే విమానాశ్రయంలో మరో వ్యక్తి గుర్రపులద్దెలో బంగారు బిస్కెట్లు దాచి తరలిస్తూ పట్టుబడ్డాడు. రూ.8.2 లక్షలు విలువ చేసే 215 గ్రాముల బంగారం బిస్కెట్లను తీసుకొస్తున్న అంగుస్వామి రామయ్య (41)ను సీఐఎస్ఎఫ్ అధికారులు పట్టుకున్నారు. శ్రీలంక నుంచి కోల్‌కతా విమానాశ్రయంలో దిగిన అతను చెన్నై విమానం ఎక్కేందుకు రాగా స్క్రీనింగ్‌లో అతని పాకెట్‌లో 53 గ్రాముల బంగారు బిస్కెట్‌ను గుర్తించారు. అనంతరం అతని లగేజీని ఎక్సరే మిషిన్‌లో పరిశీలించగా నాలుగు పాకెట్లలో అనుమానాస్పద పదార్థాన్ని గుర్తించారు. పచ్చడి పాకెట్లని నిందితుడు చెప్పగా, గుర్రపులద్దె, నూనెతో నింపిన పాకెట్లలో సుమారు 162 గ్రాముల బరువున్న నాలుగు బంగారం బిస్కెట్లను కస్టమ్స్ అధికారులు తనిఖీలో గుర్తించారు. మొత్తం 215 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడు రామయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


గుర్రపులద్దెలో తరలిస్తూ కోల్‌కతా విమానాశ్రయంలో పట్టుబడ్డ బంగారం

## లేటు వయసులో ఒక్కటయ్యారు

అనాథలుగా వృద్ధాశ్రమానికి చేరిన ఇద్దరు.. మనుసులు కలుసుకోవడంతో మనువాడి ఒక్కటయ్యారు. ప్రేమ, పెండ్లికి వయసుతో సంబంధం లేదని ఈ వృద్ధ జంట ప్రపంచానికి చాటిచెప్పింది. శనివారం కేరళ త్రిచూర్ జిల్లాలోని రామవర్మపురం వృద్ధాశ్రమం వీరి ప్రేమవివాహానికి వేదికైంది. సంప్రదాయబద్ధంగా 67 ఏండ్ల కొచానియన్ మీనన్, 65 ఏండ్ల లక్ష్మీ అమ్మాల్ వివాహానికి కేరళ వ్యవసాయశాఖ మంత్రి వీఎస్ శివకుమార్, కలెక్టర్ ఎస్ షానవాస్‌తోపాటు పెద్ద సంఖ్యలో బంధువులు, ఆశ్రమం పెద్దలు హాజరై 'శతమానం భవతి' అంటూ దీవించారు. జీవిత చరమాంకంలో ఈ జంట పెండ్లి ఫొటోలు, వీడియోను ట్విట్టర్లో చూసిన నెటిజన్లు.. 'మనసున మనసై.. బతుకున బతుకై.. తోడొకరుండిన అదే భాగ్యము' అని పాడుకొంటున్నారు.


కేరళలోని వృద్ధాశ్రమంలో ఒక్కటైన వృద్ధులు కొచానియన్ మీనన్, లక్ష్మీ అమ్మాల్



# బీబీనగర్‌లో భారీ భూకబ్జా

రూ.100 కోట్ల విలువైన భూమి స్వాహా

16 ఎకరాల్లోని 286 ప్లాట్ల యజమానుల నోట్లో మట్టి

రోడ్డునపడ్డ మధ్యతరగతి కుటుంబీకులు

ప్రశ్నిస్తే గూండాలతో బెదిరింపులు.. చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 16 ఎకరాల వెంచర్‌లోని రూ.100 కోట్ల విలువైన 286 ప్లాట్లను కబ్జాచేశారు. అప్పో సొప్పో చేసి ప్లాట్లు కొనుగోలుచేసిన మధ్యతరగతి కుటుంబీకుల నోట్లో మట్టి కొట్టారు. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, గూండాల అండతో బెదిరింపులకు గురిచేస్తూ.. దోపిడీ రాజ్యానికి ఆజ్యం పోస్తున్నారు. ఇంతటి ఘరానా మోసం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం నెదురుగొమ్ములలో జరిగింది. ప్రశ్నిస్తే ఏకంగా వంద మంది రౌడీలను పెట్టి బెదిరిస్తున్నారు. ఈ భూమి అంతా తమదని భూయజమాని వెంచర్‌చేసి విక్రయించడంతో తాము కొనుక్కున్నామని చెప్పినా వినడంలేదు. కోర్టు డిక్రీ ఇచ్చినా కబ్జాదారులు పట్టించుకోవడంలేదు. దీంతో బాధితులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఈ భూకబ్జాను పరిశీలిస్తే బ్యాంకులను నిండా ముంచిన వ్యవహారం కూడా వెలుగుచూసింది. ఆక్రమణదారులకు ఊతమిచ్చేలా రెవెన్యూ అధికారులు కబ్జాదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేయడం కొసమెరుపు.

**ప్లాట్ల యజమానులకు వచ్చింది ఇలా..**

బీబీనగర్ మండలం నెదురుగొమ్ములలో ఉంగూరి బాలయ్య, ఉంగూరి పెంటయ్య, గడ్డం నర్సింహ, ఉంగూరి బిచ్చపతి నుంచి సర్వే నంబర్లు 154,155,157లకు చెందిన 16 ఎకరాల భూమిని 1984లో డాక్యుమెంట్ నంబర్లు 154/1984, 206/1984లతో సయ్యద్ ఇజాహుస్సేన్, సుజిత్ హుస్సేన్, సయ్యద్ విలాయత్ హుస్సేన్, సయ్యద్ ఫిరాసత్ హుస్సేన్ రిజిస్టర్ చేసుకున్నారు. ఈ భూమి వీరిపేరిట బదిలీ అయ్యాక డాక్యుమెంట్ నంబర్ 74/1989 రిజిస్టర్ డీడ్ ద్వారా ఖాజాపాషాకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేశారు.



బీబీనగర్ మండలం నెదురుగొమ్ములలో 1989లో సాయిబాబానగర్ పేరుతో వేసిన లేఅవుట్

### ధర్మగంట

ఈ జీపీఏ ద్వారా 16 ఎకరాలను 1989లో సాయిబాబానగర్ పేరుతో గ్రామపంచాయతీ లేఅవుట్‌చేశారు. ఈ లేఅవుట్‌కు ఆనాటి సర్పంచ్ గడ్డం మల్లయ్య అనుమతి కూడా ఇచ్చారు. గ్రామపంచాయతీ అనుమతి రావడంతో ఖాజాపాషా భూ యజమానుల తరపున ప్లాట్లను విక్రయించారు. కొన్ని ప్లాట్లు అమ్ముడుపోలేదు. ఇలా మిగిలిన ప్లాట్ల విస్తీర్ణం 3.20 ఎకరాలను దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఇందుర్తి వెంకటప్పయ్యకు డాక్యుమెంట్ నంబర్ 6307/1996 ద్వారా 1996 డిసెంబర్ 3న రిజిస్టర్ చేశారు. వెంకటప్పయ్య ఈ భూమిని ప్లాట్లుగా ఇతరులకు విక్రయించారు. ఇంతవరకు బాగానే ఉన్నది. తమకు నగరశివారులో మంచిప్లాట్లు ఉన్నాయని సంబురపడ్డ మధ్య తరగతిజీవి ప్లాట్లు ఇంత లోనే గంప గుత్తగా కబ్జాకు గురయ్యాయి.

**కబ్జాకు గురైంది ఇలా..**

ఈ 16 ఎకరాల్లో వెలసిన 286 ప్లాట్లను కొన్నవారు వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు కావడంతో ఈ భూమిని గంపగుత్తగా కబ్జాచేసినా అడిగేవారుండరని భావించిన కబ్జాదారులు 2005లో తమ పథకాన్ని అమలుచేశారు. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ఈ భూమిని టోకున కొనుగోలుచేశారు. ఈ భూమికి జీపీఏగా ఉన్న ఖాజాపాషా పేరుతోనే రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. వాస్తవంగా ఖాజాపాషా 2002 మే 5న చనిపోయారు. అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్) డెత్ సర్టిఫికెట్‌ను కూడా జారీచేసింది. చనిపోయిన వ్యక్తి ఖాజాపాషా స్థానంలో నకిలీ వ్యక్తిని ప్రవేశపెట్టి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మోసంచేసి 2005 నవంబర్ 9న డాక్యుమెంట్ నంబర్ 5528/2005 పేరుతో బుచ్చిదాస్ గౌడ్, వినోబాగౌడ్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమిని తిరిగి 2007లో టీ మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావుకు విక్రయించారు. అక్కడి నుంచి రిలయన్స్ మెట్రోపాలిటన్ ఎండీ ఎన్ శ్రీనివాసరావుకు అమ్మేశారు. 2010లో గాజుల గోవిందరావు కొన్నారు. ఇలా కావాలని చనిపోయిన వ్యక్తిని సృష్టించి ఈ ప్లాట్లను వ్యవసాయ భూమిగా దొంగ రిజిస్ట్రేషన్‌చేసుకొని చేతులు మార్చేశారు. ఇలా దొంగ రిజిస్ట్రేషన్‌తో పొందిన భూమిని కొనుగోలు చేసిన గాజుల గోవిందరావు తదితరులు ఈ ప్లాట్లను ఇండియన్ బ్యాంకులో, మహారాష్ట్ర బ్యాంకులో కుదువబెట్టి రూ.కోట్లు రుణంగా తీసుకున్నారు.

**బయటకు వచ్చింది ఇలా..**

ఈ భూమిని తనఖా పెట్టి తీసుకున్న రుణాలు ఎగవేయడంతో బ్యాంకర్లు స్థలం స్వాధీనంచేసుకొని వేలం వేయడానికి వెళ్లారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. ప్లాట్ల యజమానులు ఈ భూమి తమదని, సాయిబాబానగర్ పేరుతో ఇక్కడ వేసిన వెంచర్‌తో తాము 1989లోనే ప్లాట్లు కొనుగోలుచేసినట్టు పత్రాలు చూపించి అడ్డుకున్నారు. ఇలా ఏటా రెండుమూడుసార్లు ఈ భూమిని వేలంవేయడానికి బ్యాంకులు ప్రయత్నంచేస్తూనే ఉన్నాయి. ప్లాట్ల యజమానులు బ్యాంకులకు లెటర్లు పెట్టి వేలం పాటను అడ్డుకుంటూనే ఉన్నారు. ఈ మధ్యకాలంలో ఈ భూమి విలువ గజం ఓపెన్ మార్కెట్‌లో రూ.10 వేలవరకు చేరడంతో కబ్జాదారులు తిరిగి ఈ భూమిని తమ స్వాధీనం చేసుకోవడానికి వందల మంది గూండాలతో అక్కడ తిష్ట వేశారు. దీంతో ప్లాట్ల యజమానులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కబ్జాదారులను అక్కడినుంచి పంపించినా తిరిగి వచ్చి ప్లాట్ల యజమానులను బెదిరిస్తున్నారు. కబ్జాపై తుమ్మ ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అనే బాధితుడు 2015లో భువనగిరి కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా ఈ భూమి ప్లాట్ల యజమానులకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆర్డర్ ఇచ్చిన తర్వాత బీబీనగర్ తాసిల్దార్ విచారణచేసి 2017లో ఏప్రిల్ 18న ఈ భూమి ప్లాట్ల యజమానులదేనని స్పష్టంచేస్తూ 22 పేజీల నివేదికను భువనగిరి ఆర్డీవోకు అందజేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో కోర్టుకు వెళ్లాలని ప్లాట్ల యజమానులకు సలహా ఇచ్చారు.

**కబ్జాదారులకు రెవెన్యూ వత్తాసు**

తాసిల్దార్ ఈ భూమి ప్లాట్ల యజానులదేనని ఒ పక్క నివేదిక ఇవ్వగా, మరోవైపు ఈ భూమిని దొంగ డాక్యుమెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారి పేర్లను రెవెన్యూ అధికారులే రికార్డుల్లోకి ఎక్కించడం గమనార్హం. అన్ని తెలిసిన రెవెన్యూ అధికారులు కబ్జాదారుల పేర్లను భూ రికార్డుల్లో ఎక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్లాటును కబ్జాచేస్తున్నరు



నా ప్లాటును కబ్జా చేస్తున్నారు. ఇక్కడ సాయిబాబానగర్ పేరుతో వెంచర్‌వేశారు. నేను అన్ని డాక్యుమెంట్లు చూసి ప్లాటు కొనుక్కున్నాను. ఇప్పుడు ఇక్కడి ప్లాట్లను ఎకరాల్లో కొనుక్కున్నట్టు రిజిస్టర్ డాక్యుమెంట్లు వచ్చాయి. ఇలా దొంగ డాక్యుమెంట్ల ద్వారా భూములు కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకొని మా ప్లాట్లు మాకు అప్పగించాలి.

– జయశ్రీధర్, ప్లాటు యజమాని

### కష్టార్జితంతో కొన్నాం



చిట్టీలు వేసి, అప్పులు తెచ్చి ప్లాటు కొనుకున్నాను. కష్టపడి సంపాదించుకున్న ప్లాటును ఎవరో కబ్జా చేస్తున్నారు. ప్లాటు వద్దకు వెళ్తే వెళ్లగొడుతున్నారు. పోలీసులు వచ్చినప్పుడు మాత్రమే అక్కడి నుంచి వెళ్లిపోతారు. ఆ తర్వాత గూండాలువచ్చి అక్కడే తిష్ట వేస్తున్నారు. గూండాలను తొలగించి, మా ప్లాట్లను తిరిగి అప్పగించాలి.

– బడేసాబ్, ప్లాటు యజమాని

### దొంగ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి



భూమిని 1989లో ఖాజా పాషా వెంచర్ చేసి విక్రయించిన ప్లాట్లను మేము కొనుకున్నాం. తిరిగి 2005లో ఇదే వ్యక్తి విక్రయించినట్టు దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకొని మా ప్లాట్లను కబ్జాచేస్తున్నారు. మాకు ప్లాట్లు విక్రయించిన ఖాజాపాషా 2002లోనే చనిపోయారు. చనిపోయిన వ్యక్తి భూమిని ఎలా విక్రయిస్తాడు. గూండాలను తీసుకొచ్చి బెదిరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, కోర్టులను కూడా లెక్కచేయడం లేదు. ప్రభుత్వం కబ్జాదారులపై తీవ్రమైన చర్యలు తీసుకొని ఆయా డాక్యుమెంట్లను రద్దుచేయాలి. రెవెన్యూ రికార్డుల్లో మా పేర్లను నమోదుచేయాలి.

– బొమ్మ వెంకటేశ్వర్లు, ప్లాటు యజమాని

### కబ్జాదారుల నుంచి కాపాడండి



మా నాన్న దివంగత పిచ్చయ్య ఈ ప్లాటును కొనుగోలు చేశారు. ఆ ప్లాటు నాకు వారసత్వంగా వచ్చింది. ఈ ప్లాట్లు ఎవరో కబ్జా చేస్తున్నారు. ఎలాగైనా నా ప్లాటును కబ్జాదారుల నుంచి కాపాడి నాకు అప్పగించండి.

– దొండపాటి చంద్రకళ, ప్లాట్లు యజమాని

### పరిశీలించి చర్యలు తీసుకుంటా

కొత్తగా వచ్చాను. బాధితులు నాకు దరఖాస్తుచేసుకుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటా. గతంలో తాసిల్దార్ ఇచ్చిన నివేదికపై ఆర్డీవో ఆదేశాలుంటే వెంటనే అమలుచేస్తా. మొదటి డాక్యుమెంట్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

– వెంకటరెడ్డి, బీబీనగర్ తాసిల్దార్

## కశ్మీర్‌పై ఓఐసీ సమావేశం

పాక్‌ను సంతృప్తిపరిచేందుకు
సౌదీ అరేబియా యోచన



**ఇస్లామాబాద్, డిసెంబర్ 29:** కశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌ను సంతృప్తిపరిచేందుకు ఓఐసీ (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో-ఆపరేషన్) సభ్యదేశాల విదేశాంగ మంత్రులతో సమావేశాన్ని నిర్వహించాలని సౌదీ అరేబియా భావిస్తున్నది. ఓఐసీకి సౌదీ అరేబియా నాయకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల మలేషియాలో జరిగిన ముస్లిం దేశాల శిఖరాగ్ర సమావేశాన్ని ఓఐసీ స్థానంలో కొత్త కూటమి ఏర్పాటుకు జరిగిన ప్రయత్నంగా సౌదీ అరేబియా పరిగణిస్తున్నది. ఈ సమావేశానికి పాక్ గైర్హాజరవడంతో కశ్మీర్ విషయంలో ఆ దేశాన్ని సంతృప్తిపరిచేందుకు ఓఐసీ విదేశాంగ మంత్రుల సమావేశాన్ని నిర్వహించాలని సౌదీ అరేబియా యోచిస్తున్నది. సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్ గురువారం పాక్ విదేశాంగ మంత్రి షా మెహమూద్ ఖురేషీతో సమావేశమైనప్పుడు ఆయనకు ఈ విషయం గురించి తెలియజేసినట్టు దౌత్యవర్గాలను ఉటంకిస్తూ 'డాన్' పత్రిక వెల్లడించింది. కౌలాలంపూర్‌లో ఇటీవల జరిగిన ముస్లిందేశాల శిఖరాగ్ర సమావేశానికి గైర్హాజరైన పాకిస్థాన్‌కు సౌదీ అరేబియా నాయకత్వం తరపున ఫైజల్ బిన్ ఫర్హాన్ కృతజ్ఞతలు తెలిపినట్టు ఆ పత్రిక పేర్కొన్నది. భారత రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దుచేసిన తర్వాత కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితి గురించి ఖురేషీ ఈ భేటీలో ఫైజల్‌కు వివరించారని, కశ్మీర్ అంశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఓఐసీ పోషించాల్సిన పాత్ర ఏమిటన్నదానిపై వీరిద్దరు చర్చించారని పాక్ విదేశాంగశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. మలేషియా నిర్వహించిన ఇస్లామిక్ దేశాల సమావేశంలో పాక్ పాల్గొంటుందని ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ధ్రువీకరించినప్పటికీ సౌదీ అరేబియాతోపాటు యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) నుంచి ఒత్తిడి రావడంతో చివరి నిమిషంలో పాక్ ఆ సమావేశానికి గైర్హాజరయింది. ప్రస్తుతం పీకల్లోతున ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాకిస్థాన్‌ను సౌదీ అరేబియా, యూఏఈ ఆర్థికంగా ఆదుకొంటుండటమే ఇందుకు కారణం.

## అమెరికాలో యూదులపై దాడి

అగంతకుడి కత్తిపోట్లకు
ఐదుగురికి గాయాలు

**న్యూయార్క్, డిసెంబర్ 29:** అమెరికాలోని న్యూయార్క్‌లో యూదులపై దాడి జరిగింది. శనివారం రాత్రి ఓ మత బోధకుడి ఇంట్లో యూదుల పండుగైన హనుక్కా వేడుకను జరుపుకుంటుండగా ఈ ఘటన జరిగింది. ఆ ఇంట్లోకి చొరబడిన ఓ అగంతకుడు కత్తితో కొందరిపై విచక్షణా రహితంగా దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో ఐదుగురు యూదులకు గాయాలయ్యాయని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని యూదు ప్రజా వ్యవహారాల మండలి ట్విట్టర్‌లో పేర్కొన్నది. గాయపడిన వారిలో మత బోధకుడి కుమారుడు కూడా ఉన్నట్టు వెల్లడించింది. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి ఓ అనుమానితుడ్ని అదుపులోకి తీసుకున్నట్టు న్యూయార్క్ పోలీసులు తెలిపారు. ఈ దాడిని నీచమైన, పిరికిపంద చర్యగా న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమో అభివర్ణించారు. ఇలాంటి వాటిని సహించబోమన్న ఆయన సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లు చెప్పారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు రియువెన్ రివ్లిన్ ఈ దాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి మత వ్యతిరేక దాడులు యూదులు లేదా ఇజ్రాయెల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదన్నారు. ప్రపంచానికి ముప్పుగా మారుతున్న ఈ రక్కసిపై కలిసికట్టుగా పోరాడాలని రివ్లిన్ పిలుపునిచ్చారు. అమెరికాలో యూదులపై తరచుగా దాడులు జరుగుతున్నాయి. ఆరు నెలల కిందట జెర్సీ నగరంలో యూదుల కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో ఇద్దరు అనుమానితులతో సహా ఆరుగురు చనిపోయారు. గత ఏడాది పిటర్స్‌బర్గ్‌లోని ఓ ప్రార్థన మందిరంపై ఓ అగంతకుడు జరిపిన దాడిలో 11 మంది యూదులు మరణించారు. అమెరికాలో యూదులపై జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు పేర్కొన్నారు.

## ఏపీలో హైపవర్ కమిటీ ఏర్పాటు

- రాజధాని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై కమిటీలు ఇచ్చిన నివేదికలపై అధ్యయనం
- మూడువారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక పరిశీలనకు ప్రభుత్వం హైపవర్ కమిటీని ఏర్పాటుచేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. జీఎన్ రావు కమిటీ నివేదికతోపాటు ఇతర నివేదికలను ఈ హైపవర్ కమిటీ అధ్యయనం చేయనున్నది. పదిమంది మంత్రులు సహా మొత్తం 16 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ బోస్టన్ కన్సల్టెంట్ గ్రూపు (బీసీజీ) నివేదికల్లోని అంశాల సమగ్ర, తులనాత్మక పరిశీలన చేయనున్నది. వచ్చే నెల మొదటివారంలో బీసీజీ నివేదిక ఇవ్వనున్నది. ఈ హైపవర్ కమిటీలో సభ్యులుగా మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, సుభాష్‌చంద్రబోస్, బొత్స సత్యనారాయణ, గౌతంరెడ్డి, కన్నబాబు, సుచరిత, మోపిదేవి, కొడాలి నాని, పేర్ని నాని, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం, డీజీపీ గౌతమ్ సవాంగ్, సీసీఎల్ఏ, పురపాలకశాఖ కార్యదర్శులు ఉండనున్నారు. ఈ హైపవర్ కమిటీ సభ్య కన్వీనర్‌గా సీఎస్ నీలం సహాని వ్యవహరించనున్నారు. మూడువారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొన్నది.


తెలంగాణ పద్మశాలి సంఘం ప్రచురించిన 2020 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ చిరంజీవులు. చిత్రంలో పద్మశాలి సంఘం నాయకులు ఈగ వెంకటేశ్వర్లు, తిరందాసు యాదగిరి, రాహుల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో
స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ చిరంజీవులు పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ టీ చిరంజీవులు అన్నారు. తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ 2020 సంవత్సరం క్యాలెండర్‌ను చిరంజీవులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ఎంతో సహాయం చేస్తున్నదని, వీటిపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. చేనేత కార్మికుల పిల్లల్ని ప్రభుత్వ సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత పద్మశాలిసంఘంపై ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, ఉపాధ్యక్షుడు ఈ రాహుల్‌కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బాసబత్తిని రాజేశం, ప్రధాన కార్యదర్శి పున్న శ్రీనివాస్, రాష్ట్ర సభ్యులు శిరందాసు యాదగిరేందర్, ఇప్పకాయల విష్ణుమూర్తి, వడ్లకొండ వెంకట్‌రావు, వడ్డేపల్లి శ్రీనివాస్, హైదరాబాద్ ప్రవీణ్, పెంటి శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొండ యాదగిరి, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

### బహుజన టీచర్ల సంఘం అధ్యక్షుడిగా చెన్నయ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ బహుజన టీచర్ల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. నాంపల్లిలోని టీఎన్జీవో భవన్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా కేశపాగ చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా మార్వాడి గంగరాజు, కోశాధికారిగా కె బాలశంకర్ ఎన్నికయ్యారు.


చెన్నయ్య


బాలశంకర్


గంగరాజు

# వచ్చే దశాబ్ది యువతదే

అస్థిరత, అరాచకం, బంధుప్రీతి, పక్షపాతానికి వారు వ్యతిరేకం

అధునాతన భారత నిర్మాణంలో యువజనులదే కీలక పాత్ర

2022 వరకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి

దేశ స్వావలంబనకు గాంధీజీ చేపట్టిన 'స్వదేశీ' ఉద్యమమే స్ఫూర్తి

హిమాయత్ కింద 18 వేల మంది కశ్మీరీ యువతకు నైపుణ్య శిక్షణ

మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ వెల్లడి




**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** వచ్చే దశాబ్ది యువతరానిదేనని, వారు జాతి భావి నిర్మాతలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అరాచకాన్ని, అస్థిరతను, అక్రమాలను, అవినీతిని, పక్షపాతాన్ని, లింగ వివక్షను, బంధుప్రీతిని యువకులు అంగీకరించరన్నారు. ఆదివారం ఆయన ఈ ఏడాది చివరి నెల వారీ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'వచ్చే దశాబ్దిలో భారతీయ యువత కీలక పాత్ర పోషిస్తారు. వారు వ్యవస్థను నమ్ముతారు. సరిగ్గా పని చేయకపోతే వ్యవస్థను ప్రశ్నించడంతోపాటు అందులోని లోపాలను ఎత్తి చూపుతారు. విస్తృత శ్రేణి గల వివిధ అంశాలపై యువత ఒక అభిప్రాయం కలిగి ఉండటం గొప్ప విషయంగా నేను పరిగణిస్తున్నా' అని చెప్పారు. ఇటీవల కేంద్రం ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆందోళన బాట పట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ 'ఆధునిక యువత పట్ల నాకు విశ్వాసం ఉంది. అధునాతన భారత నిర్మాణంలో యువతరానిదే కీలక బాధ్యత. సమూల మార్పులు తేగల శక్తి, చైతన్యం వారిలో ఉన్నాయి' అని చెప్పారు. కన్యాకుమారిలో గల వివేకానంద విగ్రహాన్ని సందర్శించి దేశంలోని పేదలకు సేవ చేస్తామని ప్రతిన బూనాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు. ఇప్పటికే దేశ ప్రగతి, అభివృద్ధి కోసం యువత వివిధ మార్గాల్లో కృషి చేస్తున్నారని మోదీ పేర్కొన్నారు. అందుకు బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలోని భైరవ్‌గంజ్ ఆరోగ్య కేంద్రంలో యువ వైద్యుల ఉచిత సేవలే ఉదాహరణ అని చెప్పారు. 'భైరవ్‌గంజ్ ఆరోగ్య కేంద్రంలో స్థానిక కేఆర్ హైస్కూల్ మాజీ విద్యార్థుల బృందం 'సంకల్ప్ 95' పేరుతో పొరుగు గ్రామాలకు చెందిన వేల మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు' అని కొనియాడారు.

**స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలుచేయాలి**

ఉత్తరప్రదేశ్‌లోని పుల్వార్ లో మహిళలు 'గ్రామీణ్ అజీవికా మిషన్' సాయంతో చెప్పుల ఉత్పాదక యూనిట్ ప్రారంభించారని ప్రధాని మోదీ పేర్కొంటూ.. 'స్వదేశీ' ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లవుతుందని, కనీసం అప్పటివరకైనా స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని ప్రధాని ప్రజలను అభ్యర్థించారు. జాతిపిత మహాత్మాగాంధీ ప్రారంభించిన 'స్వదేశీ' నినాదం లక్షల మంది నిరుపేదల జీవితాల్లో శ్రేయస్సు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. దశాబ్ది క్రితం దేశీయ ఉత్పత్తుల ప్రోత్సాహానికి గాంధీజీ చేపట్టిన భారీ ప్రజా ఉద్యమం దేశాన్ని స్వావలంబన దిశగా నడిపిందని తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో గత రెండేండ్లలో 'హిమాయత్' కార్యక్రమం కింద 77 అంశాలపై 18 వేల మందికి నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చామన్నారు. వారిలో 5,000 మంది స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడం తన హృదయాన్ని కదిలించివేసిందని ప్రధాని మోదీ తెలిపారు. కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో చేపట్టే 'ఫిట్ ఇండియా వీక్' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభ్యర్థించారు. గత 60 ఏండ్లలో తొలిసారి పార్లమెంట్ సమావేశాలు నిర్మాణాత్మకంగా సాగడం రికార్డు అని, అందులో భాగస్వాములైనందుకు ఎంపీలను అభినందిస్తున్నానని చెప్పారు. నూతన వసంతంలో, నూతన దశాబ్దిలో సరికొత్త నిర్ణయాలు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సూర్యుడిపై పరిశోధనలకు ఇస్రో సన్నాహాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** సూర్యుడిపై పరిశోధనలకుగానూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఆదిత్య పేరిట ఓ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వెల్లడించారు. నెలవారీ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో భాగంగా దేశప్రజలను ఉద్దేశించి మాట్లాడిన మోదీ.. ఖగోళ శాస్త్రంలో దేశం చాలా అభివృద్ధి చెందిందని, ఆ రంగంలో మన శాస్త్రవేత్తలు ఎన్నో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. 'ఇస్రో దగ్గర ఇదివరకే ఆస్ట్రోశాట్ అనే ఓ ఖగోళ ఉపగ్రహం ఉన్నది. దీంతోపాటు సూర్యునిపై అధ్యయనం చేయడానికి ఇస్రో శాస్త్రవేత్తలు ఆదిత్య పేరిట మరో ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు' అని మోదీ తెలిపారు. పుణే, కొడైకెనాల్, ఉదగ మండలం, గురుశిఖర్, హాన్లేడక్ తదితర ప్రాంతాల్లో అత్యంత శక్తిమంతమైన టెలిస్కోప్‌లు ఉన్నాయని ఆయన చెప్పారు. '3.6 మీటర్ల పొడవుగల దేవస్థల్ ఆప్టికల్ టెలిస్కోప్‌ను నైనిటాల్ (ఉత్తరాఖండ్) దగ్గర 2016లో నేను, అప్పటి బెల్జియం ప్రధాని కలిసి ప్రారంభించాం. ఆసియా ఖండంలోనే అది అతిపెద్ద టెలిస్కోప్‌గా పేరుగాంచింది' అని ఆయన గుర్తుచేశారు. ఖగోళశాస్త్రంలో భారత్ సాధించిన ప్రాచీన జ్ఞానాన్ని, ఆధునిక విజయాల్ని పౌరులు అర్థం చేసుకోవడానికి కృషిచేయాలని మోదీ అన్నారు. శాస్త్రీయ చరిత్రను తెలుసుకోవడంతో పాటు, ఖగోళ శాస్త్ర భవిష్యత్తును రూపొందించేందుకు దేశంలోని యువ శాస్త్రవేత్తలు దృఢ నిశ్చయంతో ఉన్నారని ఆయన తెలిపారు. నక్షత్రాలను చూడటాన్ని ఒక వ్యాపకంగా మార్చుకోవాలని శ్రోతలకు ఈ సందర్భంగా మోదీ విజ్ఞప్తిచేశారు. పాఠశాల, కళాశాలల్లో ఖగోళ శాస్త్రానికి సంబంధించిన క్లబ్బులు ఏర్పాటుచేయాలని సూచించారు.

### ఈజిప్ట్ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి

**కైరో:** ఈజిప్ట్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ఈజిప్ట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ఆదివారం ఉదయం ధ్రువీకరించింది. పర్యాటకులు హర్‌ఘడా నగరంలోని బీచ్ రిసార్ట్స్ వెళ్తుండగా ఈజిప్ట్ రాజధాని కైరోకు 120 కిలోమీటర్ల దూరంలోని ఐన్ సోఖ్నా పట్టణం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రక్కును పర్యాటకులతో వెళ్తున్న రెండు బస్సులు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకొన్నది. తొలుత ఒక్క భారతీయుడే చనిపోయినట్టు ప్రకటించిన భారతీయ ఎంబసీ.. ఆదివారం ఉదయం ముగ్గురు భారతీయులు చనిపోయిన విషయాన్ని ధ్రువీకరిస్తూ ట్విట్టర్లో పోస్ట్ చేసింది. మృతుల కుటుంబీకులను సంప్రదించామని, మృతదేహాలు వారి స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పర్యాటకులతో వెళ్తున్న బస్సులో 16 మంది మాత్రమే భారతీయులు ఉన్నారని వారు స్పష్టంచేశారు. అయితే, రోడ్డు ప్రమాదంలో చనిపోయినవారిలో ఇద్దరు మలేషియన్లు, ముగ్గురు ఈజిప్షియన్లు కూడా ఉన్నారని, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది.

### ఫిజీలో తుఫాన్ బీభత్సం

**వెల్లింగ్‌టన్, డిసెంబర్ 29:** పర్యాటక ప్రాంతం 'ఫిజీ' దీవిని ఉష్ణమండల తుఫాన్ 'సరాయ్' అల్లకల్లోలం చేసింది. తుఫాన్ తీవ్రతకు ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. 2.500 మందిని రెస్క్యూటీం పునరావాస కేంద్రాలకు తరలించింది. తుఫాన్ తీవ్రతతో పలు ఇండ్లు, పంటలు, చెట్లు ధ్వంసమయ్యాయి. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫిజీలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన పలువురు పర్యాటకులు తుఫాన్‌ధాటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ విద్యార్థి(18) కదవు ద్వీపంలో మునిగిపోయాడని జాతీయ విపత్తు నిర్వహణ కార్యాలయ డైరెక్టర్ వసిటి సోకో తెలిపారు. విటిలేవు ద్వీపం సమీపంలోకి మరోవ్యక్తి(40) మృతదేహం కొట్టుకొచ్చిందని చెప్పారు. 2,538 మందిని రక్షించి 70 పునరావాస కేంద్రాలకు తరలించినట్టు చెప్పారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 30 డిసెంబర్ 2019

# వైకుంఠపురి.. సంగీతఝరి



అల్లు అర్జున్, పూజాహెగ్డే

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అల వైకుంఠపురములో'. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మాతలు. పూజాహెగ్డే కథానాయిక. జనవరి 12న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సినిమా మ్యూజిక్ ఫెస్టివల్‌ను జనవరి 6న హైదరాబాద్‌లో నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఇప్పటివరకు విడుదలైన అన్ని గీతాలు జనాదరణ పొందాయి. అల్లు అర్జున్ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ ఆల్బమ్‌గా నిలిచింది. తమన్ బాణీలు సంగీతప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మ్యూజికల్ ఫెస్టివల్‌ను వినూత్నరీతిలో నిర్వహించబోతున్నాం. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భారీ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. టబు, రాజేంద్రప్రసాద్, సచిన్‌ఖేడ్‌కర్, తనికెళ్ల భరణి, మురళీశర్మ, సముద్రఖని, జయరాం, సునీల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీఎస్ వినోద్, సంగీతం: తమన్, ఎడిటర్: నవీన్‌నూలి, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: పీడీవీ ప్రసాద్, రచన–దర్శకత్వం: త్రివిక్రమ్.



కాలభైరవ, రితేష్ రానా, చెర్రి, కీరవాణి, శ్రీసింహా, రవిశంకర్, నరేష్

# కంటెంట్ ఈజ్ కింగ్

'2000 సంవత్సరంలో కెరీర్, డబ్బుల పరంగా బ్యాడ్ టైమ్‌ను ఎదుర్కొన్నాను. కుటుంబసభ్యుల బాధ్యతలు నాపై ఉండటంతో ఇబ్బందులు పడ్డాను. ఆ సమయంలో శ్రీసింహాకు నాలుగేళ్లు. ఓ రోజు సింగపూర్ వెళ్లాలనే ప్రతిపాదన ఇంట్లో వచ్చింది. అక్కడకు వెళ్లేంత డబ్బులు నా దగ్గర లేవని చెప్పాను. నేను తీసుకెళతా అని శ్రీసింహా అన్నాడు. ఆ ప్రామిస్‌ను ఈ సినిమాతో వచ్చిన పారితోషికం ద్వారా శ్రీసింహా నెరవేర్చుతాడనే నమ్మకముంది' అని అన్నారు సంగీత దర్శకుడు కీరవాణి. ఆయన తనయుడు శ్రీసింహా కథానాయకుడిగా పరిచయమైన చిత్రం 'మత్తు వదలరా'. మైత్రీ మూవీస్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చెర్రి, హేమలత ఈ చిత్రాన్ని నిర్మించారు. రితేష్‌రానా దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్ర బృందం ఏవల్యూషన్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కీరవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ 'నూతన తారాగణంతో చేసిన ఈ సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచనతో ప్రమోషన్స్‌ను రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా చేశాం. ఆ వైవిధ్యతే సినిమా పట్ల అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. కంటెంట్ ఈజ్ కింగ్ ఈ సినిమా మరోసారి నిరూపించింది. నవ్విస్తూనే థ్రిల్‌ను పంచుతున్నది. థియేటర్ల సంఖ్యను పెంచుతున్నాం' అని చెప్పారు. 'ప్రస్తుతం వైవిధ్యమైన కథలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. కొత్తదనంతో కూడిన సినిమాలే ఎక్కువగా పేరు, గుర్తింపు తెచ్చిపెడతాయి. కాన్సెప్ట్ ఓరియెంటెండ్ సినిమాలతో కెరీర్‌లో ఒక్కో మెట్టు ఎదిగినప్పుడే సంతృప్తి ఉంటుంది. ఆ ఆలోచనతో ఈ సినిమాలో నటించాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మైత్రీ సంస్థలోనే హీరోగా తొలి సినిమా చేయడం ఆనందంగా ఉంది' అని శ్రీసింహా చెప్పారు. కాలభైరవ మాట్లాడుతూ 'అరంగేట్రానికి చిన్న సినిమాను ఎంచుకోవడానికి కారణమేమిటని చాలా మంది అడుగుతున్నారు. సినిమాల్ని సెలెక్ట్ చేసే లగ్జరీ మాకు లేదు. సినిమా అవకాశం రావడమే గొప్ప విషయం. కథాబలమున్న మంచి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ప్రేక్షకులంతా నేపథ్య సంగీతంతో కనెక్ట్ కావడం సంతోషాన్ని కలిగించింది' అన్నారు. దర్శకుడు రితేష్ రానా మాట్లాడుతూ 'కామెడీ, రొమాంటిక్ ట్రాక్‌లు లేకుండా సినిమా తీయాలంటే నిర్మాత మమ్మల్ని నమ్మాలి. చెర్రి, మైత్రీ నిర్మాతలు నన్ను, నా కథను పూర్తిగా నమ్మి ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే కాన్ఫిడెన్స్‌తోనే చేశారు. 40, 50 ఏళ్ల వయసు వారు పాటలు లేకపోయినా సినిమా బాగుందని చెబుతున్నారు. సిట్యుయేషన్ కామెడీకే ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ ఈ సినిమా రూపొందించాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్ అగస్త్య , సురేష్ సారంగం, థామస్ తదితరులు పాల్గొన్నారు.



'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో తమన్నా

# పరువాల మోతమోగనీరో..



గోపీసుందర్, కల్యాణ్‌రామ్, సతీష్ వేగేశ్న, రాహుల్ సిప్లిగంజ్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎంత మంచివాడవురా'. సతీష్‌వేగేశ్న దర్శకుడు. మెహరీన్ కథానాయిక. ఆదిత్య మ్యూజిక్ పతాకంపై ఉమేష్‌గుప్తా, సుభాష్‌గుప్తా నిర్మిస్తున్నారు. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పకుడు. జనవరి 15న ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్రంలోని 'జాతరో జాతర..' అనే రెండో గీతాన్ని ఇటీవల విడుదల చేశారు. 'జాతరో జాతర నేనొస్తే జాతరో పరువాల మోత మోగనీరో..' అనే పల్లవితో సాగే ఈ పాటకు గోపీసుందర్ స్వరాల్ని సమకూర్చారు. శ్రీమణి సాహిత్యాన్ని అందించగా రాహుల్ సిప్లిగంజ్, సాహితి చాగంటి ఆలపించారు. 'టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. కుటుంబ అనుబంధాల ఔన్నత్యాన్ని తెలిపే కథాంశామిది. ఆర్థిక సంబంధాల కంటే హార్థిక సంబంధాలే గొప్పవనే అంశాన్ని తెలియజెపుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. నరేష్, సుహాసిని, శరత్‌బాబు, తనికెళ్ల భరణి, పవిత్రాలోకేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్‌తోట, సంగీతం: గోపీసుందర్, రచన–దర్శకత్వం: సతీష్ వేగేశ్న.

# జగదీష్ దానేటి హాలీవుడ్ ఎంట్రీ



జగదీష్

టాలీవుడ్ దర్శకనిర్మాత జగదీష్ దానేటి హాలీవుడ్‌లో అరంగేట్రం చేయబోతున్నారు. అంతర్జాతీయ చిత్రాలకు క్రియేటివ్ కన్సల్టింగ్‌గా పనిచేసిన ఆయన హాలీవుడ్ ప్రఖ్యాత ప్రొడక్షన్ కంపెనీ 'మార్టిని ఫిలిమ్స్' వంటి అమెరికన్ ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీలతో ఒప్పందాలను కుదుర్చుకున్నారు. లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆల్ పచినో, నికోలస్ కేజ్, జాన్ ట్రవోల్టా వంటి ప్రముఖులతో సినిమాలు చేసిన హాలీవుడ్ దర్శకనిర్మాత జానీ మార్టిన్‌ను జగదీష్ దానేటి కలుసుకున్నారు. జగదీష్ దానేటి దర్శకత్వం వహించబోతున్న హాలీవుడ్ చిత్రాలకు తాను నిర్మాణ భాగస్వామ్యం వహిస్తుండటం ఆనందంగా ఉందని జానీ మార్టిన్ తెలిపారు. 2020 ప్రథమార్థంలో ఈ సినిమాలను సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. నిజమైన సినిమా ఔత్సాహికులకు, నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, నటులకు వివక్ష లేకుండా తాను రూపొందించే చిత్రాల్లో అవకాశం ఇవ్వడమే కాకుండా సినిమాల పరంగా ఉన్న భౌగోళికపరమైన హద్దుల్ని చెరిపివేయలన్నదే తన లక్ష్యమని జదగీష్ దానేటి పేర్కొన్నారు. రష్యా, చైనా, హాంకాంగ్, అమెరికాలోని ఫిల్మ్ కమీషన్స్‌తో సంయుక్తంగా చిత్రాల్ని నిర్మించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

# స్ట్రెయిట్ సినిమాలా ఉంటుంది



తాతారెడ్డి

'గౌతమ్‌మీనన్ తెరకెక్కించిన ప్రేమకథలకు పూర్తి భిన్నమైన చిత్రమిది. యాక్షన్ ఇతివృత్తంతో నవ్యమైన అనుభూతిని పంచుతుంది' అని అన్నారు జి. తాతారెడ్డి. జి.సత్యనారాయణరెడ్డితో కలిసి ఆయన నిర్మించిన చిత్రం 'తూటా'. ధనుష్, మేఘాఆకాష్ జంటగా నటించారు. గౌతమ్‌మీనన్ దర్శకుడు. తమిళ చిత్రం 'ఎన్నై నోకిపాయుమ్ తోట'కి అనువాదమిది. జనవరి 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో తాతారెడ్డి పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ప్రేమ, అండర్‌వరల్డ్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ముడిపడిన కథ ఇది. యాక్షన్ ప్రధానంగా సాగుతూ ఉత్కంఠను పంచుతుంది. తెలుగు ప్రేక్షకుల్ని అలరించే అన్ని హంగులుంటాయి. తమిళంతో పోలిస్తే స్క్రీన్‌ప్లే రేసీగా ఉండాలనే ఆలోచనతో నిడివిని ఇరవై నిమిషాలు తగ్గించాం. అనువాద సినిమా అయినా స్ట్రెయిట్ సినిమా చూస్తున్న ఫీలింగ్‌ను కలిగిస్తుంది. సిధ్ శ్రీరామ్ ఆలపించిన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. గతంలో పంపిణీదారుడిగా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా', 'లవర్స్ డే' సినిమాలకు పనిచేశాను. స్ట్రెయిట్ సినిమాల్ని నిర్మించే ఆలోచనలో ఉన్నాం. గౌతమ్‌మీనన్ మా సంస్థలో సినిమా చేస్తానని మాటిచ్చారు. కొత్త దర్శకులతో సినిమాలు చేయాలనుంది' అని అన్నారు.

# టూరింగ్ టాకీస్ కథ



భానుశ్రీ

బిగ్‌బాస్ ఫేమ్ భానుశ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'టూరింగ్ టాకీస్'. విజయ్ పెద్దిరెడ్డి కథానాయకుడు. రంగనాథ్ ముత్యాల దర్శకుడు. ఎంటర్‌టైన్‌మెంట్ ప్లస్ పతాకంపై ప్రేమ్‌నాథ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'విభిన్న కథాంశంతో రూపొందిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. భానుశ్రీ పాత్ర కొత్త పంథాలో సాగుతుంది. యువతను ఆకట్టుకునే అన్ని అంశాలుంటాయి. వినోదానికి పెద్ద పీట వేశాం. యాక్షన్ ఎపిసోడ్స్ రొమాంచితంగా సాగుతాయి. వేసవి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. సంపత్‌రాజ్, జబర్దస్త్ చిట్టిబాబు, గుండు మురళి, అర్జునరెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎన్.డి.ఉదయ్, సంగీతం: ఉమమహేష్, సంభాషణలు: శివ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రంగనాథ్ ముత్యాల.

# విలన్‌గా సునీల్



సునీల్

హాస్యనటుడిగా కెరీర్‌ను ప్రారంభించిన సునీల్ కథానాయకుడిగా మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. తాజాగా ఆయన విలన్‌గా నటించబోతున్నారు. కమెడియన్ సుహాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కలర్‌ఫొటో'. సందీప్‌రాజ్ దర్శకుడు. సాయిరాజేష్ నీలం, బెన్నీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సునీల్ విలన్‌గా నటించనున్నట్లు దర్శకుడు వెల్లడించారు. ప్రతినాయకుడిగా సునీల్ ఎలా ఉంటారో ఈ సినిమాలో చూడబోతున్నారని ప్రకటించారు. చిత్ర ఫస్ట్‌లుక్‌ను హీరో నాని ఆదివారం ట్విట్టర్ ద్వారా విడుదలచేశారు. 1995లో ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే ప్రేమకథతో ఈ సినిమా తెరకెక్కుతున్నది. 'మత్తు వదలరా' ఫేమ్ కాలభైరవ సంగీతాన్ని సమకూర్చుతున్నారు.

# 'కార్తికేయ' సీక్వెల్‌లో..



అనుపమ పరమేశ్వరన్

మిస్టరీ థ్రిల్లర్ ఇతివృత్తంతో వచ్చిన 'కార్తికేయ' (2014) చిత్రం మంచి విజయాన్ని దక్కించుకుంది. కథానాయకుడు నిఖిల్ కెరీర్‌లో చక్కటి కమర్షియల్ సక్సెస్‌గా నిలిచింది. దర్శకుడు చందు మొండేటికి శుభారంభాన్ని అందించింది. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కార్తికేయ–2' చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాలో కథానాయికగా అనుపమపరమేశ్వరన్ ఖరారైనట్లు సమాచారం. పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, మలయాళం, తమిళ పరిశ్రమల్లో అనుపమ పరమేశ్వరన్‌కు ఉన్న ఇమేజ్ దృష్ట్యా ఆమెను కథానాయికగా ఎంపిక చేశారని చెబుతున్నారు. జనవరి ప్రథమార్థంలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. కుంభమేళా నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే కథాంశమిదని అంటున్నారు. ఈ ఏడాది 'రాక్షసుడు' చిత్రం ద్వారా అనుపమ పరమేశ్వరన్ తెలుగులో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

# నవతరం ప్రేమాయణం



కవిత, సుమన్

సుమన్, కవిత ప్రధాన పాత్రల్లో అమృత సత్యన్నారాయణ క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. అలం సందీప్, ప్రమీల నాయకానాయికలుగా నటిస్తున్నారు. బొంతు శ్రీనివాస్ దర్శకుడు. ఏ.వి. భాస్కర్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకున్నది. ప్రస్తుతం ఆఖరి షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'నేటి ట్రెండ్‌కు తగిన కథ, కథనాలతో రూపొందిస్తున్న చిత్రమిది. ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరిస్తున్నాం. మంచిర్యాల, కోనసీమలలో రెండు షెడ్యూల్స్ చిత్రీకరించాం. త్వరలో టైటిల్‌ను ప్రకటించనున్నాం. జనవరి 24న ఆడియోను విడుదలచేస్తాం' అని తెలిపారు. జెన్నీ, ఆశా, విజయభాస్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:చిన్నికృష్ణ, సినిమాటోగ్రఫీ: శూలం ప్రసాద్.

పడి పడి నవ్వుతుండగా, ప్రతి థియేటర్ లో పండగే...

